అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి: 50 సంచిక: 1 388 జనవరి 2022 పేజీలు: 52 వెల: రూ॥ 20/-

సాంఘిక విముక్తి కోసం ప్రత్యామ్నాయ సంస్కృతి



విరసం 28వ మహాసభలు

8,9 జనవరి 2022, నెల్లూరు.

సంస్కృతి - మార్క్సిజం

పుస్తకావిష్కరణలు

'సైరన్' - అల్లం రాజయ్య నవల
పద్మకుమారి

'సాహిత్య లేఖలు' - వి. చెంచయ్య
కాత్యాయని విద్మహే

'రెప్పవాల్చని కాపల' - ఎన్. వేణుగోపాల్ కవిత్వం
వి. చెంచయ్య



'సాహిత్య స్పందన' - పి. కోటయ్య
సి.యస్.ఆర్. ప్రసాద్

'అమ్మ జ్ఞాపకాలు' - ఆలూరి లలిత స్మృతిలో
భవాని

'ఫాసిజం' - ముక్తవరం పార్థసారథి
రమాసుందరి



'భూమిరంగు మనుషులు' - కెక్యూబ్ వర్మ కవిత్వం
శివరాత్రి సుధాకర్



'ఖబర్ కె సాత్' - శ్రీనివాస మూర్తి కథలు
ఎన్. వేణుగోపాల్



'పూల పరిమళం' - కోడం కుమార్ కవిత్వం & 'వర్తమానం' - కట్టా భగవంత రెడ్డి
మోతుకూరి శ్రీనివాస్

'ఈవేళప్పుడు' - అరసవిల్లి క్రిష్ణ
దగ్గుమాటి పద్మాకర్



'తత్వశాస్త్రం అంటే ఏమిటి?' (హోవర్డ్ సెల్సం) - ముక్తవరం పార్థసారథి అనువాదం
కోడం కుమార్



'విప్లవ కెరటం' గద్దం కోటారెడ్డి
మోహన్ మురళి



'దృశ్యాంతరం' - కె. నాగేశ్వరాచారి
పాణి

'అటుగా వంగిన ఆకాశం' - వైష్ణవిశ్రీ కవిత్వం
నల్లూరి రుక్మిణి



'ఉన్నవ వెంకటరామయ్య జీవిత చరిత్ర' - సంగ్రామ్
మేఘరాజ్

'కనిపించని శత్రువు' - మెట్టు మురళీధర్ నవల
టి. రాజ్యలక్ష్మి

'నల్లమల పరిరక్షణ - బహుజన బతుకమ్మ'
విమల

'ప్రకృతి వ్యవసాయం - బహుజన బతుకమ్మ'
అనిత



హాజరైన సాహితీ మిత్రులు

KRSA 101 M109

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి : 50 ◆ సంచిక : 1 ◆ జనవరి 2022 ◆ వెల : రు. 20/-

ఆ ముస్లిం మహిళలకు సెల్యూట్

పి.వరలక్ష్మి

జనవరి 1 ఎవరికెలా తెల్లారిందో గాని మన దేశం విద్వేష సాంస్కృతి దుర్గంధంతో ఉలిక్కపడి కళ్లు తెరిచింది. ఎంతమంది పౌరుల స్పృహలో ఉందో గాని ఇది మన సాంస్కృతిక పతనానికి కొండగుర్తుగా మిగిలిపోనుంది. సుమారు వంది మంది మహిళల ఫోటోలు, వ్యక్తిగత వివరాలు బుల్లీబాయ్ యాప్ పేరుతో ఒక వెబ్‌సైట్‌లో ఉంచి వారిని వేలానికి పెట్టారు. వీరంతా ముస్లిం మహిళలు. అందరూ సామాజిక కార్యాచరణలో తమ సొంత గుర్తింపు పొందినవారు. జర్నలిస్టులు, కళాకారులు, పరిశోధకులు, ఉద్యమ కార్యకర్తలు దాదాపు అన్ని వయసుల వాళ్లు ఇలా దాడికి గురయ్యారు. వారంతా తమ కొత్త సంవత్సరాన్ని ఎంతటి జుగుప్సతో, ఆవేదనతో మొదలుపెట్టి ఉంటారో ఊహించవచ్చు. ఇలా జరగడం మొదటిసారి కాదు. ఆరు నెలల క్రితం సుల్లీ డీల్స్ పేరుతో ఎనభై మంది ముస్లిం మహిళల ఫోటోలను ఇలాగే ప్రదర్శించారు. చట్టం వైపు నుండి ఏ చర్యా లేదు, ఆ యాప్‌ను తొలగించడం తప్ప. అందుకే ఆరోజు దీనిని గురించి రాసిన జర్నలిస్టు ఇప్పుడు అటువంటి స్థితిలోనే తనను తాను చూసుకోవాల్సి వచ్చింది. అందుకే ఆరోజు దానిని తొలగించినంత సులభంగానే ఏ జంకూ లేకుండా మళ్లీ అటువంటి యాప్‌ను తయారుచేసి పెట్టారు. ముస్లిం మహిళలను అవమానపరుస్తూ పెట్టిన ఈ రెండు యాప్‌ల పేర్లు వారి భాషలోనే వారిని ఘోరంగా హీనపరిచేవి.

కొన్నేళ్లుగా పెచ్చరిల్లిపోతున్న మూకదాడుల పరంపరంలోనే ఆన్‌లైన్ వేధింపులు ఒక పద్ధతి ప్రకారం చలరేగిపోతున్నాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేయడానికి, విద్వేషాలు వాప్తి చేయడానికి, ప్రభుత్వం విధానాల పట్ల, ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు భావజాలం పట్ల విమర్శనాత్మకంగా ఉన్న వారిని మానసికంగా వేధించడానికి బిజెపి ఐటి సెల్ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ లక్షలాదిగా సోషల్ మీడియా సైన్యాన్ని నిర్వహిస్తున్నది. తన పెంపుడు ఎలెక్ట్రానిక్ మీడియాకు ఇది అదనం. వీళ్లంతా కలిసి ఒక హేయమైన సంస్కృతిని వ్యాప్తి చేశారు. భిన్నాభిప్రాయాల పట్ల అహసనంతో ఊగిపోవడం, అసభ్యకరంగా తిట్లకు దిగడం ఇప్పుడు మామూలైపోయింది. ఎంపిక చేసుకొని అలా దాడి చేసేవాళ్లకు స్పష్టమైన లక్ష్యం ఎలాగూ ఉంటుంది. అయితే దానితో పాటు ఇది ఒక తరహా మూక సంస్కృతిని ఆన్‌లైన్‌లో వ్యాపింపజేస్తున్నది. ఇది అసలు ప్రమాదం.

పై రెండు యాప్‌లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు సందేశాలున్నాయి. కొంత కాలంగా ముస్లిం సమూహాలపై దాడులు పెరిగిపోతున్న క్రమంలోనే అత్యద్భుతమైన సాహసిక స్వరాలు ముస్లిం మహిళల నుండి పెల్లుబికి వస్తున్నాయి. ఎవరూ ఊహించని షాహీన్‌బాగ్ ఉద్యమం ఫాసిస్టు శక్తుల్ని కొన్ని నెలల పాటు ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆ రహస్యాన్ని పట్టుకోడానికి ఇప్పటికీ ఎన్ఐఎ ఏవేవో దొంగకేసులు అల్లుతూనే ఉంది. పీడిత సమూహాలు ఒక అనివార్యమైన ప్రతిఘటనా చైతన్యాన్ని సంతరించుకోవడమే అందులోని రహస్యం. అది ఫాసిస్టులకు తెలీక కాదు. అందుకే ఏ సమూహం నుండి వారు ముందుకువచ్చారో, ఏ చైతన్యంతో అందులోని పరిమితుల్ని అధిగమించి బైటికొస్తున్నారో దానిని లక్ష్యం చేసుకున్నారు. మామూలుగా ఇస్లాంలోని పితృస్వామిక పీడిన గురించి మొసలి కన్నీరు కార్చేవారు ఆ సమూహంలోని స్త్రీలే దానిని అధిగమించి బైటికి వస్తే ఓర్చుకోలేరు. ట్రిపుల్ తలాక్‌నో, బురఖానో విమర్శించడం ఆ స్త్రీల పట్ల నిజమైన సానుభూతితో కాదు, పరాయి మతం పట్ల చిన్నచూపుతో మాత్రమే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు ఈ ఆన్‌లైన్ పోకిరీలు లక్ష్యం చేసుకున్న మహిళలంతా అవమానంతో ముడుచుకొనిపోయి ఇళ్లలో ఉండిపోవాలని వాళ్ల ఉద్దేశం.

ఏనాడూ బైటి ప్రపంచం ఎరగని ఫాతిమా నఫీజ్ వంటి అరవై ఏళ్ల మహిళ, తన కొడుకును యూనివర్సిటీ క్యాంపస్ నుండి అన్యాయంగా మాయం చేస్తే అయిదేళ్లుగా పోరాడుతోంది. ఇప్పుడు ఆమెను అమ్మకానికి పెట్టినట్లు వెబ్‌సైట్‌లో చూపించడం వెనక ఉన్న వికృతమైన ఆలోచన ఇదే. ఆమె కొడుకు నజీబ్‌ను మాయం చేసింది ఎబివిపి వాళ్లన్నది బహిరంగంగా వినిపిస్తున్న మాటే అయినప్పుడు ఈ వికృతాల వెనక ఎవరుంటారు అనేది కూడా బహిరంగమే. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో పనిచేస్తున్న కశ్మీరీ మహిళా జర్నలిస్టులు బాధితుల్లో ఉన్నారు. వారిని ఎవరు లక్ష్యం చేసుకుంటారో చెప్పాల్సిన పనిలేదు. బుల్లీ యాప్‌కు అనుసంధానమైన ట్విట్టర్ ఖాతా పనిగట్టుకొని ఒక సిక్కు వ్యక్తి పేరుమీద తెరవబడిందని తెలిశాక ఇది మరింత స్పష్టమైంది. రైతాంగ ఉద్యమ నేపథ్యంలో ముస్లింలలాగే సిక్కులను లక్ష్యం

(మిగతా 9వ పేజీలో)

సంచిక - 388

అరుణతార నిర్వహణ, శాశ్వత నిధుల కోసం మా ప్రకటన చూసి ***కుమార్ గౌడ్, హైదరాబాద్:*** *రూ. 15,000/-, ఎస్.ఎన్.రాజు, హైదరాబాద్ :రూ. 15000/-, డా.ఎల్లయ్య, హైదరాబాద్ - రూ. 1000/-, ఉణుదుర్తి సుధాకర్, హైదరాబాద్ : రూ. 1000/- విరాళంగా ఇచ్చారు. వారికి మా ఉద్యమాభినందనాలు.*

ఎడిటర్
అరసవిల్లి కృష్ణ

వర్కింగ్ ఎడిటర్
పి. వరలక్ష్మి

రచనలు పంపించాల్సిన చిరునామ :
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు-516360.

* email : **arunatara1977@gmail. com**

Like Page:
https://facebook.com/virasam.org

facebook :
https://www.facebook.com/virasam.arunatara

Virasam website :
www.vasanthamegham.com

చందాలు, విరాళాలు పంపవలసిన చిరునామా
అరసవిల్లి కృష్ణ, 6-1/16-7ఎ/1, పెద్దిరాజు స్ట్రీట్, ప్రైజర్‌పేట, విజయవాడ-520001.
చెక్‌లు / డ్రాఫ్టులు / ఆన్‌లైన్‌లో పంపడానికి
A. Krishna, Bank : State Bank of India, A/c. No. 52018355595, IFSC : SBIN0020714, Branch : Vagu Center, Vijaywada.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ప్రకారం సంపుటి, సంచికల సంఖ్యను **2022 జనవరి నుండి సరిచేస్తున్నాం. సంపుటి **50** గాను, సంచిక **1** గాను సరిచేసాం. వరుస సంఖ్య యథావిధిగా **388** కొనసాగుతుంది. -సం.*

వసంతమేఘం

www.vasanthamegham.com ✦ సాహిత్య, రాజకీయార్థిక పక్షపత్రిక

వసంతమేఘం అంతర్జాల పక్ష పత్రిక చదవండి. గతంలో విరసం.ఆర్గ్‌లాగే వసంతమేఘాన్నీ ప్రోత్సహించండి. రచనలు పంపించండి. మీ రచనలతో, విమర్శలతో, సూచనలతోనే వసంతమేఘం విప్లవ, ప్రజా సాహిత్య సాంస్కృతికోద్యమంలో తన కర్తవ్యాలను నెరవేర్చగలుగుతుంది. **- వసంతమేఘం టీం**

ఈ సంచికలో

సంపాదకీయం (3,9)
ఆ ముస్లిం మహిళలకు సెల్యూట్ - పి.వరలక్ష్మి
లేఖలు (6)
అనసూయ తేల్‌తుంబ్డే మరణించలేదు -ఆనంద్ సహచరుడు
లాల్‌నీల్ పై మరింత చర్చించాలి -రాములు పిన్నమనేని
రిపోర్ట్
సంస్కృతీ సిద్ధాంతీకరణ, సాంస్కృతిక ప్రత్యామ్నాయాల దిశగా విరసం సభలు (7-9)
28వ విరసం మహాసభల తీర్మానాలు (12-14)
రెండేళ్ల సంస్థాగత నివేదిక-భవిష్యత్ ప్రణాళిక - రివేరా (10-12)
మహాసభల్లో ఆవిష్కరించిన పుస్తకాలు (50)
పత్రికా ప్రకటన (15)
విరసం మహాసభలను విజయవంతం చేసిన... - విరసం
ప్రసంగ పాఠం (16-17,31)
సంస్కృతి కోసం పోరాటాలు-వర్గపోరాటం - మెట్టు రవీందర్
కవిత్వం (18-19)
అప్పుడు రాత్రీ పగలే - బసంత్ బ్రావి,
సోదా - ఉదయమిత్ర, చివరిదాక-కిరణ్, నీ ఊపిరి ఒక నవ్వుగా మారాలి-దొంతం చరణ్
ఇంటర్వ్యూ (20-27)
భారతీయ నవల: భావోద్వేగాల గతితార్కిక వ్యక్తీకరణ - అల్లం రాజయ్య
కథ (28-31)
ప్రతీకారం: మొలకలపల్లి కోటేశ్వరరావు
రెయిన్‌బో (32-33)
లైంగిక వైవిధ్యాలు ఎలా ఏర్పడతాయి -బిట్టు కెఆర్
వ్యాసం
విప్లవోద్యమ వ్యక్తిత్వమే సాకేత్ - యామిని (34-37)
వర్గపోరాట ఆచరణలో సంస్కృతీ నిర్మాణం - ప్రగతి (38-45)
నూరేళ్ల 'మాలపల్లి' ప్రత్యేక వ్యాసం (46-50)
ఐతిహాసిక నవల మాలపల్లి - కాత్యాయని విద్మహే

వసంతమేఘం అంతర్జాల పత్రికలో..

డిసెంబర్ 15, 2021 సంచిక

సంపాదకీయం: రైతులకు విజయం, మరి ఆదివాసులకు ఎప్పుడు? **-సాగర్**
సమీక్ష: చీకటి నుండి వెలుగు దాకా **-అరసవిల్లి కృష్ణ**
వ్యాసాలు :
వర్గ పోరాట ఆచరణలో సంస్కృతి **-ప్రగతి**
ఏది సంస్కృతి? **-చలసాని ప్రసాద్**
వ్యక్తిగత గోప్యతకు తూట్లు **-ఎ.నరసింహారెడ్డి**
విపత్తు అంచులో మానవాళి **-నేదునూరి కనకయ్య**
విప్లవ మానవుడు **-బి.అనూరాధ**
ఇవ్వాల్టి రేపటి కవిత్వం **-పాణి**
కాలమ్స్:
అలనాటి రచన: రాజూ-పేదా -**వెంకటరావు**
లోచూపు: ప్రేమమయి, సాంస్కృతిక వారధి **-మెట్టు రవీందర్**
కథావరణం: పెత్తనం చలాయించే కర్ర చేతులు మారితే ఆ కథే వేరు! **-పలమనేరు బాలాజీ**
ఓపెన్ పేజీ:
ఏ వెలుగులకు ఆ వెన్నెల **-పి.వరలక్ష్మి**
అమరావతి రైతుల ఉద్యమం-ప్రజాస్వామిక దృక్పథం **-అరుణ్**
కవిత్వం:
నేను **-అర్కే**
బతుకు పోరాటం **-కలీం**
సిగరి పొద్దు **-రివేరా**
జరూర్ **-గిరిప్రసాద్ చెలమల్లు**
హత్యలు కాని హత్యలు **-తెలుగు వెంకటేశ్**
అతను పాలపుంత **-వద్దెబోయిన శ్రీనివాస్**
నూతన మానవుడు **-నాగేశ్వర్**

జనవరి 1, 2022 సంచిక

సంపాదకీయం: బీహార్ విప్లవ సాహిత్యోద్యమ శిఖరం **-సియస్ఆర్ ప్రసాద్**
సమీక్ష: జీవితం మలచిన కవి **-వి.మిత్ర**
వ్యాసాలు:
ఏడు నెలల మహత్తర సిలిగేర్ పోరాటం **-రితేష్ మిశ్రా**
సంఘటితం అవుతున్న బస్తర్ ఆదివాసీ పోరాటాలు **-విష్ణుకాంత్ తివారీ, రఘునాక్ శివహరే**
కొత్త పుస్తకం: భూమిరంగు కవి **-పాణి**
కొత్త పుస్తకం: విప్లవ సాహిత్య విమర్శకు విలువైన చేర్పు -ఎన్.వేణుగోపాల్
సంభాషణ: ప్రహార్‌కు వ్యతిరేకంగా ప్రపంచ స్పందన -ఐసిఎస్‌పిడబ్ల్యూఇ
ఇంటర్వ్యూలు:
రాజకీయ చదరంగంలో ప్రజలే పావులు **-అరుణ్**
సీమ ఆకాంక్షల పట్ల నిర్లక్ష్యం **-బొజ్జా దశరథరామిరెడ్డి**
కాలమ్స్:
ఆర్థికం: అసమానతల భారతం -ఎ.నరసింహారెడ్డి
అలనాటి రచన: చెదిరిన సమాజం **-వెంకటరావు**
లోచూపు: కాషాయ ఫాసిజం ఒక విషపూరిత కషాయం **-మెట్టు రవీందర్**

అనసూయ తెల్‌తుంబ్డే మరణించలేదు

'అరుణతార' సంపాదకులకు,

'మేధావి, సృజనశీలి' మిలింద్ తెల్‌తుంబ్డే తల్లి అనసూయ తెల్‌తుంబ్డే మరణించలేదు. మరాఠీ మూలంలో రాసిన 'మిలింద్ మిత్ర మండలికి తెలియకపోవడం ఆశ్చర్యం విచారం కూడ. ఇంక తెలుగు స్వేచ్ఛానువాదం చేసినవారికి తెలియకపోవడం సరియైందికాదు. ఎందుకంటే మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో కూడ ఉద్యమాభిమానుల దృష్టికి ఇది విస్తృతంగా వచ్చిన విషయం. తన తమ్ముడు అమరుడైన వార్త తెలియగానే తలోజా జైల్లో రెండు సంవత్సరాలుగా ఉన్న ఆయన పెద్దన్న ఆనంద్ తెల్‌తుంబ్డే అనసూయ గారి ఎనిమిది మంది సంతానంలో అందరికన్నా పెద్ద వాడయినందున తన తల్లిని ఫోన్‌లో పరామర్శించడానికి ఎన్ఐఏ కోర్టు అనుమతి కోరాడు. ఎన్ఐఏ కోర్టు అనుమతించింది. ఆ మేరకు ఆయన న్యాయవాది ఇచ్చిన లేఖను మరో న్యాయవాది జైలు అధికారులకు స్వయంగా వెళ్లి ఇచ్చినా జైలు వాళ్లు ఇప్పటికీ ఆ అవకాశం కల్పించలేదు. ఆనంద్ తెల్‌తుంబ్డే పదిహేను రోజుల కోసం బెయిల్ దరఖాస్తు చేసుకుంటే మాత్రం ఎన్ఐఏ కోర్టు తిరస్కరించింది. హైకోర్టులో వేసిన పిటిషన్ నెల పదిహేను రోజులు దాటినా ఇప్పటికీ విచారణకు రాలేదు. ఇవన్నీ నాకు కూడ సోషల్ మీడియా ద్వారా తెలిసిన విషయాలే. 'వైర్'లోనో 'స్క్రోల్' లోనో ఇప్పుడు గుర్తులేదు గానీ ఒక జర్నలిస్టు 'మామ తెల్‌తుంబ్డే (అమ్మ తెల్‌తుంబ్డే) అని తనకెంతో ఇష్టమైన చిన్న కొడుకును పోగొట్టుకుని, రెండేళ్లకు పైగా చూడజాలకపోయిన పెద్దకొడుకు రాలేని స్థితిలో ఎంత గుండెకోతకు గురవుతున్నదో ఎంతో భావోద్వేగంగా రాశాడు. సంపాదక వర్గంలో ఎవరో ఒకరయినా సామాజిక మాధ్యమాలు చూస్తూ ఉంటారని భావిస్తున్నాను. అనసూయ తెల్‌తుంబ్డే గారి వయసు 92 ఏళ్లు. ఆనంద్ తెల్‌తుంబ్డే, మిలింద్ తెల్‌తుంబ్డేలు తెలిసిన మహారాష్ట్ర దళిత, ఆదివాసీ, ప్రజాస్వామ్య, విప్లవ ఉద్యమాభిమానులు ఎందరో ఆమెను మామ, తాయి (అమ్మ) అని పిలుచుకుంటారు.

కా. మిలింద్ తెల్‌తుంబ్డే అటవీ ఉద్యమంలో, గడ్చిరోలి జిల్లాలో కూడ నిర్వహించిన విప్లవోద్యమ పోరాటాల సందర్భంలో స్మరించుకోవాల్సిన మరొక పేరు కామ్రేడ్ నర్మద. ఆ పేరుతో కృష్ణా జిల్లాకు చెందిన నిర్మల దశాబ్దాలుగా గడ్చిరోలి జిల్లా బాధ్యురాలిగా పనిచేసి క్యాన్సర్ వ్యాధి నాలుగవ దశకు చేరుకున్న తీవ్ర అనారోగ్య స్థితిలో సహచరుడు కిరణ్ (సత్యనారాయణ)తో పాటు 2019లో అరెస్టు అయింది. ఇప్పుడు సహచరుడు సత్యనారాయణ (కిరణ్) ఆర్థర్‌రోడ్ (ముంబై) జైల్లో, ఆమె ముంబై క్యాన్సర్ హాస్పిటల్ (అంటే తక్కువ బాధతో మరణించడానికి చేర్చే ఆసుపత్రి)లో ఉన్నది. తెలుగు పాఠకులకు ఈ విషయం తెలపాలనిపించింది.

-ఆనంద్ తెల్‌తుంబ్డే సహచరుడు

లాల్ నీల్‌పై మరింత చర్చించాలి

అరుణతార సంపాదవర్గానికి లాల్‌సలాం

కామ్రేడ్స్, లాల్ నీల్ మైత్రి-నేటి చారిత్రక అవసరం అనే పుస్తకంపై పాణి సమీక్ష, దానిపై లాల్‌నీల్ మైత్రి వేదిక వాళ్ల స్పందన, దానికి పాణి రాసిన లేఖ అన్నీ చదివాను. ఈ మొత్తంలో చర్చలో లాల్ నీల్ ఐక్యత ఆవశ్యకతను, దానికి ఉన్న ఆటంకాలను పాణి వివరంగానే చూశారు. కానీ ఆయన ఇంకా చాలా విషయాలను పట్టించుకోలేదనిపిస్తున్నది. లేదా తాను ఎంచుకున్న పుస్తక సమీక్ష పరిధిలోకి రావని వదిలేశారేమో తెలియదు. ఆయన వ్యాసంపై లాల్ నీల్ ఐక్యతా వేదిక వాళ్లు రాసిన అభ్యంతరాలకు సమాధానం చెప్పినప్పుడైనా అవన్నీ ప్రస్తావించాల్సి ఉండింది. ఆ పుస్తకం సంగతి అటుంచితే లాల్ నీల్ మైత్రి కోసం ప్రయత్నిస్తున్న వాళ్లలో పలువురు మార్క్స్, అంబేద్కర్ చెప్పింది ఒకటే అని సిద్ధాంతీకరిస్తున్నారు. ఆ కారణం వల్ల విప్లవ, దళిత శక్తులు ఐక్యం కావాల్సి ఉన్నదని వాళ్లు అంటున్నారు. యూరప్ సమాజం కోసం మార్క్స్ చెప్పింది, ఇండియా కోసం అంబేద్కర్ చెప్పింది ఒకటే అని వాళ్ల వాదన. ఇదే నిజమైతే మార్క్సిజాన్ని, మావోయిజాన్ని దళితశక్తులు తీసుకోడానికి అభ్యంతరం ఉండకూడదు. కనీసం మార్క్సిజమంటే వ్యతిరేకత ఉండకూడదు. దానికి వాళ్లు సిద్ధం కాలేరు. దేనికంటే దళిత బహుజన శక్తులకు చాలా స్పష్టంగా ఆ ఇద్దరు చెప్పింది ఒకటి కాదని తెలుసు. మధ్యలో లాల్ నీల్ శక్తులు ఐక్యం కావాలని కోరుకొనే వాళ్లే ఈ మాట అంటున్నారు. ఈ రెండు శక్తులు ఒక్కటి అయితే సమాజం మారిపోతుంది కదా అని న్యాయంగా కోరుకొనే వాళ్లు ఉన్నారు. అట్లనే విప్లవం గురించి గట్టిగ మాట్లాడలేని మేధావులు అంబేద్కర్ గురించి మాట్లాడుతూ అంతకంటే విప్లవం ఏమి ఉంటుందని అంటున్నవాళ్లు ఉన్నారు. అంబేద్కర్ నుంచి తీసుకోవాల్సినవి తీసుకోవాల్సిందే. లాల్ నీల్ శక్తులు.. ఐక్యతా. వేదిక వాళ్లు కోరుకుంటున్న కోణంలో ఐక్యమై పని చేయాల్సిందే. అయితే మార్క్సిజం, అంబేద్కరిజం ఒక్కటే అనే వాదన అంబేద్కరిస్టులు చేయడం లేదు. మార్క్సిస్టుల్లో కొందరు చేస్తున్నారు. వీళ్లలో ఒకప్పుడు మావోయిస్టు రాజకీయాలతో ఉన్న వాళ్లు కూడా ఉన్నారు. ఇది సిద్ధాంతపరంగా అభ్యంతరం. పాణి తన వ్యాసంలో ఉసాలాంటి వాళ్లు ఇలాంటి ప్రయత్నం చేశారని రాశారు. ఇప్పుడు కూడా ఆ పని చేస్తున్నవారూ ఉన్నారు. లాల్ నీల్ ఐక్యత పోరాటాల్లోనా? మార్క్సిజం, లెనినిజం, మావోయిజం -అంబేద్కరిజాలను ఐక్యం చేయాలనుకుంటున్న వారూ ఉన్నారు. ముప్పై ఏళ్లుగా ఈ పని చేసి విఫలమైన వారు ఉండగా ఇప్పుడు మళ్లీ ఈ పని చేస్తున్నవారు ఉన్నారు. ఇది లాల్ నీల్ ఐక్యత అనే మంచి పోరాట అవసరాన్ని దారి మళ్లించే అనవసర సిద్ధాంత గందరగోళానికి దారి తీస్తుంది. ఈ విషయంలో మరింత నిర్దిష్టంగా మాట్లాడుకోవాల్సి ఉన్నది. లేకపోతే లాల్ నీల్ ఐక్యత నష్టకరమైన సిద్ధాంత సమస్యలకు దారి తీస్తుంది.

- రాములు పిన్నమనేని, హైదరాబాదు

దోపిడీ వ్యవస్థ నుంచి మానవాళి బైటపడం ఎంత ముఖ్యమో ఆధిపత్య సంస్కృతి నుంచి విముక్తం కావడం అంతే ముఖ్యం. మనుషులు ఉన్న ప్రతి చోట సంస్కృతి వికసిస్తూ వచ్చింది. సంస్కృతి లేని మానవ జీవితాన్ని ఊహించలేం. మనుషులు ఎవరంతకు వాళ్లు జీవించలేరు. ఎవరంతకు వాళ్లు ఉత్పత్తిలో పాల్గొనలేరు. సామాజిక సంబంధాల చట్రంలో భాగంగానే ప్రకృతితో సంపర్కంలో ఉంటారు. ఆహార సేకరణ దశ మినహాయిస్తే మానవులు ఉన్న ప్రతి చోట ఏదో ఒక రూపంలో ఉత్పత్తి ప్రక్రియలు ఉన్నట్లే సాంస్కృతిక వ్యవస్థలు ఉంటూ వచ్చాయి. అత్యంత ప్రాచీనమైన సంస్కృతీ అధ్యయనం చాలా గంభీరమైనది. అది నాగరికతతో, ఉత్పత్తి వ్యవస్థలతో ముడిపడినది. మానవ అస్తిత్వంలోని, చైతన్యంలోని లోతైన తలానికి చెందినది. మార్క్సిస్టు పద్ధతిలో దాని గురించి చాలా అధ్యయనాలు జరిగాయి. అంత మాత్రాన పూర్తయిందని చెప్పలేం. దీని మీద వేర్వేరు సామాజిక, మానవ శాస్త్ర పరిశోధనలు కూడా ఉన్నాయి. వర్గపోరాటాన్ని, రాజ్యాధికార స్వాధీన వ్యూహాన్ని మర్చిపోకుండా పితృస్వామ్యం, కులం, మతం కలిసి భారతదేశంలో తయారైన ఆధిక్య సంస్కృతీ అధ్యయనానికి అన్ని వైపుల నుంచి మార్క్సిస్టులు సిద్ధం కావాల్సిందే. ఈ ఎరుకతో విరసం 28వ మహాసభలు జనవరి 8,9 తేదీల్లో నెల్లూరులో విజయవంతమయ్యాయి..

సంస్కృతీ సిద్ధాంతీకరణ, సాంస్కృతిక ప్రత్యామ్నాయాల దిశగా విరసం సభలు

నెల్లూరు సంఘమిత్ర విద్యా సంస్థలో జరగాల్సిన విరసం మహాసభలు పోలీసుల బెదిరింపులతో సుందరయ్య కళ్యాణ మండపంలో జనవరి 8వ తేదీ ఉదయం 11 గంటలకు యథావిధిగా ఆరంభమయ్యాయి. అరుణోదయ, ప్రజాకళామండలి కళాకారుల డప్పుల మోతల మధ్య, చిందుల మధ్య అంతర్జాతీయ కార్మికవర్గ పతాకాన్ని ఇటీవల జార్ఖండ్ విప్లవోద్యమంలో అశవులు బాసిన యువ విప్లవకారుడు సునీల్ తల్లిదండ్రులు లక్ష్మీనరసమ్మ, రమణయ్య ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లా తిమ్మాయపాలెం నుంచి భారత విప్లవోద్యమంలో అసాధారణ ప్రజ్ఞా పాటవాలతో పని చేస్తూ అమరుడై తెలుగు నేల విప్లవ వారసత్వాన్ని కా. సునీల్ ఇనుమడింపజేశాడు. ఆ తర్వాత విరసం పతాకాన్ని విరసం సీనియర్ సభ్యుడు కా. వి చెంచయ్య ఆవిష్కరించారు. అమరుల స్థూపాన్ని భారత విప్లవోద్యమ నాయకుడు కా. ఆర్కె సహచరి శిరీష, విరసం సీనియర్ సభ్యురాలు, దశాబ్దంపాటు అజ్ఞాత విప్లవోద్యమంలో పని చేసిన కార్యకర్త కా. ఆలూరి లలిత కుమార్తెలు పార్వతి, కవిని ఆవిష్కరించారు. ఎర్రజెండా పాటను ప్రజాకళామండలి, విరసం పతాక గీతాన్ని తంగెళ్ల సుదర్శన్ బృందం, అమరవీరుల గీతాన్ని అరుణోదయ బృందం పాడారు.

ఆలూరి లలిత ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం తర్వాత కా. వై కరుణాకర్ హాల్‌లో తొలి సమావేశం ఆరంభమైంది. రెండున్నర దశాబ్దాలుగా విరసంతో కలిసి నడిచిన కా. కరుణాకర్ ఇటీవల అనారోగ్యంతో అమరుడయ్యాడు. సాంకేతికంగా సభ్యుడు కాకపోయినా విప్లవ సాహిత్యోద్యమానికి కవిగా, రచయితగా, విమర్శకుడిగా, చిత్రకారుడిగా ఆయన అనేక రకాలుగా తోడ్పడ్డాడు. ఆయన స్మృతిలో ఈ సభలు కా. జితేన్‌మరాండీ వేదికపై ఆరంభయ్యాయి. జార్ఖండ్ ఆదివాసీ కళాకారుడిగా అక్కడి విప్లవ ప్రజాస్వామిక పోరాటాల్లో ఆడిపాడి, తన సహచరులతో కలిసి ఉరిశిక్ష దాక వెళ్లి ప్రజాస్వామిక ఆందోళనలతో కా. జితేన్ విడుదలయ్యాడు. ఇటీవల అనారోగ్యంతో ఆయన అమరుడయ్యాడు. అలాగే కా. రాజ్‌కిశోర్ అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి వ్యవస్థాపక నాయకుడు, బిహార్ విప్లవోద్యమ సాంస్కృతిక రంగ ప్రతినిధి ఇటీవల అమరుడయ్యాడు. ఆయన స్మృతిలో సభలు ఆరంభమయ్యాయి.

ప్రారంభ సమావేశంలో విరసం అధ్యక్షుడు కా. అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ గత యాభై ఏళ్లలాగే ఈ రెండేళ్లు కూడా విరసం అనేక నిర్బంధాల మధ్య ప్రయాణించిందని అన్నారు. గత మహాసభలకు ఈ సభలకు మధ్య మరోసారి విరసం నిషేధానికి గురైందని అన్నారు. భారత విప్లవోద్యమంలో ప్రజలు అనుభవిస్తున్న నిర్బంధంలో భాగంగా విప్లవ రచయితలు కూడా ఈ రెండేళ్లలో యుఏపీఏ కేసులను, ఎన్ఐఏ దాడులను, విచారణలను ఎదుర్కొన్నారని అన్నారు. విరసం సీనియర్ సభ్యుడు కా. సాయిబాబా జీవిత ఖైదును, వ్యవస్థాపక సభ్యుడు కా. వరవరరావు భీమాకోరేగావ్ అక్రమ కేసులో జైలు నిర్బంధాన్ని అనుభవిస్తున్నారని అన్నారు. ఆయన ప్రస్తుతం మెడికల్ బెయిల్ మీద ఉన్నప్పటికీ తిరిగి జెయిలుకు పంపించేందుకు ఎన్ఐఏ అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

ఈ సంక్షోభాల మధ్యనే విరసం ఈ సభలను సంస్కృతి కేంద్రంగా నిర్వహించ తలపెట్టిందని అన్నారు. ఈ సభలకు వచ్చిన ప్రతినిధులకు, రచయితలకు, విప్లవాభిమానులకు స్వాగతం పలికారు.

అనంతరం ప్రముఖ రచయిత్రి వి. ప్రతిమ ప్రారంభోపన్యాసం చేశారు. విరసం సభల్లో పాల్గొనడం తనకు ఇష్టమని, గర్వకారణమని ఆమె ప్రారంభించారు. సంస్కృతిని పాలకవర్గాలు కలుషితం చేస్తున్నారని, ప్రజా పోరాటాలు దాన్ని బాగు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. మనుషులు ఒకరికి ఒకరు కాకుండా విడిపోయే సంస్కృతి పెరిగిపోతున్నదని అన్నారు. సాహిత్యం మనుషులను కలిపే సంస్కృతి కోసం ప్రయత్నిస్తుందని అన్నారు. సమాజంలో హింస, వివక్షలు పెరగడం కూడా సాంస్కృతిక అణచివేతలో భాగమే అన్నారు. మనం ఎలాంటి సంస్కృతిలో ఉన్నదీ తెలియని స్థితికి లోనుకావడమే దీని బలం అన్నారు. మార్కెట్ సంస్కృతి పెరిగే కొద్దీ మనుషులు వస్తువులను ప్రేమించే పరిస్థితి ఏర్పడిందని, సహజమైన ప్రేమలు లోపిస్తున్నాయని అన్నారు. ఆధిపత్య శక్తులు సంస్కృతిని సాధనం చేసుకొని సమాజంలో హింసను ప్రేరేపిస్తున్నాయని అన్నారు. ప్రగతిశీల రచయితలు మొదటి నుంచి తమ సాహిత్యంతో సాంస్కృతిక అణచివేతను ప్రశ్నిస్తున్నారని అన్నారు. దీన్ని మనం మరింత ముందుకు తీసికెళ్లాలని అన్నారు. ఆ పని చేయడానికి విరసం అందరికీ ముందుండాలని కోరుతూ ముగించారు.

ఈ తర్వాత విరసం సహాయ కార్యదర్శి కా. రివేరా గత రెండేళ్ల సంస్థాగత కార్యక్రమాలు –నిర్బంధ కాలంలో భవిష్యత్ కార్యాచరణ గురించి నివేదికను ప్రవేశపెట్టారు(ఇది ఈ సంచికలో యథాతథంగా అచ్చువుతున్నది). అనంతరం విరసం కార్యవర్గ సభ్యుడు కా. పాణి 'సంస్కృతి–మార్క్సిజం' అనే అంశంపై సభల కీనోట్‌ను ప్రవేశపెట్టాడు. (ఇది పుస్తక రూపంలో అచ్చుయింది).

భోజన విరామం తర్వాత సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాల కార్యక్రమం జరిగింది. ఇందులో ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక

నాయకురాలు కాత్యాయనీ విద్మహే, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నుంచి విమల, ప్రజా కళామండలి నుంచి నాగేశ్వరరావు, అమరుల బంధు మిత్రుల సంఘం నుంచి లక్షణరావు, పౌరహక్కుల సంఘం నుంచి వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ పత్రిక మాతృక నుంచి రమాసుందరి, అరుణోదయ సాంస్కృతిక వేదిక నుండి చొప్పర జాలన్న, ఐఎపిఎల్ నుండి సురేష్, పిడియం నుండి శ్రీనివాసరావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నుండి కొండారెడ్డి విరసం సభలకు సౌహార్ద్ర సందేశాలు ఇచ్చారు.

తర్వాత సాంస్కృతిక ఆధిక్యాలు-పితృస్వామ్యం, కులం, మతం అనే అంశంపై కా. కాశీం ప్రసంగించారు. దీనికి కా. రాంకీ అధ్యక్షత వహించారు. అరుణోదయ, ప్రజాకళామండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

9వతేదీ ఉదయం 10 గంటలకు పుస్తకావిష్కరణల సెషన్ కా. రాము నిర్వహణలో జరిగింది. 19 పుస్తకాలు ఈ సభల్లో ఆవిష్కారమయ్యాయి. (ఈ వివరాలు ప్రత్యేకంగా చూడవచ్చు). ఇందులో భాగంగా కోర్టుల్లో కా. సాయిబాబా, కా. వరవరరావు (భీమాకోరేగావ్ కేసు) కేసుల తాజా పరిస్థితిని, వాళ్ల ఆరోగ్య పరిస్థితిని కా. ఎన్. వేణుగోపాల్ వివరించారు.

భోజనం తర్వాత కా. కోదం కుమార్ అధ్యక్షతన కా. వరలక్ష్మి సంస్కృతి-దేశీయత-హేతు చింతన అనే అంశంపై ప్రసంగించారు. ఈ సెషన్ తర్వాత కా. సిఎస్ఆర్ అధ్యక్షతన కా. మెట్టు రవీందర్ సంస్కృతి కోసం పోరాటాలు-వర్గపోరాటం అనే అంశంపై ప్రసంగించారు.

చివరిగా కొత్త కార్యవర్గాన్ని కా. పాణి ప్రకటించారు. అధ్యక్షుడిగా అరసవిల్లి కృష్ణ, కార్యదర్శిగా రివేరా, కార్యవర్గ సభ్యులుగా పి. చిన్నయ్య, వరలక్ష్మి, బాసిత్, ఉజ్వల్, కాశీం, పాణి ఎన్నికయ్యారు. అరసవిల్లి కృష్ణ అధ్యతన బహిరంగ సభ జరిగింది. ఇందులో విరసం సర్వసభ్య సమావేశం చేసిన పలు తీర్మానాలను నూతన కార్యదర్శి రివేరా చదివి వినిపించారు. విరసం సీనియర్ సభ్యురాలు నల్లూరి రుక్మిణి మాట్లాడుతూ సంస్కృతి మీది పోరాటం దోపిడీ రాజకీయాల మీది పోరాటానికన్నా సంక్లిష్టమైనదని అన్నారు. మతోన్మాదం రాజకీయార్థిక సాంస్కృతిక పునాదుల మీది నుంచి ఫాసిజంగా మారే క్రమంలో ఆధిపత్య హిందుత్వ కుల పితృస్వామ్య సంస్కృతి దుర్మార్గమైన పాత్ర పోషించిందని అన్నారు. సంస్కృతి మీద విమర్శనాత్మకత పెరగకుండా ప్రజా పోరాటాల్లో పాలకవర్గ వ్యూహాలను ఛేదించడం సాధ్యం కాదని అన్నారు. తర్వాత పౌరహక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రజా పోరాటాలపైన, వాటికి మద్దతుగా నిలిచిన మేధావులు, న్యాయవాదులు, పౌరహక్కుల కార్యకర్తలు, రచయితలపైన కేంద్రం యుఏపీఏ కేసులు నమోదు చేసి జైళ్లలో పెడుతోందని అన్నారు. సీఏఏ వ్యతిరేక ఉద్యమ కాలం నుంచి పెరిగిన ఈ అణచివేత పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆర్థిక సామాజిక సమస్యలు పరిష్కరించకపోగా మతోన్మాద, మనోభావాల సమస్యలను లేవదీస్తున్నాయిన ఆరోపించారు.

చివరిగా విరసం సీనియర్ సభ్యుడు కా. కళ్యాణరావు మాట్లాడుతూ ఆపరేషన్ సమాధాన్‌లో భాగంగా విప్లవ, ప్రజా పోరాటాలను అణచివేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రహార్-3ని నడిపిస్తున్నాయని అన్నారు. ఆల్‌ఔట్ వార్‌లో భాగమే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజా సంఘాల కార్యకర్తల మీద అక్రమకేసులు, ఇండ్ల మీద దాడులు, విచారణలు సాగుతున్నాయని అన్నారు. సమాధాన్‌కు సమాధానం విప్లవోద్యమమే అని అన్నారు. సంస్కృతిని అర్థం చేసుకోడానికి, ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించడానికి మళ్లీ గ్రామాలకు వెళ్లాల్సిందే అన్నారు. గ్రామాల్లో వర్గపోరాటాల వల్లనే సాంస్కృతిక ఆధికృతలన్నిటినీ ఎదుర్కోగలం అన్నారు. నూతన సంస్కృతిని వర్గపోరాటాల ద్వారానే నిర్మించగలం అన్నారు.

అనంతరం ప్రజాకళామండలి, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. చివరిగా కళాకారుల అంతర్జాతీయ గీతంతో మహాసభలు ముగిశాయి.

(3వ పేజీ తర్వాత)

చేసుకొని వారంతా తీవ్రవాదులు అని ఎవరు ప్రచారం చేశారో తేటతెల్లమే.

దీనివెనక మాట్లాడుతున్నవారి నోరు కట్టేయాలనుకోవడం ఒక ఉద్దేశమైతే, దానితోపాటు మరొక పెద్ద ఫాసిస్టు ప్రయోజనం కూడా ఉంది. ఒక మైనారిటీ మత సమూహాన్ని ఏమైనా చేయొచ్చు అనే భావన మెజారిటీలో కలిగేలా చేయడం. ఇది అత్యాచార సంస్కృతి వంటిదే. సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా సంస్కృతి వేగంగా వ్యాపిస్తుంది. కనిపించకుండా వేధించే అవకాశం ఉండడం, ఒకవేళ బైటపడినా బాధితులు పీడిత కులాల, మతాల స్త్రీలైతే పెద్దగా చర్యలు, ప్రతిస్పందనలు లేకపోవడం దీనికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఇక పాలకపార్టీ సమర్థన పేరుతోనో, మెజారిటీ మత మనోభావాల పేరుతోనో అయితే ఎంత అసభ్యంగా దాడి చేసినా దానికి అధికార అండదండలుంటాయనే భరోసా ఎక్కువమందిని అటువంటి కల్చర్‌వైపు ప్రేరేపిస్తుంది. ఈ సోషల్ మీడియా పోకిరీలు నిర్మాణాత్మకంగా అధికార పార్టీల చేత నడిపించబడేవాళ్లూ ఉంటారు, మూకలో చొరబడినట్లుగా వచ్చి రాళ్లేసేవాళ్లు ఉంటారు, విద్వేష ప్రచారాల ప్రభావంతో వచ్చేవాళ్లూ ఉంటారు. ఇది కేవలం సోషల్ మీడియా వరకే ఆగిపోకపోవచ్చు కూడా.

తమపై అన్ని రకాల దాడులను ఇటీవలి రైతు ఉద్యమకారులు ఎలా ఎదుర్కొన్నారో, ఏ స్ఫూర్తి దేశానికి అందించారో దానిని అందరూ తీసుకోవాల్సి ఉంది. ఇవాల ముస్లిం మహిళలు మరింత సాహసంతో 'ఈ దాడి తమను షాకు గురిచేసిందని, అయినా తాము మాట్లాడకుండా మౌనంలోకి జారిపోయేది లేదని' ప్రకటించారు. వారికి మా సంఘీభావం, ఉద్యమాభివందనం.

రెండేళ్ల సంస్థాగత నివేదిక- భవిష్యత్తు ప్రణాళిక

రివేరా

2020 హైదరాబాద్ మహాసభల తర్వాత విరసానికి ఎదురయిన ప్రతి పరిణామమూ ఈ రెండేళ్ల కాలాన్ని ప్రత్యేకంగా నిలిపింది. దేశవ్యాప్త కార్పొరేట్ ఆర్థిక సంక్షోభం, వేర్వేరు ప్రజా ఉద్యమాల ఒత్తిళ్ల నేపథ్యంలో తన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు స్వభావాన్ని స్టేట్ మరింతగా బట్టబయలు చేసుకున్న కాలం ఇది. దీనికి వ్యతిరేకంగా సాంస్కృతిక పోరాటం వర్గపోరాట రూపంగా ఇదే కాలం ముందుకు తెచ్చింది. అందులో భాగంగానే మనం 'సంస్కృతి- మార్క్సిజం' పై ఈ రెండు రోజులు మాట్లాడుకోబోతున్నాం. సాంస్కృతిక రంగంలో మార్క్సిస్టు అవగాహనతో గణించదగిన స్థాయిలోనే మన ఆచరణ, అనుభవాలు ఉన్నాయనేది నిర్ద్వంద అంశం. సంఘ్ పరివార్ దాడులను ఎదుర్కోవడం, దాని బూజుపట్టిన శిథిల భావజాలాన్ని తాత్వికంగా తిప్పికొట్టడం ఒక ఎత్తు. ఈ పనిని మనతోపాటు, విభిన్న అస్థిత్వ సమూహాలు కూడా చేస్తున్నాయి. అయితే, విరసమే చేయాల్సిన పని ...పరివార్ శక్తుల సాంస్కృతిక ఎజెండాకు ప్రత్యామ్నాయంగా ప్రతివ్యూహాన్ని రచించడం!

2021 ఏప్రిల్ లో సాహిత్య పాఠశాలను, ఇప్పుడు ఈ మహాసభలను ఆ లక్ష్యంతోనే ప్లాన్ చేసుకున్నాం. అదే సమయంలో విప్లవోద్యమాన్ని నిర్మూలించాలన్న ఆపరేషన్ ప్రహార్ వ్యూహం, అందులో భాగంగా మైదాన, పట్టణ ప్రాంతాలపై కూడా సాగిస్తున్న మంద్రస్థాయి యుద్ధాన్ని కూడా కలుపుకొని మాట్లాడుకోవాలి. ప్రజాసంఘాల నాయకుల అరెస్టులు, అనారోగ్యాలు, కరోనా, నిర్బంధం, ఎన్ఐఏ సోదాలు, తెలంగాణ భూభాగంలో విరసంపై తాత్కాలిక నిషేధం వంటి వాటిని ఈ సైనిక, రాజకీయ, సాంస్కృతిక అవగాహనతోనే గ్రహించగలం. నిజానికి ఇది ఈ రెండేళ్ల కాలంలోనే మొదలైంది కాదు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో మొదలై సాయిబాబా తదితరుల అరెస్టు, యావజ్జీవ శిక్ష, భీమా కొరేగావ్ కుట్ర కేసు, దానికింద వరవరరావుతో సహా దేశ వ్యాప్తంగా మేధావులందరినీ జైలుపాలు చేయడం, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి ఉద్యమాల మీద, సీఏఏ వ్యతిరేక ఉద్యమం మీద అక్రమ కేసులు, నిర్బంధం దాకా ఒక ఫాసిస్టు అణచివేత వ్యూహంలో భాగం. దీనిలో భాగంగా విరసం మీద కూడ అణచివేత కొనసాగుతున్నది.

ఈ అవగాహన వెలుగులోనే విరసం తన రెండేళ్ల కాలపు ఆచరణను సమీక్షించుకుంటోంది. అయితే, అక్కడితోనే ఆగకుండా భవిష్యత్తు కార్యాచరణకు తాను చేసుకున్నంటున్న సన్నాహాలను కూడా మీ ముందు నివేదిస్తోంది.

ఇన్నేళ్లలో ఎన్నో నిర్బంధాలను చవిచూసిన విరసం ఇప్పుడు మరో కొత్త నిర్బంధ సన్నివేశంలోకి ప్రవేశించింది. ఈ స్థితిలో విరసం, విప్లవ అభిమానులు వర్గపోరాట రాజకీయాలకు దృఢంగా అంటిపెట్టుకుని ఉంటేనే ఈ నిర్బంధాన్ని ఎదుర్కొనగలమనే అవగాహనతో ఈ రెండేళ్లుగా పనిచేస్తోంది. ఈ గడ్డు పరిస్థితిని ఎదుర్కొనేలా సంస్థ నిర్మాణాన్ని తాత్వికంగా, రాజకీయంగా బలోపేతం చేసేందుకు ప్రయత్నించాం. ఈ క్రమంలో విప్లవ అభిమానులు, తోటి ప్రజాసంఘాల్లాగే విరసం కూడా ఎంతో ఉక్కపోతను అనుభవించింది. 2020 జనవరి 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో 50 ఏళ్ల మహాసభలను ముగించుకుని ఇళ్లకు చేరుకున్న సరిగ్గా వారం రోజులకు జనవరి 15వ తేదీన కార్యదర్శి కాశీం అరెస్టు, ఆ తర్వాత తెలంగాణలో తాత్కాలిక నిషేధం సంస్థను తాకిన రెండు పెద్ద కుదుపులు..

యూనిట్లు ఉన్న దగ్గర విరసం, యూనిట్లు లేని జిల్లాల్లో ప్రజాసం ఘాలు, ఉపా రద్దు కమిటీ వంటి ఐక్యవేదికల నాయకత్వంలో కార్యదర్శి అరెస్టును ఖండిస్తూ ఆందోళనలు, సభలు నిర్వహించాం. ఫిబ్రవరి 29న అమెరికాలోని బోస్టన్‌లో కాశీం, వీవీ, సాయిబాబ విడుదల కోరుతూ సభ జరిగింది. కోల్‌కతా కేంద్రంగా 'రిలీజ్ ద పోయిట్ ఉద్యమం 2020 సంవత్సరంలోనే మొదలై మంచి ప్రభావం వేసింది. నిర్బంధ వ్యతిరేక వేదిక పిలుపుతో 2020 జూన్ 3-9 వరకు రెండు రాష్ట్రాల్లో ఆందోళనలకు ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. హైదరాబాద్ ఇందిరాపార్కులోని ధర్నాచౌక్‌లో వేదిక ఒకరోజు దీక్ష నిర్వహించింది. సాయిబాబ, కాశీం, వీవీ సాహిత్యంలోని ధిక్కార గుణాన్ని మరోసారి పరిచయం చేస్తూ వారి పుస్తకాలు, పునర్ముద్రణలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కరణలు జరిపాం. ఇవే సభలను సీఏఏ, ఎన్ఆర్సీ వ్యతిరేక ఉద్యమకారులకు, కశ్మీరీ ప్రజాతంత్రవాదులకు సంఘీభావ వేదికలుగా మలచగలిగాం. కబీర్ స్ఫూర్తితో సాయిబాబ రాసిన కవితలను తెలుగులో అనువదించిన పుస్తకాన్ని జూమ్‌లో ఆవిష్కరించాం.

ఇదే సమయంలో భీమా కొరేగావ్ కేసు దేశ వ్యాప్తంగా మరి కొంతమంది మేధావులను, రచయితలను ఆవరించింది. అందులో భాగంగా మరోసారి విరసం సభ్యులు కెవి కూర్మనాథ్, క్రాంతిలను ఎన్ఐఏ అధికారులు విచారణ పేరుతో వేధింపులకు గురి చేశారు. నిజానికి ఈ కేసు కింద తెలంగాణలో వరవరరావును అరెస్టు చేసినప్పుడు కూర్మనాథ్, క్రాంతి, ప్రొ. సత్యనారాయణ ఇండ్ల మీద దాడులు చేశారు. 2020 జులై 12న ముంబై నుంచి ఎన్ఐఏ పోలీసులు క్రాంతి ఇంటికి వచ్చి పిలుచుకొని వెళ్లారు. హైదరాబాదులో రోజంతా ఇంటరాగేషన్ చేశారు. ఆతర్వాత అదే నెల 23 నుంచి వారంపాటు ముంబైలో భీమాకొరేగావ్ కేసు వివరాలు తెలుసుకోవడం పేరుతో విచారణ జరిపి వేధించారు.

అదే ఏడాది సెప్టెంబర్ 10న కూర్మనాథ్, ప్రొ. సత్యనారాయణలకు ముంబై రావాలని ఎన్ఐఏ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ ఇద్దరిని మూడు రోజులపాటు వాళ్లకు ఏ రకంగా సంబంధం లేని కేసులో విచారణ పేరుతో వేధించారు.

– భీమా కోరేగావ్ కేసులో అరెస్టు అయి అప్పట్లో తలోజా జైలులోని వివి, యావజ్జీవశిక్ష పడి నాగ్‌పూర్‌లోని అండా సెల్‌లో ఉన్న సాయిబాబ ఆరోగ్యాలు విషమించడంపై దేశవ్యాప్తంగానే కదలిక వచ్చింది. వారి విడుదల, బెయిల్, వైద్యం కోసం కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, సంఘాలవైపు నుంచి జరుగుతున్న ప్రయత్నాలను కరోనా కాలమంతా ఎప్పటికప్పుడు జూమ్ మాధ్యమంలో పంచుకుంటూనే ఉన్నాం. ఆన్‌లైన్ క్యాంపెయిన్, సంతకాల సేకరణ కొనసాగిస్తున్నాం. భీమాకోరేగావ్ అక్రమ నిర్బంధంలోనే ఫాదర్ స్టాన్‌స్వామి అమరుడయ్యాడు. వరవరరావు ప్రస్తుతం మెడికల్ బెయిల్‌పై ఉన్నారు. సుధాభరద్వాజ్ ఇటీవలె బెయిలుపై భీమా కోరేగావ్ నిర్బంధం నుంచి బైటపడ్డారు. మిగతా వారి విడుదలకు జరుగుతున్న న్యాయ ప్రక్రియ ముందుకు పోవడం లేదు. వాళ్లలో సీనియర్ల ఆరోగ్యపరిస్థితి ఆందోళనగా ఉన్నది. అలాగే నాగపూర్ జెయిల్లో ఉన్న సాయిబాబా పరిస్థితి మరింత దిగజారిపోయింది. ఆయనకు మరోసారి కొవిడ్ సోకిందని నిన్ననే తెలిసింది. ఆయనకు ఎప్పుడూ తగిన వైద్యసదుపాయాలు అందడం లేదు. ఈ పరిస్థితుల్లో కొవిడ్ సోకడంతో సాయిబాబా ఆరోగ్యం గురించి కుటుంబసభ్యులకు, మిత్రులకు ఆందోళనకలుగుతోంది.

2020 అక్టోబరు నుంచి ఆంధ్రప్రదేశ్ పై నిర్బంధం విరుచుకుపడింది. ఏపీ ప్రజాసంఘాలపై ముంచింగిపుట్టు, పిడుగురాళ్ల అక్రమ కేసుల పరంపర, ఆ పేరిట ఎన్ఐఏ సోదాలు, దాడులు, అరెస్టులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. సంస్థ అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి, పాణి, సీనియర్ సభ్యుడు కల్యాణరావు ఈ దాడులకు గురయ్యారు. సంస్థలోని దాదాపు అందరూ ఎన్ఐఏ నోటీసులు అందుకున్నవారే. వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అరెస్టయి జైలు జీవితం గడిపి ఇటీవలే విడుదలయ్యారు. ఈ తప్పుడు కేసుల్లో అరెస్టయిన ప్రజా కళాకారులు జె. కోటేశ్వరరావు, నీలకంఠం జైలు కోకిలలై చీకటి రోజులను గానం చేస్తున్నారు.

– మనిషిని మనిషి కలవలేని పరిస్థితి పదినెలలపాటు కొనసాగడం దిగ్రమ కలిగించే అనుభవం. 2020 నవంబరు నుంచి కరోనా కొంత తెరిపి ఇచ్చినా ఆ పై కనీసం ఆరు నెలలు, అంటే 2021 ఏప్రిల్ వరకు సభలకు, సమావేశాలకు వీలు దొరకలేదు. ఆపై కూడా బహిరంగ కార్యకలాపాలు అనేక పరిమితులకు గురవుతుండటం ఈరోజు వరకు మన అనుభవంలో ఉన్న విషయమే. భౌతిక, బహిరంగ కార్యకలాపాలు నిలిచిపోయిన ఈ కాలమంతా జూమ్ మాధ్యమం, ఆన్‌లైన్ అరుణతార, వసంతమేఘం వెబ్ కే పరిమితమై సంస్థ పనిచేయాల్సి వచ్చింది. ఏటా జరిపే సంస్థ ఆవిర్భావ సభలను రెండేళ్లూ జూమ్‌లోనే నిర్వహించాం. 2020 జూలై19 నుంచి 40 వారాలపాటు ఆన్‌లైన్ సాహిత్య కార్యక్రమాలు నిర్వహించాం. దండకారణ్య ఉద్యమానికి 40 ఏళ్లు నిండిన సందర్భంగా దండకారణ్య సాహిత్యోద్యమం, దండకారణ్య మహిళా ఉద్యమం, దండకారణ్యంపై నిర్బంధం తదితర అంశాలపై ఆరు వారాలు సిరీస్ నడిపాం.

– మరిన్ని మెరుగులతో విరసం.ఆర్గ్ 2021 మార్చి 31 నుంచి వసంతమేఘంగా వెలువడుతోంది. అప్పటివరకు వెబ్ సేవలు అందించిన విరసం.ఆర్గ్‌ను మనం 2016లో ప్రారంభించాం.

– లాక్ డౌన్, ఆర్థిక ఇబ్బందుల వల్ల అరుణతార ప్రింటింగ్ 2020 ఏప్రిల్ నుంచి ఆగింది. ఆన్‌లైన్ ఎడిషన్‌ను అందించాం. తిరిగి 2021 జనవరి నుంచి 48 పేజీలతో ఫిజికల్ కాపీని తీసుకువస్తున్నాం.

– తెలంగాణ పరిధిలో విరసం సహా పదహారుసంఘాలపై నిషేధంతో అరుణతార ప్రచురణకు మరోసారి బ్రేక్ పడింది. ఓ నాలుగు నెలలపాటు నిషేధం కొనసాగించి మరోసారి ప్రభుత్వాలు అప్రతిష్ఠ మూటగట్టుకున్నాయి. 2021 ఏప్రిల్‌లో ఈ నిషేధం పెడితే.. ప్రజాతంత్ర సంస్థలు, రచయితల నుంచి వెల్లువెత్తిన తీవ్ర వ్యతిరేకతతో ఆగస్టులో తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. నిషేధం విధిస్తూ ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకుంటున్నట్టు తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. ఈ తాత్కాలిక నిషేధం కారణంగా 2021 జూన్, జూలై అరుణతార సంచికలు తీసుకురాలేకపోయాం. నిషేధం కారణంగా అరుణతారను 2021 ఆగస్టు నుంచి విజయవాడ నుంచి తీసుకువస్తున్నాం.

– మరో యాభైల్లోకి పేరిట విజయవాడలో 2021 ఏప్రిల్‌లో సాహిత్య పాఠశాల జరిపాం. కేరళకు చెందిన అజిత్ రచించిన క్రిటికింగ్ బ్రాహ్మణిజం పుస్తకాన్ని 'బ్రాహ్మణవాదం - మార్క్సిస్టు విమర్శ' పేరిట పేరిట తెలుగులోకి అనువదించి ఈ సభలోనే ఆవిష్కరించాం. వరవరరావు హిందుత్వ మీద రాసిన వ్యాసాల సంకలనం తెహ్‌జీబ్‌ను ప్రచురించి ఈ సభల్లోనే ఆవిష్కరించుకున్నాం.

– కరోనా, అనారోగ్యం, వృద్ధాప్యంతో ఈ రెండేళ్లకాలంలో ప్రజలమిత్రులు ప్రొఫెసర్ శేషయ్య, స్వామి అగ్నివేశ్, ఉ.సా, స్టాన్‌స్వామి, శంఖాఘోష్, దేవిప్రియ, ఆర్టిస్టు చంద్ర, జితేన్ మరాండీ, పర్చూరు అన్నపూర్ణ, కర్నాటి రామ్మోహన్ రావు, రాజ్ కిశోర్, ఆర్టిస్టు వై కరుణాకర్, ప్రొ. సాయిబాబా తల్లి సూర్యవతమ్మ, కాకరాల సహచరి సూర్యకాంతమ్మ తదితరులను కోల్పోయాం. విరసం సభ్యులు పెద్దికృష్ణ, ఆలూరి లలిత, ఏఐఎస్ఆర్‌సీ వ్యవస్థాపక నాయకుడు రాజ్ కిశోర్ అనారోగ్యంతో భౌతికంగా దూరమయ్యారు. పెరూ జైలులో చైర్మన్ గొంజాలో అమరత్వం అంతర్జాతీయ మావోయిస్టు ఉద్యమానికి తీరని లోటు.

ఈ సంక్షోభాలు, కన్నీళ్ల మధ్యనే ప్రజా పోరాటాలన్నిటి వలె విప్లవ రచయితల సంఘం ఈ రెండేళ్ల కాలాన్ని అధిగమించింది. సామాజిక పరిణామాల్లో, నిర్బంధంలో, ఉద్యమాల స్థితిగతుల్లో సహితం వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్‌కు తగిన అవగాహనను రూపొందించుకున్నది. ఆచరణాత్మక కార్యక్రమాలను సిద్ధం చేసుకున్నది.

ఈ దిశగా నవంబర్ 28న విజయవాడలో జరిగిన సర్వసభ్య సమావేశం కృషి చేసింది. పరిస్థితులన్నిటినీ పరిగణనలోకి తీసుకొని రాబోయే మరింత నిర్బంధ కాలానికి సంస్థ తననుతాను సిద్ధం చేసుకోడానికి ఈ సమావేశం మార్గదర్శకత్వం వహించింది. విప్లవ రాజకీయాలకు మరింత దృఢంగా అంటిపెట్టుకొని ఉండటం, సాహిత్య కళా మేధో రంగాల్లో కొత్తగా చేయాల్సిన పనులను

28వ విరసం మహాసభల తీర్మానాలు

1.పాలకవర్గ ఎత్తుగడల నుంచి బయటపడి అమరావతి ఉద్యమం ప్రజాతంత్ర స్వభావన్ని అలవర్చుకోవాలి.

గత కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు రాజధాని చుట్టూ తిరుగుతున్నాయి. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటికే రాజధానిగా ఉన్న అమరావతితో పాటు విశాఖ, కర్నూల్‌లను రాజధానులగా ప్రకటించడంతో ఈ సమస్య మొదలైంది. అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల విషయం జగన్ ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. ఆ చర్చలో రాయలసీమ ప్రయోజనాల కోసం ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ సమయంలో చేసుకున్న శ్రీబాగ్ ఒప్పందం ప్రస్తవన కూడా చేశాడు. అయితే దీని వెనుక రాజకీయ ప్రయోజనాలు మాత్రమే ఉన్నాయి. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించేవాడు కాదు. ఇక ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అమరావతికి మద్దతు ఇచ్చిన జగన్ ఇప్పుడు మూడు రాజధానుల అంశాన్ని తీసుకువచ్చారు. ఇదే సమయంలో నష్టపోతున్న అమరావతి ప్రాంతపు రైతులతో చర్చించడానికి కూడా సిద్ధపడలేదు. పైగా దానిని అణిచివేసే ధోరణే అవలబిస్తున్నారు. ఇక అమరావతి రైతుల ఉద్యమం చట్టబద్ధత కలిగి వుండవచ్చు. న్యాయమైనదే అని వారనవచ్చు. కానీ, అభివృద్ధికి తామే కేంద్రం కావాలనీ, మిగతా ప్రాంతాల ప్రజల న్యాయమైన డిమాండ్లను తోసిరాజనడం అప్రజాస్వామికం. రాయలసీమలో హైకోర్ట్ ఏర్పాటు ప్రతిపాదన రాగానే కోస్తా ప్రాంతపు దాదాపు ఆరు జిల్లాల న్యాయవాదుల సంఘాలు నిరసన తెలపడం వారి అప్రజాస్వామిక ధోరణికి, సంకుచితత్వానికి నిదర్శనం. అలాంటప్పుడు, ఆ ప్రాంత ప్రజల న్యాయమైన డిమాండ్లకు మిగతా ప్రాంతాల ప్రజల మద్దతు ఎలా పొందగలరు? విరసం నేడు డిమాండ్ చేస్తున్నది - అన్ని ప్రాంతాలలో అభివృద్ధి జరగాలని.

2. బి.సి. కుల గణన నేటి అవసరం-అత్యంత ప్రజాస్వామికం.

స్వాతంత్ర్యం వచ్చిందంటూ 75 ఏండ్ల ఉత్సవాలు పాలకులు జరుపుకుంటున్నారు. జనాభాలో 50 శాతానికి పైనే ఉన్న బహుజనులు సుదీర్ఘ కాలంగా ప్రభుత్వం నుంచి అందవలసిన కనీస సంక్షేమ ఫలాలను ఇప్పటికీ అందుకోలేకపోతున్నారు. అసలు ఎటువంటి విధాన అమలుకు అయినా వివిధ ప్రజా సామాజిక సమూహాలపై నిర్దిష్ట అంచనా అవసరం. ఈ రోజుకు బి.సి. కులగణన జరగలేదు. దీని వల్ల ఆయా సమూహాలకు శాస్త్రీయంగా, నిర్దిష్టంగా అందవలసిన కనీస ప్రయోజనాలు అందటం లేదు. అందువల్ల ప్రతి 10 ఏండ్లకు ఒకసారి జరిపే జనాభా గణనతో పాటే బి.సి. కులాల జనగణన జరపాలనే డిమాండ్ అత్యంత ప్రజాస్వామికమైనది.

3. రైతాంగ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం. తెలంగాణలో ధాన్యం సంక్షోభానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదే భాధ్యత.

భారత వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెడుతూ కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ డిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు కొనసాగిన రైతాంగ ఉద్యమం దేశ ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకం. అన్ని ప్రకృతి పరీక్షలను, ప్రభుత్వాలు ప్రయోగించిన అనేక కుట్రలను, అణిచివేతలను ఎదుర్కుంటూ, హత్యలకు కూడా వెరవకుండా ఉద్యమించి రైతాంగం సాధించిన పాక్షిక విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలి. వ్యవసాయ చట్టాల రద్దుపై కపట ప్రకటన చేసిన కేంద్ర ప్రభుత్వం, అది తమ రాజకీయ

నిర్దేశించుకోవడం, నిర్బంధం వల్ల తలెత్తిన నిర్మాణపరమైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పని పద్ధతులను అలవర్చుకోవడం, విప్లవ సాహిత్యోద్యమమే చేపట్టాల్సిన కర్తవ్యాలకు తగినట్లు సాహిత్య రచన, అధ్యయనం మెరుగుపర్చుకోవడం వంటి విషయాల్లో ఈ సమావేశం కీలక అవగాహనలకు వచ్చింది. విప్లవ రాజకీయాలపట్ల విశ్వాసం ప్రకటించడం, ప్రచారం చేయడమే నేరంగా ఎన్ఐఏ, యుఏపీఏ ప్రకటిస్తున్న సందర్భంలో భావజాల రంగంలో విప్లవం కోసం పని చేస్తున్న విప్లవ రచయితల సంఘం మరింత చొరవతో, దీర్ఘకాలిక దృష్టితో, చైతన్యవంతంగా మార్క్సిజం లెనినిజం మావోయిజాలను సాహిత్య రంగంలో ఎత్తిపట్టవలసి ఉన్నదని ఈ సమావేశం తీర్మానించింది. ఈ వెలుగులో గత అనుభవాలను సమీక్షించుకొని ముందుకు పోవాల్సి ఉన్నది.

2020 సభల తర్వాత కార్యదర్శి అరెస్టు, కండీషన్ బెయిలుతో విడుదల.. ఆ తర్వాత సంస్థ బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వల్ల మిగతా కార్యవర్గమే సంస్థ ఆంతరంగిక, బహిరంగ కార్యకలాపాలన్నీ చూసుకున్నది. ఈ రెండు సంవత్సరాల సంక్షోభాన్నీ వర్గపోరాట రాజకీయాలపట్ల స్పష్టతతోనే సంస్థ అధిగమించింది.

ఇలాంటి ఇబ్బందులు గత యాభై ఏళ్లలో ఎన్నో వచ్చాయి. విప్లవోద్యమ చైతన్యం, పోరాట ప్రజల సాహసం, త్యాగనిరతి, ఆటుపోట్ల మధ్యనే విప్లవోద్యమ పురోగమనం వంటివి విప్లవ రచయితల సంఘానికి దిక్సూచిగా పని చేస్తున్నాయి.

ప్రస్తుత ఫాసిస్టు వాతావరణంలో సకల ఆధిక్య, అణచివేత సంస్కృతులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక, విప్లవ సంస్కృతుల స్థాపన కోసం ఉద్యమించాల్సి ఉన్నది. అందులో భాగంగానే అనేక అననుకూల పరిస్థితుల మధ్య మిత్రులు, సోదర సంస్థలు, విప్లవాభిమానుల అండదండలతో ఈ సభలు నిర్వహించుకుంటున్నాం. విరసం చారిత్రక కర్తవ్యాల నిర్వహణకు పునరంకితం అవుతామనే హామీ పడుతూ అందరికీ విప్లవాభివందనాలతో ముగిస్తున్నాను.

ప్రయోజనాలకు ఉపయోగపడేలా లేదనే ఉద్దేశంతో ఆ చట్టాలను తిరగతోడే ప్రయత్నంలో ఉంది. దీనిని గుర్తించి అప్రమత్తమైన సమరశీల రైతాంగం పంజాబ్‌లో మోది పర్యటనను అడ్డుకుని ఫాసిస్టు ఆర్థిక విధానలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలకు ప్రేరణనిచ్చింది. అయితే బూర్జువా పాలక చట్రంలో తయారయ్యే అన్నీ చట్టాలు ప్రజా వ్యతిరేకమైనవనే అవగాహనను తమ ఆచరణలో భాగం చేసుకుంటూ ఆ చట్టాలకు బలమైన రాజకీయ వ్యతిరేకత చూపడం ద్వారనే భారత రైతాంగం తుది విజయన్ని అందుకోగలుగుతుంది.

మరోవైపు తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న దొంగాటను విరసం ఖండిస్తుంది. వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తోంది.

4. కరువే కాదు వరదలూ పాలకుల సృష్టే.

రాయలసీమలో కరువు తాండవించటం గ్రామీణ ప్రజలు పొట్ట చేత పట్టుకొని నగరాలకు వలసలు పోవడం, ఆత్మహత్యలు చేసుకోవడం తరతరాలుగా చూస్తూనే ఉన్నాం. కరువులనేవి ప్రకృతితో పాటు ప్రభుత్వాలు, పాలకుల విధానాల వల్ల ఏర్పడ్డవనేవి ఎంత వాస్తవమో, రాయలసీమలో వరదల కూడా అసమర్థ పాలకుల వల్ల సృష్టించబడినవనేది అంతే వాస్తవం. ముఖ్యంగా రాయలసీమలోని కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో గత నవంబరు, డిసెంబరు నెలలలో భారీ వర్షాలు కురిసాయి. పెన్నా నదిలో, దాని ఉపనదులైన బహుదా, చెయ్యేరు, పాపాఘ్ని లలో భారీగా వరద నీరు వచ్చి చేరింది. కడప జిల్లా రాజంపేట నియోజక వర్గంలోని పింఛా, అన్నమయ్య ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరిన వరద ప్రవాహాన్ని అంచనా వేయడంలో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఎంతో కాలంగా ఆ ప్రాజెక్టుల గేట్లు మరమత్తులకు నోచుకోకపోవడంతో అవి పనిచేయలేదు. దీనివల్ల వరద జలాలను ఎప్పటికప్పుడు నదిలోకి విడుదల చేయకుండా ప్రాజెక్టుల్లో అలాగే నిలిపారు. అంతే కాకుండా చేయ్యేరు నదిలో పాలక పార్టీ నేతల కనుసన్నల్లో సాగుతున్న ఇసుక మాఫియా తవ్వకాలకు నీటి విడుదల ఆటంకం అవుతుందన్న దుర్మార్గమైన ఆలోచన కూడా పని చేసింది. ఈ కారణంగా నీళ్ళు నిలబెట్టడంతో అన్నమయ్య ప్రాజెక్టు మట్టి కట్టలు తెగి రాజంపేట మండలం పులిపత్తురు, తోగురుపేట, మండపల్లె, గ్రామాలలో చెయ్యేరు ఒడ్డున జీవిస్తున్న దళితుల గృహాలు వరద నీటి ఉధృతికి కొట్టుకొనిపోయాయి. 42 మంది సాధారణ ప్రజలు వరదలకు కొట్టుకొనిపోయారు. 200 గృహాలు పూర్తిగా నేలమట్టం అయ్యాయి. ప్రభుత్వమే సృష్టించిన ఈ వరదలపై, ప్రత్యేక నిపుణుల బృందంతో సర్వే చేయించి నష్టపోయిన కుటుంబాలకు సత్వరమే న్యాయం చేయాలి.

5. ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక శక్తులు, సంస్థలపై ఎన్ఐఎ దాడులను ఖండిద్దాం.

గత రెండేళ్ల కాలంగా రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రజా సంఘాలలో పని చేస్తున్న నాయకత్వాన్ని, కార్యకర్తలను విచారణ పేరుతో జాతీయ దర్యాప్తు సంస్థ హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయానికి రావాలని నోటీసులు పంపి, వారు ఇచ్చిన గడువులోగా హాజరు కావాలని హుకుం జారీ చేస్తున్నది. దూర ప్రాంతాల నుండీ పదే పదే ఎన్ఐఎ ప్రధాన కార్యాలయానికి పిలిచి మానసికంగా వేధిస్తున్నది. 2020లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు 60 మందికి పైగా ప్రజాసంఘాల కార్యకర్తలపై ముంచంగిపుట్టు, పిడుగురాళ్ల కుట్ర కేసులు నమోదు చేసి పదిమందిని అక్రమంగా అరెస్టు చేశారు. వీరు బెయిల్‌పై విడుదలవుతుండగా ముంచంగిపుట్టు కుట్ర కేసు దర్యాప్తు పేరుతో ఎన్ఐఎ ముప్పై ఇళ్లపైన దాడులు చేసింది. ఇవి చాలవని ఛత్తీస్‌గఢ్ నాగర్‌నార్ కుట్ర కేసును నమోదు చేసి రెండు తెలుగు రాష్ట్రాలలో పదహారు ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై దాడులు చేసింది. రెండు సార్లూ సోదాల పేరుతో ఇళ్లలోకి చొరబడి ప్రజాసంఘాల కార్యకర్తల వ్యక్తిగత ఫోన్‌లను, పుస్తకాలు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. చుట్టూ ఉన్న సామజిక వాతావరణాన్ని గందరగోళం చేశారు. ఇదంతా ఎన్ఐఎ కుట్ర పూరితంగా చేస్తున్నది. ఈ మొత్తం అణచివేత చర్యలను విరసం ఖండిస్తున్నది.

6. యుఎపిఎ చట్టాన్ని రద్దు చేయాలి. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి.

ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన 84 ఏళ్ల స్టాన్ స్వామి వ్యవస్థీకృత హత్యకు గురయ్యారు. యుఎపిఎ కింద అరెస్టు చేసిన ఎన్ఐఎ అధికారులు ఆయన మరణశయ్యపై ఉన్న స్థితిలోనూ బెయిల్ రాకుండా అడ్డుకున్నారు. జీవిత ఖైదు పడిన ప్రొ.సాయిబాబా ఆరేళ్లుగా అంతే అనారోగ్యంతో ఎన్ని సార్లు పెరోల్ కోసం విజ్ఞప్తులు చేసినా న్యాయస్థానం తిరస్కరిస్తూ వస్తున్నది. తల్లి చనిపోయినా కనికరించలేదు. స్టాన్‌స్వామిని అరెస్టు చేసిన భీమాకోరేగాం కేసులో మూడేళ్లుగా వరవరరావు సహా 15 మంది మేధావులు, సామాజిక కార్యకర్తలు బంధీలుగా ఉన్నారు. అనారోగ్య కారణాలతో వరవరరావుకు షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ మాత్రమే మంజూరైంది. ఎలాగైనా ఆయన్ను మళ్లీ జైలుకు పంపాలని ఎన్ఐఎ కుట్రలు పన్నుతోంది. మూడేళ్ల తర్వాత ఒక్క సుధాభరద్వాజ్‌ను మాత్రం ముంబై దాటకూడదని, కేసు గురించి మీడియాతో మాట్లాడకూడదని, ఇంకా అనేక ఆంక్షలు పెట్టి ఇటీవలే బెయిల్‌పై విడుదల చేశారు. నేరం చేశారనడానికి ఎటువంటి ఆధారం లేకపోయినా, ఏళ్లతరబడి కేసులో ఏ పురోగతీ లేకపోయినా బెయిల్ లేకుండా నిర్బంధించే అవకాశం యుఎపిఎ ఇస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం చేసిందే అందుకోసం. గత కాంగ్రెస్ ప్రభుత్వం యుఎపిఎ (ఊపా)ను రంగంలోకి తెచ్చాక పోరాడే ప్రజల మీద రాజద్రోహంతో పాటు ఊపాను మోపడం పరిపాటయ్యింది. ఇప్పుడది పరాకాష్టకు చేరుకుంది. వేలాది మంది ఆదివాసులు, ముస్లింలు, దళితులు, రైతు ఉద్యమ నాయకులు, సిఎఎ-ఎన్ఆర్‌సి నిరసనకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, రచయితలు, విద్యార్థులు, మేధావులు ఈ అప్రజాస్వామిక చట్టాల కింద నిర్భంధించబడ్డారు. యుఎపిఎ ఒక చర్యను మాత్రమే కాదు, ఒక మాటను, ఒక ఆలోచనను కూడా నేరమంటుంది. ప్రభుత్వ వ్యతిరేకతే తీవ్రవాదమంటుంది. ఈ ఫాసిస్టు చట్టానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. యుఎపిఎ చట్టాన్ని రద్దు చేయాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని అందరం డిమాండ్ చేద్దాం.

7. ఆదివాసీ పోరాటానికి మద్దతు తెలుపుదాం. ప్రహహార్ -3 దాడిని ఖండిద్దాం.

భారత విప్లవోద్యమ నిర్మూలనే లక్ష్యంగా పాలకవర్గాలు 2017 లో సమాధాన్ దాడిని చేపట్టాయి. ప్రస్తుతం ఆ దాడి రెండు

దశలను దాటి ప్రహార్ 3 దశకు చేరుకుంది. దీని లక్ష్యం 2022 జూన్ నెల నాటికి విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడం. ఈ దాడిలో భాగంగా మే నెలలో దండకారణ్యంలో విస్తృతంగా సైనిక క్యాంప్‌లను ఏర్పాటు చేయడం ప్రారంభించాయి. ఇప్పటికే దండకారణ్య ప్రాంతంలో 7.5 లక్షల బలగాలు మోహరించబడ్డాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో జరిగిన అణిచివేతను అనుభవించిన ఆదివాసీ ప్రజలు ఈ క్యాంప్‌ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. మే నెలలో నిరసన ప్రదర్శనపై భద్రతా బలగాలు జరిపిన కాల్పులలో అయిదుగురు ఆదివాసులు మరణించారు. ఈ సంఘటన తరువాత దండకారణ్య ప్రాంతమంతటా సైనిక క్యాంప్‌లను ఎత్తివేయాలనే ఆందోళనలు ప్రారంభమయ్యాయి. గత ఏడు నెలలుగా ఆదివాసీల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆ పోరాట ప్రజలకు విరసం తన మద్దతునిస్తున్నది. కొత్తగా చేపట్టిన సైనిక క్యాంప్‌లను వెంటనే ఎత్తివేయాలని, ప్రహార్ -3 దాడిని నిపివేయాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

8. ముస్లిం మహిళలపై ఆన్‌లైన్ లైంగిక వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నాం.

కొద్ది రోజుల క్రితం బుల్లీ యాప్ పేరుతో సామాజిక కార్యక్షేత్రంలో ప్రముఖులైన ముస్లిం మహిళల ఫోటోలు నెట్‌లో పెట్టి వేలం వేస్తున్నట్లు ప్రకటించిన దారుణమైన సంఘటన ఇండియాలో చోటు చేసుకుంది. ఎబివిపి గూండాల చేతిలో మాయం చేయబడ్డ జెఎన్‌యూ విద్యార్థి నజీబ్ అహ్మద్ తల్లి ఫాతిమా నఫీజ్, ప్రముఖ నటి షబానా అజ్మీ, పాకిస్థాన్‌కు చెందిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసుఫ్‌జాయ్ మొదలుకొని, ప్రముఖ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు వంద మందికిపైగా ఫోటోలు ఆ యాప్‌లో ప్రదర్శించారు. నిజానికి ఇది మొదటిసారి జరిగిన సంఘటన కాదు. గత జులైలో సుల్లీ డీల్స్ పేరుతో 80 మంది ముస్లిం మహిళల ఫోటోలను ఇలాగే నెట్‌లో పెట్టారు. దానిపై ఎన్నో ఫిర్యాదులు చేసినా సదరు వెబ్‌సైట్‌ను తొలగించడం తప్ప ఎటువంటి చర్యా లేకపోవడం నేరస్తులను ప్రోత్సహించినట్లయింది. సుల్లీ, బుల్లీ అనే పదాలు ముస్లిం మహిళలను ఘోరంగా అవమానించేవి. ఈ సంఘటన రెండోసారి పునరావృతమయ్యేసరికి దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. చివరికి ముంబై పోలీసులు 18 సంవత్సరాల శ్వేతా సింగ్, 21 సంవత్సరాల మయాంక్ రావల్‌లను దీనికి బాధ్యులంటూ అరెస్టు చేశారు. ఇద్దరూ ఉన్నత విద్యను అభ్యసించేవారు కావడం, వారి సాంకేతిక విద్య ఇలా పరిణమించడం దిగ్భ్రాంతికరం. దీనికి ప్రేరేపించిన శక్తులు ఏవై ఉంటాయో ఊహించడం కష్టం కాదు. ముస్లింలను లక్ష్యం చేసుకొని వారిపై భౌతిక, మానసిక, సాంస్కృతిక దాడులు చేసే హిందుత్వ శక్తులు ప్రతి రోజూ మెజారిటీ ప్రజలను మైనారిటీలపై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో సిఎఎ, ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమం మొదలుకొని అనేక సందర్భాలలో ముస్లిం మహిళలు ధైర్యంగా ముందడుగు వేస్తూ ఫాసిస్టు పాలకులపై తమ ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. వారిని మానసికంగా దెబ్బతీయడానికే ఈ ముసుగు దాడి. ఇది ఫాసిస్టు పాలకుల మతోన్మాదాన్నే కాదు, మహిళల్ని హీనంగా చూసే వికృతమైన పితృస్వామిక వైఖరిని కూడా తెలియజేస్తోంది. అలాగే ఫాసిజంపై ఐక్యపోరాటాల ఆవశ్యకతను గుర్తుచేస్తోంది.

9. హరిద్వార్ ధర్మసంసద్ విద్వేష ప్రసంగాలు ఫాసిజంవైపు మరో ముందడుగు

డిసెంబర్ 17-19 తేదీల్లో ధర్మసంసద్ పేరుతో యతి నరసింగానంద్, ప్రబోధానందగిరి వంటి హిందూ మత ప్రచారకుల ఆధ్వర్యంలో జరిగిన సభలు ఏకంగా ముస్లింలను చంపాలని బహిరంగ పిలుపునిచ్చాయి. వారి ప్రసంగాలు సోషల్ మీడియాలో దేశమంతా విస్తృతంగా ప్రచారమయ్యాయి. హిందువులందరూ జెల్లకు వెల్లడానికి కూడా సిద్ధపడాలని, ముస్లిం వ్యాపారస్తులను వెలివేయాలని ఏ జంకూ లేకుండా వారు మాట్లాడటానికి వెనక కేంద్ర ప్రభుత్వ దన్ను నూరుశాతం ఉంది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానంద్‌చే స్థాపించబడిన హిందూ యువవాహిని ఢిల్లీలో అదే రోజు అటువంటి ప్రతిజ్ఞే చేసింది. ఇటువంటి సంస్థలపైన, ప్రసంగాలపైన యుఎపిఎ వంటి చట్టాలు పనిచేయవు. వీటిని అడ్డుకునే ప్రజాకార్యచరణపైనే అణచివేత చర్యలుంటాయి. అంటే దేశం వేగంగా ఫాసిజం పడగకిందికి వస్తున్నది. అప్రమత్తమై ప్రతిఘటన రూపొందించుకొని దేశాన్ని కాపాడుకోవాల్సిన తక్షణ బాధ్యత ప్రగతిశీల శక్తులపై ఉంది.

10. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దుచేయాలి

డిసెంబర్ 4 రాత్రి నాగాలాండ్‌లో ఆరుగురు పౌరులను మిలటరీ బలగాలు కాల్చి చంపాయి. వాళ్ళంతా బొగ్గు గని కార్మికులు. ఒక వ్యాన్‌లో పది మంది తమ పని నుండి తిరిగి వస్తున్నప్పుడు సైనిక బలగాలు కేవలం అనుమానం మీద కాల్పులు జరిపాయి. కాల్పుల శబ్దం విని గ్రామస్తులు అక్కడికి వెళ్ళేసరికి ఆర్మీ వాళ్ళు మృతదేహాలను అక్కడి నుండి రహస్యంగా తరలిస్తున్నారు. దు:ఖంతో, ఆగ్రహంతో గ్రామస్తులు వాళ్ళ వాహనాలకు నిప్పు పెడితే మళ్ళీ కాల్పులు జరిపారు. మృతుల సంఖ్య 15 కు పెరిగింది. ఇట్లా సైనిక బలగాలకు విచక్షణారహితంగా పౌరులను కాల్చి చంపే అధికారం AFSPA (సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం) ఇస్తుంది. ఈ చట్టాన్ని రద్దు చేయాలని ఎన్నో ఏళ్ళుగా అక్కడి ప్రజలు పోరాడుతున్నారు. సంఘటన జరిగినపుడు AFSPA మీద పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేయకపోగా మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్టు డిసెంబర్ 30 న ప్రకటించింది. ఈ చర్యను విరసం తీవ్రంగా ఖండిస్తున్నది. ఈశాన్య రాష్ట్రాలలో అమలులో సాయుధ బలగాల ప్రత్యేక చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నది.

11. ప్రొద్దుటూరులో టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని నెలకొల్పాలి. గుంటూరులో జిన్నాటవర్ పేరు మార్చటానికి సంఘ్ చేస్తున్న కుట్రలను ఖండిస్తున్నాం.

గత కొద్దికాలంగా ఆంధ్రప్రదేశ్‌లో పాగా వేయటానికి బి.జె.పి. తన హిందుత్వ అజెండాను పక్కగా అమలుచేస్తున్నది. కోస్తాంధ్ర, రాయలసీమలో తన మూక సైన్యంతో దాడులు చేస్తూ, గొడవలు సృష్టిస్తూ, భయానక వాతావరణం ద్వారా తన రాజకీయ వ్యూహాలను అమలు చేయడాన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలి. స్వాతంత్ర్య సమరంలో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడిన టిప్పు సుల్తాన్, జిన్నాలను దేశద్రోహులుగా చిత్రిస్తూ, గోబెల్స్ ప్రచారం చేస్తున్న బి.జె.పి. దాని అనుబంధ సంఘాల దుర్మార్గ వైఖరిని ఎండగట్టాలి. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ తద్వారా లబ్ది పొందాలనే ఫాసిస్ట్ కుట్రలను ఖండించాలి. ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి విభిన్న అస్థిత్వాలు ఏకం కావాలి.

విరసం మహాసభలను విజయవంతం చేసిన సాహితీ మిత్రులకు, రచయితలకు, ప్రజాసంఘాలకు, విప్లవాభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు.

అనేక నిర్బంధాలు, ఒత్తిళ్ళ మధ్య విరసం 28వ మహాసభలు నెల్లూరులో విజయవంతంగా ముగిశాయి. 'సాంఘిక విముక్తి కోసం ప్రత్యామ్నాయ సంస్కృతి' లక్ష్యంగా సంస్కృతి - మార్క్సిజం ఇతివృత్తంగా తలపెట్టిన ఈ మహాసభల సన్నాహాల దగ్గరి నుండి చివరి దాకా నెల్లూరు మిత్రుల సహకారం మరువలేనిది. వీళ్లంతా విరసం పనిని తమ పనే అనుకొని ముందుకు వచ్చారు.

అడిగిన వెంటనే వేదిక ఇవ్వడానికి ముందుకొచ్చిన సంఘమిత్ర స్కూల్ యాజమాన్యం అర్ధరాత్రి పోలీసుల బెదిరింపులు ఎదుర్కోవలసి వచ్చింది. ఏకంగా స్కూల్ గుర్తింపును రద్దు చేయిస్తామనే దాకా పోలీసులు వెళ్లారు. ఇది రాజ్య దుర్మార్గానికి పరాకాష్ఠ.

భిన్నాభిప్రాయాలను చర్చించలేనితనం, సహించలేనితనం ఫాసిస్టు లక్షణం. గత కొన్నేళ్లుగా తప్పుడు కేసులు పెట్టి మా గొంతు నొక్కేయాలని చూసిన ప్రభుత్వం ఇప్పుడొక సభను జరగనివ్వకుండా అడ్డుకొని మమ్మల్ని మాట్లాడనివ్వకుండా చేయాలని చూసింది. అయితే ఇంతటి నిర్బంధ పరిస్థితుల్లో సైతం నెల్లూరు మిత్రులు మాకు అండగా నిలిచారు. అప్పటికప్పుడు మరో వేదిక సుందరయ్య భవన్‌ను మాకు ఏర్పాటు చేశారు. తెల్లవార్లూ మాతోనే ఉండి, సరంజామా అంతా తరలించి కొద్ది గంటల్లో కొత్త వేదికను సిద్ధం చేయడం చిన్న విషయం కాదు. ఇది నిజంగా చారిత్రాత్మకం.

సుందరయ్య భవన్‌లో కూడా సభలు జరగనిస్తారా అనే సందేహంతోనే అక్కడికి వెళ్లాం. జరగనిచ్చినా ఇప్పటికిప్పుడు రెండు రోజులకు సరిపడ ఏర్పాట్లు సాధ్యమేనా అనుకున్నాం. అనుకున్నట్లుగానే అక్కడికీ పోలీసులు వచ్చారు. ఈ ఒత్తిడిలో సభల నిర్వహణలో కొన్ని లోటుపాట్లు జరిగి ఉండవచ్చు. అసౌకర్యం కలిగి ఉండవచ్చు. వాటిని కొందరు మా దృష్టికి తీసుకొచ్చారు. వాళ్లందరికీ కృతజ్ఞతలు.

విరసం సభలకు సహకరించడమంటే ప్రమాదాన్ని తెచ్చుకోవడమే అని తెలిసీ మాకు రెండురోజులు షెల్టర్ ఇచ్చిన నెల్లూరు సుందరయ్య భవన్ వారికి, అలాగే సంఘమిత్ర స్కూల్ యాజమాన్యానికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు.

మా ఆహ్వానం మన్నించి సభల ప్రారంభోపన్యాసం చేసిన ప్రముఖ రచయిత్రి ప్రతిమ గారికి, సౌహార్ద సందేశాలందించిన మిత్రులకు, సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన అరుణోదయ, ప్రజా కళామండలి, అమరుల బంధుమిత్రుల సంఘం కళాకారులకూ, సభల్లో పాల్గొన్న రచయితలకు, సాహితీ మిత్రులకు, ప్రజాసంఘాల వారికి ధన్యవాదాలు. ఇంత నిర్బంధం మధ్య వీరంతా ఎప్పటిలాగే మాతో నిలిచారు. విప్లవ సాహిత్యోద్యమానికి అండగా నిలిచారు.

విరసం సభలకు విప్లవ, విప్లవ సాహిత్యోద్యమ అభిమానుల నుంచి, రచయితల నుంచి, సోదర ప్రజాసంఘాల నుంచి అపురూపమైన స్పందన ఉన్నట్లే, రాజ్యం నుంచి, విరసంపట్ల విమర్శనాత్మకంగా ఉండే మిత్రుల నుంచి, వ్యతిరేకుల నుంచి కూడా తీవ్ర ప్రతిస్పందనలు ఉంటాయి. విరసం కార్యకలాపాలపట్ల, ముఖ్యంగా మహాసభల పట్ల ఈ ప్రతిస్పందనలను మేం మొదటి నుంచీ గమనిస్తున్నాం.

భారత విప్లవోద్యమంలో భాగంగా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పని చేస్తున్న విరసం కార్యకలాపాలను, విశ్లేషణలను, వైఖరులను ఎన్ఐఏ దగ్గరి నుంచి అంత మంది ఇంత సన్నిహితంగా గమనిస్తుండటం కూడా రాజకీయ, తాత్విక, సృజనాత్మక రంగాల్లో విరసం శక్తిని సూచిస్తోంది. భావజాల సంఘర్షణకు విరసం కేంద్రంగా, చోదకంగా ఉన్నదని రుజువు చేస్తోంది. అందువల్లనే ఆ చివరి నుంచి ఈ చివరి దాకా ఈ మైత్రీపూర్వక, విమర్శనాత్మక, వ్యతిరేక ప్రతిస్పందనలు వెలువడుతున్నాయి. నెల్లూరు సభల కరపత్రం వచ్చినప్పటి నుంచి అందులో సంస్కృతిపై విరసం అందించిన స్థూల విశ్లేషణ గురించి మాతో కొందరు ఆలోచనాత్మక సంభాషణ ప్రారంభించారు. సభలు ఆరంభమైనప్పటి నుంచి ఫేస్‌బుక్‌లో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. నిన్న మొన్న తీవ్రస్థాయికి వెళ్లాయి. ఈ రోజు ఒక దిన పత్రికలో కూడా చర్చ మొదలైంది.

ఫేస్‌బుక్‌లో జరిగిన ఈ మొత్తం చర్చల్లో మా మిత్రులు విరసం దృక్పథాన్ని చెప్పారు. ఇతరుల వాదనల్లోని ఇంప్రెషన్స్‌ను, పొరబాటు అవగాహనలను, దురుద్దేశాలను తార్కికంగా ఎత్తి చూపారు. మాలోని లోటుపాట్లను కూడా గుర్తింపజేశారు. అది కేవలం విరసం పట్లనేగాక విప్లవోద్యమం పట్లనే వాళ్ల ప్రేమను, దృష్టిని తెలియజేస్తుంది. నిజానికి విరసం చుట్టూ ఐదు దశాబ్దాలుగా ఇలాంటి మిత్రులే అసంఖ్యాకంగా ఉన్నారు. వాళ్లందరికీ విప్లవాభివందనాలు తెలియజేస్తున్నాం.

అట్లాగే విప్లవ సాహిత్యోద్యమ సంస్థగా విరసం పట్ల చాలా విమర్శనాత్మకంగా ఉండే మిత్రులు కూడా కొందరు ఉన్నారు. అలాంటి వాళ్లు చేసే నిర్మాణాత్మక సూచనలు మాకు ఉపయోగకరం. వాటిపట్ల మాకు గౌరవం ఉంది. వాటిని మేం తీసుకుంటూ వచ్చాం. ఈ సభల సందర్భంగా సాగిన ఫేస్‌బుక్ చర్చల్లో అలాంటివాళ్లు కూడా కొందరు పాల్గొన్నారు. వాళ్లకు ధన్యవాదాలు.

ఇక ఈ చర్చల్లో విరసం.. ప్రజలకు దూరమైందని అన్నవాళ్లు ఉన్నారు. అగ్రహారం అన్నవాళ్లు ఉన్నారు. తోచినవన్నీ రాసిన వాళ్లు ఉన్నారు. వక్రీకరించినవాళ్లు ఉన్నారు. అబద్ధాలు రాసిన వాళ్లు ఉన్నారు. ఎప్పుడూ ఇలాంటి వాళ్ల సంఖ్య పిడికెడు మించి లేదు. భావజాల సాంస్కృతిక రంగాల్లో వర్గపోరాటానికి దిగాక ఇలాంటి వాళ్లు తప్పక తారసపడతారు. వాళ్లు విరసాన్ని ఎదుర్కోవడమంటే విరసం తన రంగంలో వర్గపోరాటాన్ని సునిశితంగా కొనసాగిస్తున్నట్లే.

కాకపోతే ఒకటే విచారం. ఈ వ్యతిరేకులు ముప్పై ఏళ్ల నుంచి ఒకటే భాష వాడుతున్నారు. విరసాన్ని, విప్లవోద్యమాన్ని విమర్శించడానికి అప్‌డేట్ అయితే బావుండు. ఎవరితోనైనా.. ముఖ్యంగా సాహిత్యరంగంలో సాగవలసిన నిరంతరాయ సంభాషణ తాజాగా ఉండాలని కోరుకోవడం అత్యాశ కాదు కదా.

విప్లవోద్యమంతో సహా నిర్బంధాన్ని అనుభవిస్తూ, తను ఎన్నుకున్న రంగంలో తన శక్తినంతా ధారపోసి సాంస్కృతిక వర్గపోరాట సంస్థగా విరసం కొనసాగుతున్నది. నిరంతరం పునశ్శక్తిని కూడగట్టుకుంటూ ఎప్పటికప్పుడు లోటుపాట్లను సవరించుకుంటూ ముందుకు వెళుతున్నది. అసంఖ్యాక పోరాట ప్రజల అండదండలతోనే, సూచనలతోనే ఇది సాధ్యం అవుతున్నది.

సహకారాన్నేకాదు, నిర్మాణాత్మక విమర్శలను ఎప్పటిలా సదా కోరుకుంటూ, నెల్లూరు సభలను విజయవంతం చేసిన వాళ్లందరికీ మరోసారి విప్లవాభివందనాలు తెలియజేస్తున్నాం.

అరసవిల్లి కృష్ణ, అధ్యక్షుడు రివేరా, కార్యదర్శి

13.1.2022

సంస్కృతి కోసం పోరాటాలు-వర్గపోరాటం

మెట్టు రవీందర్

మాట తీరు సంస్కృతి. ఆలోచనా తీరు సంస్కృతి. బతుకు తీరు సంస్కృతి. ఒక్కమాటలో చెప్పాలంటే- మనుషులు పరస్పరం సంబంధాలు నెరపుకునే ప్రాథమిక తలాన్నే సంస్కృతి అనవచ్చు. ఈ సంస్కృతీ మాధ్యమం ద్వారానే మనుషులు సంపర్కంలోనూ, సంఘర్షణలోనూ ఉంటారు. అయితే సంస్కృతిని అర్థం చేసుకోవడంలో గాని, విశ్లేషించడంలో గాని విభిన్నత ఉండడానికి ప్రధాన కారణం ఆర్థిక కోణంలోనే గాక పలు రకాల్లుగా భారత సమాజం విభజితమై ఉండడమే. ఇలాంటి విభజితమైన సంక్షుభిత సమాజంలో సంస్కృతిని ఒకే ముద్దగా చూడలేం. అందుకే మార్క్సిస్టులుగా మనం భారత ఉపఖండంలో భిన్న సమాజాలు, భిన్న సంస్కృతులు ఉన్నాయని అంటాం.

కనుక సంస్కృతిని కేవలం సానుకూలమైన భావోద్వేగపరమైన అంశంగా చూసినా, ఆరాధనా వైఖరితో చూసినా, వైభవీకరించినా అది సరైంది కాదు. ముఖ్యంగా ఈనాటి ఆధునిక యుగంలో సంస్కృతిని నిర్విమర్శగా చూడడం అశాస్త్రీయమవుతుంది. సంస్కృతిని విమర్శనాత్మకంగా చూడకపోతే దానికి ఉండే గతిశీల స్వభావం మనకు అర్థం కాదు. దానిలో మారేది ఏమిటో, మార్పును ప్రేరేపించేది ఏమిటో, ఏ మార్పును ఏది ప్రభావితం చేస్తుందో మనకు తెలిసే అవకాశం ఉండదు.

అయితే సంస్కృతీ చర్చ ఇటీవలే మొదలైంది కాదు. గతంలో జరిగిన సంస్కృతీ చర్చల్లో సంప్రదాయవాదులు, హేతువాదులు, ఉదార మానవతావాదులు, జాతీయవాదులు, గాంధేయవాదులు, ప్రగతిశీలవాదులు, కమ్యూనిస్టులు మొదలైన ఎంతోమంది పాల్గొన్నప్పటికీ, కమ్యూనిస్టుల పోరాట ఆచరణ మౌలికంగా భిన్నమైనది. ఆ తర్వాత నక్సల్బరీ నుండి నేటి దండకారణ్యం వరకు కమ్యూనిస్టు విప్లవకారుల ప్రత్యామ్నాయ సాంస్కృతిక కృషి కొనసాగుతున్నప్పటికీ, సంస్కృతీ చర్చ స్పష్టమైన, శాస్త్రీయ ప్రాతిపదిక మీద ప్రత్యేకంగా జరగలేదనే చెప్పాలి. అందువల్ల వర్గపోరాటాల క్రమంలో విప్లవాన్ని సాధించాలని బయలుదేరిన విప్లవకారులు (విప్లవ రాజకీయ పోరాటాల రూపంలో) చేసిన ప్రత్యామ్నాయ సాంస్కృతిక పోరాట ఆచరణలు సైతం భావనీకరించబడి ప్రత్యేకంగా సిద్ధాంతరూపం దాల్చలేకపోయాయి.

ఆ తర్వాత కాలంలో నానాటికీ విస్తృతమవుతూ వచ్చిన ప్రజా, వర్గ పోరాటాల క్రమంలో స్త్రీవాదులు, దళిత బహుజనవాదులు, ముస్లిం మైనారిటీవాదులు కూడా అనేకానేక కొత్త, కొత్త విషయాలను రంగంమీదికి తీసుకువచ్చి చర్చకు పెట్టారు. వీటన్నింటి ప్రభావాల నేపథ్యం వల్ల, గత ఏడెనిమిదేళ్లుగా దేశంలో కొనసాగుతున్న బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు పాలన వల్ల సంస్కృతీ చర్చ మరింత ప్రత్యేకంగా కొనసాగుతూ ఇటీవల పుంజుకుంటున్నది. అందులో భాగంగానే ఈ 28వ విరసం మహాసభలు కొనసాగుతున్నాయని మనం అర్థం చేసుకోవాలి.

అయితే ఇవ్వాల్టి సంస్కృతీ సంక్షోభానికి మూలాలు ఎక్కడున్నాయి? ఈనాటి సంక్షోభాన్ని పార్లమెంటరీ రాజకీయాలలో భాగంగా సంఘ్‌పరివార్ పాలనే తీవ్రతరం చేస్తున్నప్పటికీ, దాని మూలాలు సంఘ్‌పరివార్ రాజకీయాల్లో మాత్రమే లేవు. మొత్తంగా మన సమాజ గర్భంలోనే ఆ సంక్షోభపు మూలాలున్నాయి. సంస్కృతి పుట్టుక, పనితీరు అర్థం అయితేనే తప్ప సంస్కృతిని ఎలా మార్చాలో మనకు తెలియదు. అందుకే మన దేశ నాగరికతా సంస్కృతులు ఎలా రూపొంది ఎలా పనిచేస్తున్నాయో లోతుగా పరిశీలించాలి.

సంస్కృతి పుట్టుక, పనితీరు:

సంస్కృతి అనేది ఒక కాల బిందువు దగ్గర పుట్టి మరో కాలబిందువు దగ్గర అంతరించేది కాదు. దాని పుట్టుక, వికాసం, అంతర్థానం ఇవన్నీ సుదీర్ఘ క్రమాలే. చరిత్రలో ఒక రాజకీయ ఆర్థిక వ్యవస్థ మారినప్పుడు అది ఎలాగైతే పాత వ్యవస్థతో తెగదెంపులు చేసుకుంటుందో, సంస్కృతి అలా ఒక్కసారి నిర్మాణమై గతంతో తెగదెంపులు చేసుకునేది కాదు. అది అనేక ఎగుడుదిగుళ్ళ మధ్య ముందు వెనుకలుగా సాగుతూ కొత్త అంశాలను కలుపుకుంటూ, మారుతూ, మారుస్తూ పునరుత్పత్తి అవుతుంది. అందుకే సంస్కృతి ఎంత ప్రాచీనమైనదో అంత సమకాలీనమైన సజీవ (వాస్తవిక) వ్యవస్థ అని చెప్పవచ్చు. ఇలా సంస్కృతిని ఒక సజీవ వ్యవస్థ అని అంటున్నామంటే, సంస్కృతిలోని మార్పులకు సమాజంలోని మార్పులే గాక సంస్కృతిలోని అంతర్గత అంశాలు కూడా కారణమ వుతున్నాయని దానర్థం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే- ఉత్పత్తి వ్యవస్థ, నాగరికతా పునాది అనే రెండు ప్రధాన సోర్సుల నుండి సాగే ప్రభావాల వల్ల సమాజ రూప సారాల సమ్మిశ్రమ ఐక్యావరణమైన సంస్కృతిలో అనేక మార్పులు సంభవిస్తాయి. ఈ రెండు వైపుల నుంచి కలిగే ప్రభావాలు నేరుగా కాకుండా అనేక సామాజిక అంశాల మాధ్యమంగా ఉమ్మడి సాంస్కృతిక ఆవరణంలో పనిచేస్తాయి. అయితే ఈ మార్పులన్నీ మనుషులతో నిమిత్తం లేకుండా జరగవు గనుక మానవ బుద్ధి అనే నిర్మాణాత్మక వ్యవస్థ కేంద్ర స్థానంలో ఉండి ఆ మార్పుల వెనుక పనిచేస్తుంటుంది.

అంటే, సమాజం అనే మొత్తంలో భాగంగానే సంస్కృతి ఉంటుంది. కాబట్టి సమాజానికి చరిత్ర ఉన్నట్లే సంస్కృతికి కూడా

చరిత్ర ఉంటుంది. కనుకనే ఉత్పత్తి వ్యవస్థ, నాగరికతల వైపు నుండే గాక ఇతర సామాజిక రంగాల నుండి ప్రసరించే పరస్పర ప్రభావాలకు కూడా సంస్కృతి లోనవుతూ, వాటిని తిరిగి ప్రభావితం చేస్తుంది. ఈ మొత్తం మార్పుల క్రమంలో సనాతన, ప్రాచీన కర్మకాండల హిందూ సంస్కృతిదే పైచేయిగా ఉండడం వల్ల పరిమాణాత్మక మార్పులే గాని గుణాత్మక మార్పులేవీ సంభవించ(డం)లేదు. సనాతనకాలం నాటి కుల, పితృస్వామిక అనమానతా పీడనలకు తోడుగా వర్గ సమాజం ఏర్ప(డికొనసాగుతుం)డడంతో భారతీయ సంస్కృతికి దోపిడీ, అణచివేతల స్వభావం అదనంగా వచ్చింది. దోపిడీ వర్గాలు, రాజ్యమూ కలిసి ప్రజలను లొంగదీసుకొని అణచివేయడానికి సంస్కృతిని కూడా ఒక సాధనంగా చేసుకోవడం వల్ల సంస్కృతి ఒక ఆధిపత్య శక్తిగా మారిపోయింది.

అయితే సంస్కృతిలో కేవలం మార్పులను నిరోధించే లక్షణాలే గాకుండా, మార్పులకు దోహదపడే లక్షణాలు కూడా ఉంటాయి. అందుకే సంస్కృతిలో స్థిరీకరణ, పరివర్తన అనే రెండు లక్షణాలు ఉంటాయని అంటాం. కాబట్టి సంస్కృతి పనితీరులో సంస్కృతికి, మనిషి క్రియాశీలతకు, మానవ బుద్ధికి ఉండే పరస్పర సంబంధాలను లోతుగా అధ్యయనం చేయడమే కీలకాంశం అవుతుంది.

సనాతన హిందూ సంస్కృతి మనిషి బుద్ధిని, క్రియాశీలతను నిరంతరం కుదించి అదుపుచేస్తూ వాటిని గానుగెద్దు (వర్తులాకార) చలనంలో ఉంచుతుంది. తద్వారా మనుషుల బహిరాంతర ప్రపంచాలను నిరంతరం శాసించే విధంగా నిత్యం అలవాటుగా చేసే కర్మకాండలను నిర్దేశించింది. తనదైన ప్రతీకలతో, అర్థాలతో రొటీన్‌గా చేసే చర్యలతో సంస్కృతికి యథాతథ స్వభావం సమకూరి సముదాయంలోని మనుషులను ఆంతరంగికంగా బంధించివేస్తుంది. ఎవరూ భిన్నంగా చూడడానికి గాని, ప్రశ్నించడానికి గాని తావు లేకుండా మనుషుల మనోప్రపంచం తయారైవుండడమే అదొక విచిత్రమైన మానసికత. అది వ్యక్తిగత మానసికతగానే కాదు, సామాజిక మానసికతగా (సాంస్కృతిక వాస్తవంగా) స్థిరపడిపోయింది. ఆ మానసికతా ఆవరణంలో వాస్తవికత అసలే కనిపించదు. హేతుదృష్టి పనిచేయదు. తార్కికత ఉండనే ఉండదు. దీన్నుంచే సంస్కృతికి మార్పులను నిరోధించే ప్రతికూల లక్షణం సమకూరుతుంది. ఈ నెగెటివ్ స్వభావమే సామాజిక వైరుధ్యాలను మరుగుపరుస్తుంది. ఇట్లా యథాస్థితిని కాపాడే సంస్కృతికి నిరంతరం పునరుత్పత్తి అయ్యే లక్షణం ఉంటుంది. ఈ పునరుత్పత్తి ప్రక్రియ మనుషుల సంబంధాల మధ్యనే జరుగుతుంది కాబట్టి తిరిగి తనకు తగిన (సాంస్కృతిక) మనుషులనే తయారు చేసుకొని, పునస్సంఘటితం/పునర్నిర్మాణం చేస్తుంది. ఆ క్రమంలో సంస్కృతి మనుషుల అంతరంగాలను తన పునరుత్పత్తి స్థావరాలుగా మార్చుకుని విస్తరిస్తూపోతుంది. దీనికి మంచి ఉదాహరణలుగా కుల వ్యవస్థ, పితృస్వామ్యాలను పేర్కొనవచ్చు. ఇతరేతర సామాజిక, ఆర్థిక చలనాల వల్ల సంస్కృతిలో కొన్ని మార్పులు సంభవించినప్పటికీ, అవి పైపై మార్పులుగా ఉండే పరిమాణాత్మక మార్పులే తప్ప సారాంశంలో గుణాత్మక మార్పులు కావు.

అయితే ఈ మొత్తం సంస్కృతిలోని మార్పులను మరింత సూక్ష్మంగా అర్థం చేసుకోవాలంటే వ్యక్తుల క్రియాశీలతను, వారి సముదాయాన్ని పరిశీలించాలి. మనుషులు తమ సముదాయంలో మాత్రమే భాగమై ఆచరణలో ఉండరు. ఏకకాలంలో వాళ్లు ఇతరేతర సముదాయాల్లో, వ్యవస్థలలో కూడా కార్యకలాపాల్లో ఉంటారు. కనుక ఆ వివిధ చలనాల నుండి మనుషులు చైతన్యవంతమైన క్రియాశీలురుగా మారి సోషల్ స్ట్రక్చర్‌ను మార్చే ఏజెన్సీ గా మారుతారు. ఇలా చైతన్యవంతమైన క్రియాశీలురుగా మారడం వెనక మానవ బుద్ధి (మైండ్) పాత్ర కీలకంగా ఉంటుంది. బుద్ధి కూడా ఆంతరంగిక నిర్మాణం కలిగిన ఒక సజీవ వ్యవస్థగా మారుతూ, మారుస్తూ ఉంటుంది. బుద్ధి ప్రభావం వల్ల మానవ కర్తృత్వానికి రాడికల్ నేచర్ (విప్లవాత్మకత) వస్తుంది. కాని ఈ మనిషి క్రియాశీలత మళ్లీ పాత సముదాయంలో భాగంగానే కొనసాగడం వల్ల సంభవించే మార్పులన్నీ గుణాత్మక దశను సంతరించుకోకుండా పరిమాణాత్మక మార్పులుగానే ఉంటాయి. సంస్కృతి ఉండే యథాతథ లక్షణం వల్ల కాలక్రమంలో అవి కూడా అంతర్ధానమై ఎప్పటికప్పుడు సనాతన సంస్కృతే స్థిరపడుతూ ఉంటుంది.

చరిత్రలో కొనసాగిన చార్వాకం, బౌద్ధం, భక్తి ఉద్యమం లాంటి ప్రత్యామ్నాయ సాంస్కృతిక పోరాటాలు, పూలే, అంబేద్కర్, పెరియార్ లాంటి వాళ్ళ సాంస్కృతిక ప్రత్యామ్నాయాలన్నీ కనుమరుగు కావడానికి కారణం ఇదే. పైగా, ఎప్పటికప్పుడు పాలకవర్గాలు కొత్త కొత్త భావజాలాన్ని తయారు చేసి ప్రజలను దారి తప్పిస్తారు. ఉదాహరణకు 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సూత్రం అందులో భాగమేనని ఇక్కడ పేర్కొనవచ్చు. పైకి చూడడానికి ఇది చాలా బాగుంటుంది. భిన్నత్వాన్ని లేదా వైవిధ్యాన్ని గౌరవించినట్లే ఉంటుంది. కాని చరిత్రలో ఆధిపత్య సంస్కృతి నిర్వహించిన పాత్రను చూస్తే ఇది ఎంత మాయదారి సూత్రమో మనకు అర్థమవుతుంది. 'భిన్నత్వంలో ఏకత్వం' అనే పేరిట సామాజిక వైరుధ్యాలను మరుగుపరిచే కుట్ర ఇందులో ఇమిడి ఉందని మనకు తెలిసిపోతుంది.

ఇంతకీ తెలుసుకోవడం అంటే ఏమిటి? అసలు దేన్నైనా మనుషులు ఇంద్రియాల ద్వారా తమ అనుభవంలోకి తెచ్చుకొని ప్రాథమికంగా తెలుసుకుంటారు. అయితే దాంతో అంతా తెలియకపోవచ్చు. తెలియని దాన్ని తెలుసుకోవడానికి ఒక్కొక్కసారి ఇంద్రియాల సామర్థ్యాన్ని పెంచి చూపే యంత్ర పరికరాలు అవసరమవుతాయి. ఉదా: మైక్రోస్కోప్, టెలిస్కోప్ లాంటివి. వాటి ద్వారా మనం మరింత బాగా, అతి సూక్ష్మంగా తెలుసుకోగలం. అయినా మనకు అంతా తెలిసినట్టుగా ఉండదు. అసలు ఒక

(మిగితాది 31వ పేజీలో...)

అప్పుడు రాత్రి పగలే

బసంత్ బాప్రి

1

నెలలుగా వాళ్ళను తాకని నీరెండ నాయింటిలోకి రాదు
గడపదాటి వెళ్లి నేనాలోపలికి చూడాలి
పెంపుడు పిల్లితో ఆడినట్టు దాగుడుమూతలాడాలి కాసేపు
అప్పుడడుగుతుంది
సాయి మామయ్య ఎప్పుడొస్తాడు?
...... నిశ్శబ్దం నా జవాబు
అరతెరచిన తలుపునీడ యింటిలోపలికి అలిగిపడుకుంటుంది
ఇంకెన్నాళ్లు........?
ఇది వాళ్ళ మూడో పుట్టినరోజు అక్కడ!
నేను వినపడనట్టు అటుపక్కకు తిరిగి
కొలనులో నీలాలు దోసిట్లోకి మార్చుకుంటాను

పిట్టగోడదాటి మా యింటిపైకి వాలిన
బుల్‌బుల్ వంటి యీ వేపచెట్టు
ఆనందంతో రెక్కలల్లార్చి ఆడుగుతుంది
మెత్తటి తెలుపురెక్కల పూలపరుపు పరిచి
వసారా నిండుగా ఎన్నెల బింబమై ఆశగా...
షోమామౌసి చల్లని చిరునవ్వు చూడాలి!
జగతాప్ అక్క పాట వినాలి
...:......... ....ఎప్పుడొస్తారు?
కవిసమయాలు నిషేధింపబడ్డాయిక్కడ
ఇంక దేనికీ సమయ సందర్భాలు వుండవు
యేమని చెప్పమంటావ్!
అరెస్టు చివరి క్షణం ముందు కవిరాసిన
ఒక...చిరిగిన ఉత్తరంలోని అసంపూర్తి వాక్యం
మళ్లీ మళ్లీ డికోడ్ చేస్తున్నారు ఏముందందులో
ఒకరైతు అనుభవం
కూసుపై ఒక అమ్మ ప్రేమ
బానిసత్వంపై ఒక నల్లవాడి నిరసన
ఇవేమైనా ఖైదు చేయదగినంత నేరాలా!
కిటికీ చువ్వలు ప్రశ్నలెత్తాయి
మూర్ఖనియంతకు నిరసనే మహావిప్లవం
విరిగిన వాక్యమే మహాకావ్యం ఇది చాలదూ!
జెయిలు ఊచల జవాబు

2

పగలు ఎన్నటికీ రాత్రికాదు నెమ్మది పడండి
వాళ్ళు వస్తారు ఖచ్చితంగా
ఇంటిముందు చెదిరిన రంగుల ముగ్గు
దారికిరువైపులా నలిగిన గడ్డి చివుళ్ళు
ఖండితంగా ప్రకటిస్తున్నాయి
వాళ్ళను గుండెలో పదిలపరుచుకున్న జనులకొరకు
వాళ్ళ అవసరం వున్నవాళ్ల కొరకు విధిగా వస్తారు.
మనతో వెన్నెలకుప్పలు ఆడుకోడానికి
ఒంటరిఖైదులో కాలం నడ్డివిరిచిన గాథలను వినిపించడానికి
ఊహల్లో రూపొందిన యోధులను వెంటతోడుకొని వస్తారు
అంతవరకు మనయిళ్ళు తెరిచేవుంటాయి
అప్పుడు రాత్రి కూడా పగలే...

సోదా

ఉదయమిత్ర

ఉన్నట్టుండి
గాలి స్తంభించిపోతుంది

గలగలజలపాతాలు
గడ్డకట్టిపోతాయి

కబుర్ల కోసం వొచ్చిన పావురం
రెక్కలల్లారుస్తూ ఎగిరిపోతుంది

బూట్ల టకటకలతో
సాధికారంగా రాజ్యం
ఇంటిలోకి చొరబడుతుంది

సమస్త సున్నిత విషయాల మీద
సోదా బుల్‌డోజర్ చెలరేగుతుంది

శ్రద్ధగా చెక్కుకున్న
పెన్సిల్ ముక్క విరిగిపోతుంది

ప్రేమగా దాచుకున్న పుల్లంగొయ్యి
బూట్ల కింద పగిలిపోతుంది

పెంచుకున్న మొక్కను
మొదలంటా నరికినట్లు
సర్దుకున్న ఇల్లు
పెంటకుప్పగా మారుతుంది

పుస్తకాలు
ఒకదాన్నొకటి ప్రశ్నించుకుంటుంటే
తరతరాల జ్ఞానమంతా
నేరమైపోతుంది

గాయం మీద అక్షరమూ

వెన్నెల మీద ప్రేమా
అడవి మీద ఆరాటమూ
సముద్రంతో దోస్తానీ
ద్రోహుల చిట్టాలో చేరిపోతాయి

విధ్వంసమే ధ్యేయంగా
బందిపోట్ల రాజ్యం
ఏనుగులు పూదోటను తొక్కినట్టు
సమస్త కలలనూ తొక్కేసి వెనుదిరుగుతుంది.

ఇంటి చుట్టూ
భయాల ముళ్ళ కంచెలు
రాజ్యం గుర్తులుగా మిగిలి పోతాయి

చివరిదాక

కిరణ్

కలంతో
కరచాలనమై
అక్షరాలను
అల్లుకుపోతూ
అజ్ఞాతంలో
దశాబ్దాలు గడిచిపోయాయి

సింహావలోకనంలో
గమనా గమనమై
నైనాగా
ఉప్పెనైపోతూ
ప్రజలు అజేయులంటూ
రెండుపాదాలు
చివరిదాక నడిచాయి

చీకటిని శిథిలంచేసే
సూర్యోదయ కిరణాల కోసం
గుండెలుమీద పెంచుకున్న బిడ్డలకు
నడకనేర్పిన సింధూరాలు

నాలుగు సింహాలు
నాలుగు దిక్కులు
దారులు మూసి
ట్రిగ్గరమీద వేలుపెట్టినా
రంగులు మార్చే
ఖాకీలు
కనికరమైనట్టు
నోట్లకట్టలపై నడిపిస్తామన్నా
భయమైపోయి
కాసులముందు
కన్నీరై
తలవంచని
తల్లీ లలితమ్మ

నీ ఊపిరి ఒక నవ్వుగా మారాలి

దొంతం చరణ్

అమరులకు తల్లి వంటి అమ్మలు కావాలి మాకు
నీ ఊపిరిలో అమ్మలుంటారు

నిప్పుల ఉండలు కావాలి మాకు
నీ ఊపిరిలో నిప్పులుంటాయి

వసంతగీతం నీ ఊపిరిలో వినిపించాలి మాకు
నీ ఊపిరిలో ధిక్కార కవితలుంటాయి

పాలకై ఏడుస్తున్న పసిపిల్లాడికి
నీ ఊపిరిపాట కావాలి
ఎందరో తల్లులు చెరసాలలో పాడుతున్నారు
పిల్లలకూ వినిపించాలి
నీ ఊపిరి జాగ్రత్త మరి

నీ శ్వాసలు నీ మునివేళ్ళ చివర నిలబడి
డప్పును కొడుతుంటే వినాలి మేము
నీ ఊపిరి జాగ్రత్త మరి

ఎవరెవరి ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలు బందీ కాబడ్డాయో
ఊపిరి లేక కొత్తగా అల్లాడుతున్న ప్రపంచానికి
అల్లాడటం ఏమిటో
నీ ఊపిరి పాడే జైలుపాటలో వింటాం మేము
నీ ఊపిరి జాగ్రత్త మరి

ఎందరెందరి కోసమో
నీ శ్వాసలు నీ హృదయంలో గూడు కడుతున్నాయి
నీ గుండెకు నీ ఊపిరి కావాలి
ఈ ప్రపంచానికి కచ్చితంగా కావాలి

మా నవ్వులకు
నీ ఊపిరి తోడు కావాలి
మా ఏడుపు రాగాలను ఆపటానికి
నీ ఊపిరి ఒక నవ్వుగా మారాలి

భారతీయ నవల:
భావోద్వేగాల, గతితార్కిక వ్యక్తీకరణ

అల్లం రాజయ్య

నవలల గురించి మొదలైన ఇంటర్వ్యూలో చరిత్రదాకా కూరుకపోయాను. ఇంత సుదీర్ఘంగా ఎందుకు వివరించాల్సి వచ్చిందంటే-ఇది నేను అనేక భావోద్వేగాలు-రక్తసిక్త యుద్ధరంగం నుండి ప్రయాణించిన దారి - ఎక్కడో మారుమూల పల్లెలో చదువనే ఒక మాంత్రిక లాంతరు దొరికిన మొట్టమొదటి తరానికి చెందిన వాన్ని. పల్లెల్లో ఊపిరి సలుపని యుద్ధాల నుండి చిన్న పట్టణానికి చదువనే గడ్డిపోచతో ప్రవేశించిన నన్ను ఆ పట్టణం వేటాడింది. బడి అంతకన్నా క్రూరమైంది. ఆ పట్టణం ఎప్పుడో ఆరవ శతాబ్దంలో బౌద్ధులను, ఆదివాసులను వేటాడే బ్రాహ్మణ గుంపుల అడ్డా. ముఖ్యంగా బీహార్ నుండి బయలుదేరి గోదావరి తీర ప్రాంతంలో మంథనిలో స్థిరపడి-కాళేశ్వరమనే చోట వేలాది మంది రైతులను, ఆదివాసులను ఊచకోత కోసి వారి సమస్తం దోచి నిర్మించిన మంథని అతిపురాతన బ్రాహ్మణ అగ్రహారం. అలాంటి అగ్రహార పట్టణంలో పల్లెల నుండి శూద్ర, దళిత కులాల నుండి వచ్చిన మేము రోజు వాళ్లతో తలపడకుండా గడిచేది కాదు.

అయితే అదే మంథనిలో జాతీయ పోరాటంలో, కమ్యూనిస్టు పోరాటంలో భాగం పంచుకున్న బ్రాహ్మణులు ముఖ్యంగా మా హిందీ టీచర్ శర్మగారు ఉండేవారు. ప్రేమ్‌చంద్ గురించి ఆయన మెరిసే కళ్లతో-ఒక్కొక్కసారి కన్నీళ్లు కారుతుండగా చెప్పేవారు. ఏది ఏమైనా బడిలో నాకు జీరో మార్కులు-కులాల కొట్లాటల పల్లెలో ఉండలేను. ఆ సంధి కాలంలో ఎగుడు దిగుడు వీధుల్లో బికారిగా తిరుగుతుంటే లైబ్రరీ కన్పించింది. అందులోకి భయం భయంగా వెళ్లిన తరువాత-నేను లక్షలాది మందితో మమేకమయ్యాను. ప్రేంచంద్ గోదాన్ నవల చదువుతుంటే-మావూళ్లో మా చిన్నమ్మ, మా అవ్వ జొన్న చొప్పకట్టకోసం కొట్లాడినది అర్థమయింది.

అట్లా మొదలైన ప్రయాణం - ఇదిగో ఇక్కడిదాకా ప్రేమ్ చంద్‌ను అనేక పరిణామాలల్లో మళ్లీ మళ్లీ చదివాను. శరత్ నవలలు ఆ వయసులో అన్నీ చదివాను. కాని మళ్లెప్పుడు చదువాలన్పించలేదు. అట్లా మొదలైన భావోద్వేగాల ప్రయాణం -ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం 1969 నుండి 1977 రైతాంగ పోరాటాల ఆరంభం నుండి చరిత్రలో భాగం కావడం-అట్లా తప్పనిసరిగా చరిత్ర అధ్యయనం - ఇంది రెండో దశ. నా అనుభవం-పుస్తకాలు చదివి తెలుసుకున్న విషయాలు ఈ రెండు కలిసేవికావు...మారుమూల పల్లెనుండి దేశమంతా తిర్గడం-విదేశాలైన అమెరికా దాకా ప్రయాణం-అరుణాచల్‌ప్రదేశ్, బెంగాల్, అస్సాం, పంజాబు, తమిళనాడు, కర్నాటక,...అక్కడి మ్యూజియంలు-దబాంగ్ లాంటి చోట్ల అతి పురాతన బౌద్ధ ఆరామాలు... గ్రామీణ ప్రాంతాలు-ధ్వంసమైన ఫ్యాక్టరీలు-మొదటి కాలేజీ కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీ రోడ్లన్నీ పరుచుకున్న పుస్తకాలు-మేధావులకు, చారుమజుందారు లాంటి కార్యకర్తల కోపోద్రిక్తతకు వేదికైన హిందూ కేఫ్-నెత్తురోడే జలియన్‌వాలా బాగ్ అనేక యుద్ధాలకు కేంద్రమైవ బుద్ధగయ, నలంద-పాట్నా...అప్పుడు నే చదివిన పుస్తకాలు పాత్రలు పోటెత్తాయి... వక్రీకరించబడిన తుడిచివేయబడిన చరిత్రకు-క్షేత్ర పర్యటనకు -నవలల్లో నేను చదివిన జీవితాలకు లంకె కుదిరేది కాదు.

ఇదెదో - సాహిత్యం, చరిత్ర, వర్గ పోరాటం -క్షేత్ర పర్యటన - సంవత్సరం పాటు ఢిల్లీ పరిసర ప్రాంతాలల్లో మోహరించిన మహిళలు, రైతులు, రైతు కూలీలు, దేశంలోని యువకులకు అర్థమయిందేదో నాకు అర్థమయింది. బహుశా నాయకత్వం అందక-తగిన నిర్మాణం లేక అతిమహత్తర గతంలో జరిగిన ప్రజల వీరోచిత పోరాటాలు, నావికా, సైన్యం తిరుగుబాట్లు ఫలితం-త్యాగం-భూస్వాములకు, దళారి పెట్టుబడి దారులకు - దఖలు పడిన రాజ్యాధికారం నొప్పి సలపరం కావచ్చు... ఈ గోలంతా పక్కకుపెట్టి ఇంటర్వ్యూలోకి వద్దాం. చరిత్రలో దాగిన, దాచిన మోసం చేసిన దోపిడిదారుల చరిత్ర రచయితలకు తప్పనిసరిగా తెలియాలి.

1947 నుండి ఇప్పటిదాకా చరిత్రను సంక్షిప్తంగానైనా చెప్పాలి. అంతకన్నా ముందు భారతదేశంలో 1947 దాకా నవల వికాసం గురించి మాట్లాడుకుందాం... మనం చర్చించిన విషయాలన్నీ దేశ వ్యాపితంగా జరిగిన ప్రజాస్వామిక ఉద్యమాలకు సంబంధించిన ఒక సాధారణ దృష్టికోణమే. దేశంలోని వివిధ ప్రాంతాలల్లో, భాషలల్లో, జాతుల్లో, కులాలల్లో ముఖ్యంగా రైతాంగం, కార్మికులు, ఆదివాసుల, మహిళల పోరాటాల ఆయా స్థల కాలాలల్లో ప్రత్యేకమైన వైరుధ్యాలతో కూడుకున్నది. కనక స్థూలంగా భారతదేంలో వచ్చిన నవలా సాహిత్యం గురించి అధ్యయనం చేయాలంటే ప్రత్యేకతలతో పాటు-భావోద్వేగాలను అర్థంచేసుకుంటూ అధ్యయనం చేయాలి.

సాహిత్యం-ముఖ్యంగా నవల ఆయా కాలాల, స్థలాల ఆర్థిక, రాజకీయ, తాత్విక భావోద్వేగాల సమారోహం - చాలా మంది

సాహిత్యాన్ని ముఖ్యంగా భావ వాదులు అగమ్యగోచరంగా -విశ్లేషించలేనిదిగా వర్ణించారు. అంటే సాహిత్యాన్ని భావోద్వేగాల ఉద్విగ్నతలోంచి అంచనా వేశారు. నిజానికి పైన చెప్పినట్లుగా సాహిత్యం ఆర్థిక, రాజకీయ, తాత్వికతల రక్త మాంసాల గణితం... ఈ గణితం అర్థంచేసుకోవాలంటే - కారల్ మార్క్స్ తన పెట్టుబడి గ్రంథంలో వివరించిన అనేక మంది రచయితలు, వారి రచనల గురించి అర్థంచేసుకున్న పద్ధతి గమనించాలి...

ఇదివరకే భారతదేశంలో ఆయా భాషల్లో నవలలు మొదలైన దగ్గరినుండి-ఇ.హెచ్. కార్ చరిత్రకారుడు చెప్పినట్లుగా రకరకాలుగా చరిత్రతో కలిపి ఎవరికివారు, కాలానుగుణంగా వ్యాఖ్యానించుకుంటూనే ఉన్నారు. ప్రతి భాషలో వచ్చిన అలాంటి నవలల అధ్యయన చరిత్ర సుదీర్ఘమైంది. వర్గపోరాటంలోని భాగంగా అది నిరంతరం కొత్త కొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్నది. నిన్న మొన్నటిదాకా భారతీయ చరిత్ర, సామాజిక అధ్యయనంలో కులం పాత్ర-మొత్తం ఆర్థిక పరిణామక్రమంగా గుర్తించడంలో తటవటాయింపులుండేవి. అంబేడ్కర్‌ను తదనంతరం - విప్లవోద్య శక్తులు తమ వర్గపోరాట ఆచరణలో భాగం చేసుకుంటున్నారు. ఇవ్వాళ్ల అన్ని పోరాటాలు-బూర్జువా రాజకీయ నాయకులు ఈ కులాల చూపుతో తల పడుతున్నారు. వక్రీకరించిబడిన తుడిచిపెట్టబడిన దళితుల, ఆదివాసుల, మహిళల చరిత్ర ఇవ్వాళ్ల ప్రాణం పోసుకుంటున్నది... ఈ మూలుగులు, లో గొంతులు-భారతీయ సాహిత్యంలో కోకొల్లలు-ప్రేమ్‌చంద్ కఫన్, శరత్ గృహదహనం, వనవాసి నవలలో - పరాజితుడైన ఆదివాసీల రాజు పరాజయపు గాథలు చిత్రితమయ్యాయి.

అన్ని భాషల నవలలతో కొద్దిగా పరిచయమున్నా-అన్ని భాషల నవలల పరిణామక్రమం చెప్పడం నాకు సాధ్యంకాదు. మచ్చుకు-మొదట నవల మొదలై అనేక పాయలుగా వికసించి-అన్ని భాషల ప్రజల్లోకి అనువాదమైన బెంగాలీ నవలల గురించి-నాకు తెలిసింది మీతో పంచుకుంటాను. అట్లాగే దక్షిణ భారతదేశానికి చెందిన కన్నడ నవలా వికాసం గురించి-అట్లాగే తెలుగు గురించి-ఆ తరువాత మాట్లాడుకుందాం.

టేక్‌చంద్ ఠాకూర్ బెంగాలీలో రాసిన 'చెడిపోయిన రాకుమారుడు' (1856) మొదటి నవలగా వచ్చినా కూడా భారతదేశంలోనే మొట్టమొదటి నవలగా విలువబడే 'దుర్గేశనందిని'(1865) రాసినది బంకించంద్ర చటర్జీ... ఈ నవల మందారన్, హుబ్లీ జిల్లాలో జరిగిన యథార్థ ఘటన-తన మామగారి ద్వారా విని రాశాడంటారు. ఈ నవల ముగ్గురి మధ్య జరిగిన ప్రేమ కథ. మొఘల్ సైనిక జనరల్ జగత్ సింగ్-మందారన్ జమిందారు బీరేంద్రసింగ్ కూతురు తిలోత్తమ ప్రేమలో పడుతారు. వాళ్ల పెళ్లి ప్రయత్నాలు జరుగుతుండగానే అఫ్ఘాన్ పఠాన్ ఖాతుల్‌ఖాన్ మందారన్ మీద దాడిచేసి జగత్ సింగ్‌ను బందీ చేస్తాడు. తిలోత్తమ, ఆమె తల్లి బందీలౌతారు. ఖాతుల్‌ఖాన్ తిలోత్తమ మీద మనసు పడుతాడు. ఖాతూల్ కాన్ కూతురు ఆయేశా తిలోత్తమను, ఆమె తల్లిని రక్షిస్తుంది. మొఘలులు సంధీ చేసుకొని జగత్ సింగ్ విడుదల అవుతాడు. ఆయేశా జగత్‌సింగ్ ప్రేమలో పడుతుంది. హిందూ ముస్లింల పెళ్లి సమ్మతం కాదుగన్క-ఆ పెళ్లి జరుగదు. ఈ నవల ద్వారా మొఘల్ పాలనలోని మత ఘర్షణలు ముఖ్యంగా ఫ్యూడల్ సంబంధాలు మనుషుల మధ్య ప్రేమకు ఎట్లా అడ్డంకిగా నిలుస్తాయో మతం ఫ్యూడల్ సంబంధాలల్లో ఎట్లా కీలకంగా వ్యవహరిస్తుందో బంకించంద్ర చర్చించారు.

కపాల కుండల, దేవి చౌదరాణి, బిషబ్రిక్షతో పాటు ఆనందమఠం 1764 బాక్సర్ యుద్ధం తరువాత పన్నుల వసూలు ఈస్టిండియా కంపెనీకి వశమయ్యింది. ఫలితంగా రైతాంగం మీద ఒత్తిడి పెరిగింది. కరువులు పెరిగాయి. ఫలితంగా 1770 సన్యాసి తిరుగుబాటు 1771 బెంగాల్ కరువు నేపథ్యంలో 1882లో వచ్చిన నవల ఆనందమఠం ఈస్టిండియా కంపెనీ మీద ఇది తొలి తిరుగుబాటయిన సన్యాసి తిరుగుబాటు చిత్రించిన నవల -భారతదేశం ఒక దేవతగా చిత్రించబడినది. 'ప్రఖ్యాత వందేమాతరం' పాట ఈ నవల లోనిదే. మొత్తంగా బంకించంద్ర చటర్జీ మిద్నాపూర్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసినా కూడా బ్రాహ్మణీయ ఫ్యూడల్ భావజాలంతోనే భారతదేశంలో నవలా రచన ఆరంభమయ్యింది.

ఆ తరువాత బెంగాలీ సాహిత్యంలో చెప్పుకోతగినవారు రవీంద్రనాథ్ టాగోర్ (1861-1941) ద్వారకానాథ్ టాగోర్ మనుమడు. ద్వారకానాథ్ ఉత్తర పశ్చిమ బెంగాల్‌లో (ఇప్పటి బంగ్లాదేశ్), ఒరిస్సాలోను వేలాది ఎకరాల భూములు కలిగిన జమిందారు. ఆ తరువాత బ్రిటిష్ వారితో కలిసి పరిశ్రమలు స్థాపించిన తొలి దళారి పరిశ్రమాధిపతి ఉత్తరప్రదేశ్‌లో వేలాది ఎకరాల్లో నల్లమందు పండించి ఓడల ద్వారా చైనా గుమతి చేసేవారు. బ్రిటన్‌తో చైనా వారి యుద్ధం వలన-నల్ల మందు ఎగుమతి పెద్ద కంట్రాక్టు దొరికింది. తొలి బొగ్గగనులు, జౌలి, పడవలు లాంటి అనేక వ్యాపారాలు కల్గినవారు, రవీంద్రనాథ్ బాల్యం జమీందారీ బాలుడిగా గృహ నిర్బంధంలో గడిచింది - తరువాత చదువు ఇంగ్లాండులో... ఈ రెండు రకాల జీవితంలోని కనపడని హింస అతన్ని బాదించింది... ఈ నేపథ్యంలో భారతీయ ప్రజలను వేధిస్తున్న అనేక సమస్యలను 'గోరా' నవలలో చర్చించారు. కులం, వర్గం, సాంప్రదాయం, ఆధునికత, గ్రామం-పట్నం-ముఖ్యంగా సామ్రాజ్యవాదం-జాతీయవాదం గురించి చర్చించారు. అప్పటికి యూరప్‌లో జరిగిన పారిశ్రామిక విప్లవ ప్రభావం రవీంద్రుని మీద ఉన్నది. అయితే-శ్రామిక వర్గం గురించిన స్పష్టమైన దృక్పథం అప్పటికింకా స్పష్టంగా రూపుదిద్దుకోని దశ-రవీంద్రుడి తిరుగుబాటు రచనలను బ్రిటన్ గమనించి అతనికి సర్ బిరుదంతో లోబరుచుకోవాలని చూసింది. 1913లో గీతాంజలికి నోబుల్ బహుమతి ఇచ్చారు. 1919లో జరిగిన జలియన్‌వాలా బాగ్ మారణకాండకు నిరసనగా తన సర్ బిరుదును వాపసుయిచ్చారు. రవీంద్రుడు నౌకాభంగం-(1906), చతురాంగ(1916), ఘర్‌బైరే(1916) నవలలు రాశారు. రవీంద్రుని అనుభవం చైతన్యం బ్రిటిష్ ఇండియాలో సంస్కరణ వాదులుగా మారుతున్న అగ్రకుల బ్రాహ్మణీయమైంది.

భారతదేశ భాషలన్నింటిలోకి తన రచనలు అనువాదమైన రచయిత శరత్‌చంద్ర చటోపాధ్యాయ (1876-1938) భారతదేశంలో జరిగిన జాతీయ పోరాటం నేపథ్యంలో-బెంగాలీ జీవనం వస్తువుగా చాలా నవలలు రాశారు. శ్రీకాంత్ దేవదాసు, గృహదహనం, చరిత్ర హీనులు, శేషప్రశ్న లాంటి నవలల్లో ఆనాటి ప్రజల తిరుగుబాటు ఆలోచనలను-భూస్వామిక ఊపిరాడని స్థితిని ప్రశ్నించారు. ఒక రకంగా శరత్ తొలి అగ్రకుల తిరుగుబాటుదారుడు.

భీర్ భూమ్‌కు చెందిన తారా శంకర్ బందోపాధ్యాయ సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని అరెస్టయి-కాంగ్రెసు వాదిగా మారాడు. దాదాపు 65 నవలలు రాశారు. చైతాలి ముర్ని(198) పషన్‌పురి(1933) నీలకంథ(1933) గణదేవత)1943) ఉత్తరాయణ రెండవ ప్రపంచ యుద్ధం నేపథ్యం నవల.

ఆ తరువాత చెప్పుకోదగిన వారు మానిక్ బంధోపాధ్యాయ అప్పటి కమ్యూనిస్టు పార్టీతో ప్రభావితమై దాదాపు 36 నవలలు రాశారు. జనని (1935) అహింస (1941) పద్మానదిపై సరంగు (1936) తోలుబొమ్మలాట (1936) ప్రతిబింబ (1944) అంధకార చరిత్ర-చతుర్‌లోక్ (1948) కమ్యూనిస్టు పార్టీ మెంబరుగా ఉద్యమకారునిగా ఈ నవలలన్నీ ఆనాటి ప్రజా పోరాటాలు - కమ్యూనిస్టు, కాంగ్రెస్ పార్టీల వైఖరుల గురించి అధ్యయనం చేయడానికి తప్పక చదువ తగినవి...

చందర్ పహార్ రాసిన వనవాసి (1937-1939) బీహార్, పూర్నియా అటవీ ప్రాంతాలల్లో వ్యవసాయం, జమీందారీ విధానం, అడవులు నరికి సేద్యం చేస్తూ - ఆదివాసులు లోతట్టు ప్రాంతాలకు ముదుచుకుపోవడం - మొత్తంగా ఆదివాసి చరిత్ర తెలుసుకోవడానికి తప్పక చదువతగిన నవల. ఆ తరువాత మహాస్వేతా దేవి బీర్సాముండా, ఝూన్సీరాణి, ఒకతల్లి లాంటి నవలలు రాశారు.

బెంగాలీ నవలలు ఎక్కువ భాగం అగ్రకుల బ్రాహ్మణులే రాయడం విశేషం.:. ముఖ్యంగా రైతాంగం, కార్మికులు, ఆదివాసుల నుండి ఎలాంటి సాహిత్యం వచ్చిందో తెలుసుకోవాల్సి ఉంది...

ద్రవిడ భాష కుటుంబానికి చెందిన కన్నడ నవలా సాహిత్యానిది భారతీయ సాహిత్యంలో ప్రత్యేకమైనది. క్రీ.శ. 850 నుండి 1200 దాకా చాళుక్యులు గంగ, రాష్ట్ర కూటులు, హొయసలులు యాదవ రాజుల కాలమంతా కవిరాజ సాహిత్యం. క్రీ.శ. 12వ శతాబ్దంలో వచ్చిన లింగాయతులతో కొత్త సాహిత్యం ప్రవేశించింది. విజయనగర సామ్రాజ్యం, శ్రీక్రిష్ణ దేవరాయలు, అష్టదిగ్గజాలు-ఆ సాహిత్యమంతా తిరిగి రాజమార్గమే. పదహారో శతాబ్దం నుండి వడియారులు, 1782 నుండి 1799 దాకా టిప్పు సుల్తాన్ ఈస్టిండియా కంపెనీతో పోరాటానికి దిగాడు-భూ సంబంధాలలో-కొత్త నాణేలు ప్రవేశపెట్టడంలో-రాకెటు లాంచర్ల తయారి ప్రయోగంలో కొత్త ఆలోచనలు చేసి-మొదటి బ్రిటిష్ కంపెనీని ఎదురించి యుద్ధంలో మరణించినవాడు.

కెంపు నారాయణ-ముద్ర మంజూశ (1823) మొదటి కన్నడ నవలగా పేర్కొంటారు. బి.యం. శ్రీకాంతయ్యను ఆధునిక కన్నడ సాహిత్యానికి ఆద్యుడిగా భావిస్తారు. ఆ తరువాత గులవాడి వెంకటరావు విధవ పునర్ వివాహం గురించిన ఇందిరాబాయి (1899) మొదటి ఆధునిక సాంఘిక నవలగా వ్యవహరిస్తారు.

కన్నడ రైటాంగ జీవితంలోని ఉత్పత్తి రంగం, ముఖ్యంగా వ్యవసాయంలో వచ్చిన మార్పులను-జాతీయ ఉద్యమం నేపథ్యంలో శివరామ కారంత్ నవలలు రాశారు. వెంకంజీ కైవీయతులు-చోమనదుడి-దళితజీవితం(1933), మరల సేద్యానికి(1942), బెట్టదజీవ-ఆదివాసీల జీవితం మీద, సరసమ్మ సమాది పితృస్వామిక వ్యవస్థలో మహిళల జీవితం లాంటి ఇరువై అయిదు నవలలు రాశారు. మస్తి వెంకటేశ అయ్యంగార్ - చిక్క వీరరాజేంద్ర, చెన్న బసవనాయక, సుబ్బన్న (1928) శేషమ్మ నవలలు రాశారు.. కువ్వలి వెంకటప్ప పుట్టప్ప-సుబ్బమ్మ హెగ్గడతి అవ్‌కానూర్(1936) దేవుడు నర్సింహశాస్త్రి-యయూర(1928) అంతరంగ (1931), ఎ.ఎన్. కృష్ణారావు అంకుర్ (1940), కాందబరి సార్వభౌమ, కళంకిని, అమరాగప్పు, బందుబతుకు, నరబలి లాంటి చాలా నవలలు గ్రామీణ జీవితంలోని అనేక వైరుద్యాలను - ఆరాట పోరాటాలను చిత్రించారు.

టి.ఆర్. సుబ్బారావుతో అభ్యుదయ నవలలు కన్నడంలో ఆరంభమయ్యాయంటారు. దుర్గమ్మ, చందవల్లియతోట-మనసవ హూవు, రక్త తర్పన వీరి నవలలు.

కయ్యూరు రైతాంగ పోరాటం గురించి రాసిన నిరంజన నవల చిరస్మరణ చాలా ప్రసిద్ధిచెందిన నవల. తెలుగు వారందరికి పరిచయమున్న నవల.

ఆ తువాత యస్.ఎల్. బైరప్ప, ధర్మశ్రీ, వంశవృక్ష (1966) గృహభంగ (1970) మహాభారత - పాత పురాణ గాథలలోని వైరుధ్యాలను చిత్రించిన నవలలు - ఇదే వరసలో - ఒక కొత్త ఒరవడిని విప్లవ సాంప్రదాయాన్ని పి. లంకేశ్ - బిరుకు (1967) ముసంజయ కథ ప్రసంగ (1978) అక్క (1991) ప్రతిభింబిస్తాయంటారు. యు.ఆర్. అనంతమూర్తి సంస్కార (1965) స్వరూప (1966) పేర్కొనదగినవి.

శ్రీకృష్ణ అనహళ్లి - కాడు (1972), అడవి లాంటి నవలలు ఆదివాసుల గురించి వచ్చిన నవలలు.

మలయాళంలో శివశంకరతక్కల్ పిళ్లే - చెమ్మీన్ జాలరి వారి జీవితం - కూలి గింజలు (1948) చిరుత, కోరేన్, ఛాతన్ మాదిగవారి జీవితం చిత్రించారు.

వర్గ పోరాటం ఒక విస్పష్టరూపంలో ఆవిర్భవించింది. అది పెరుగుతోంది. ఆ అంతిమ విప్లవం ఇంకొంచెం దగ్గరౌతోంది- అని తన రచనల ద్వారా బలంగా చెప్పిన వారు శివశంకర పిళ్లె.

హిందీలో ప్రేమ్‌చంద్ ఉత్తర ప్రదేశ్ నేపథ్యంలో చాలా నవలలు రాశారు. అప్పటికి ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న పరిణామాలు - ముఖ్యంగా యూరప్‌లో జరిగిన పారిశ్రామిక విప్లవాన్ని, పారీస్ కమ్యూన్ని, మార్క్సిజాన్ని, రష్యాలో - ఏర్పడిన తొలి శ్రామికవర్గ రాజ్యాన్ని, లెనిన్‌ను అర్ధంచేసుకున్నవారు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షులుగా పనిచేశారు. పదిహేనుకు పైగా రాసిన నవలల్లో - గోదాన్ - రైతాంగంలో వేళ్లూనుకొని ఉన్న కులం -అభివృద్ధి నిరోధక భూస్వామిక భావజాలం ఏవిధంగా హింసాత్మకంగా, అభివృద్ధి నిరోదకంగా మారాయో చిత్రించారు. కఫన్ నవలలో - భారతీయ కుల వ్యవస్థ - శ్రామిక శక్తుల సృజనాత్మకతను ఏవిధంగా హత్య చేస్తున్నదో - చిత్రించారు. గబన్, నిర్మల లాంటి నవలల్లో పితృస్వామిక వ్యవస్థ మహిళల పట్ల ఎంత క్రూరంగా అణచివేస్తున్నదో చిత్రించారు.

గోర్కీ, లూషన్, ప్రేమ్ చంద్ సమకాలీనులు - దాదాపు ప్రపంచ సాహిత్యంలో ఆనాటి పరిస్థితులను సృజనాత్మకంగా, రష్యా, చైనా, భారతదేశ నేపథ్యంలో చిత్రించినవారు...ముగ్గురు 1936లోనే మరణించారు. గోర్కీ రూపొందుతున్న విప్లవశక్తి కార్మికవర్గాన్ని అమ్మ నవలలో చిత్రిస్తే - లూషన్ మిస్టర్ ఎహెచ్‌క్యూ నవలలో వలస దేశాలల్లో రైతాంగమే విప్లవ చోదకశక్తిగా చిత్రించారు. అప్పటికి మావో చైనాలో విప్లవోద్యమానికి తగిన ఎత్తుగడల వ్యూహం ఏర్పరుచుకున్నారు. భారత దేశంలో అది ఇంకా రూపొందనందున రైతాంగం విప్లవ శక్తిగా ఎదుగడానికి పడే పెనుగులాటను ప్రేమ్‌చంద్ తన నవల గోదాన్‌లో చిత్రించారు.

కిషన్ చందర్ - వాయుగుండం, వరాజయం, పొలాలుమేల్కొన్నవేళ హిందీలో వచ్చిన రైతాంగ పోరాట నవలలు.

రాహుల్ సాంకృత్యాయన్, హిందీలో రాసిన, విస్మృత యాత్రికుడు, లోకసంచారి, దివోదాస, మదురస్వప్న, భారతీయ దర్శనం, వోల్గానే గంగ - భారతీయ గతితార్కిక చరిత్రను నవలల్లో చిత్రించడానికి ప్రయత్నంచేశారు.

జైనేంద్ర కుమార్ - అప్పటికి ఏర్పడిన పట్టణ జీవితం మీద

నవలలు రాశారు.

భారతదేశంలో బ్రాహ్మణీయ భూస్వామ్య యూరప్‌లోలాగా సమూలంగా నిర్మూలింపబడకపోగా - అది వలస పాలకులతో, పెట్టుబడిదారి సమాజంతో కలిసిపోయి కొత్తరూపు సంతరించుకున్నది. ఫలితంగా ప్రతి ప్రజా పోరాటంలో - ముందున్న అగ్రకులం లాభపడి బలపడింది... ప్రతి మలుపులో కుల వైరుధ్యం బలపడింది. పెట్టుబడిదారుల అగ్రకుల బ్రాహ్మణీయులు, వైశ్యులు పారిశ్రామిక ఉత్పత్తి ద్వారా కాకుండా - నల్లమందు అమ్మకం, వ్యాపారం ద్వారా ఎదిగినారు. కావున వారికి ప్రధానంగా భారతీయ భావవాదంతో తెగతెంపులు జరుగలేదు. శాస్త్రీయంగా ఎదుగనందున - దళారీ పెట్టుబడి దారులుగా మాత్రమే మిగిలారు. ఈ పరిణామ క్రమంలో చిన్న పెట్టుబడిదారులుగా ఎదిగిన కింది కులాల వృత్తిపనివాళ్లు దేశవ్యాప్తంగా కోట్ల మంది ఉన్నాకూడా వాళ్ల ఉత్పత్తి స్థాయి ప్రధాన పరిశ్రమలకు అనుబంధమే కాని స్వతంత్రమైంది కాదు. కనుక యూరప్‌లోలాగా ప్రగతిశీలమైన, శక్తివంతమైన జాతీయ బూర్జువావర్గం సంఘటితపడలేదు. రెండు ప్రపంచ యుద్ధాలల్లో వలస పెట్టుబడి నేర్చుకున్న గుణపాఠం, ఇతర దేశాలలో దోచిన దానితో అభివృద్ధి ఫైనాన్స్ పెట్టుబడిగా రూపాంతరం చెంది - స్థానిక భూస్వామ్యంతో మిలాకతు కావడం - ప్రజా పోరాటాలను వంచించడం - ఇదివరకు 1947 దాకా జరిగిన జాతీయ ఉద్యమ సందర్భంలో వివరంగా చర్చించాం.

తెలుగు నవల ఆరంభ వికాసాల గురించి చర్చించాలంటే మద్రాసు రెసిడెన్సీ కింద ఉన్న ప్రాంతాలైన కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమ, నైజాం సంస్థానంలోని తెలంగాణసాహిత్యం గురించి విడివిడిగా చర్చించాలి. అదే చాలా విస్తరణ అవుతుంది. కా॥ కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వరవరరావు లాంటి వాళు ఇదివరకే చర్చించారు. నేను కొన్ని ధోరణుల గురించి మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను. మొదట బెంగాలీ నవలలు, దుర్గేశ నందిని లాంటివి తెలుగులోని అనువాదమయ్యాయి. ఆ తరువాత ఇంగ్లీషు నవలల ప్రభావంతో తెలుగులో నవలలు రాయడం ఆరంభమయ్యింది. రాయలసీమ నరహరి గోపాల కృష్ణశెట్టి (కర్నూల్) రంగరాజ చరిత్రము 1872లో వచ్చింది. ఇది తెలుగులో మొదటి నవల. ఇంగ్లీష్ నవల వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు నవల ఆలీవర్ గోల్డు స్మిత్ అనుకరణగా వీరేశలింగం నవల రాజశేఖర చరిత్రము 1878లో వచ్చింది. ఈ రెండు నవలలు కూడా భూస్వామ్యంలో నుండి బయటపడితే ఏంజరుగుతుందో? కథాంశం...

ఆ తరువాత భూసామ్యాన్ని ప్రత్యక్షంగా పరోక్షంగా సమర్థిస్తూ - చారిత్రిక నవలలు - రకరకాల సాంఘిక నవలలు కోకొల్లలుగా వచ్చాయి. అడవి బాపురాజు, విశ్వనాథ సత్యనారాయణ లాంటి వాళు అనేక నవలలు రాశారు.

విశ్వనాథ సత్యనారాయణ నవలల సారాంశం - అందరికన్నా అధికుడు బ్రాహ్మణుడు - అతని ఆజ్ఞలననుసరించి పాలించే రాజు - బ్రాహ్మణుడు వేయిపడగల్లో గణాచారిగా........? రాజు ప్రతినిధిగా జమిందారును సృష్టించాడు. ఏకవీర, చెలియలి కట్టలాంటి నవలలో - కూలిపోతున్న భూస్వామిక సంబంధాలకు సంబంధించిన బాధ - రూపొందుతున్న అర్ధవలస సంబంధాల మీద ఆగ్రహం అతని రచనల సారాంశం...

ఐర్లండులోని డబ్లిన్ నగరంలో చదివిన గుంటూరువాసి ఉన్నవ లక్ష్మీనారాయణ యూరప్‌లో జరిగిన పారిశ్రామిక విప్లవాన్ని - అప్పటికి యూరప్‌లో వ్యాపించిన కమ్యూనిస్టు భూతం - కారల్ మార్క్స్ గురించి అధ్యయనం చేసినవారు. మద్రాస్‌లో లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్న ఉన్నవ పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని రాయవెల్లూరు జైలులో 1921లో రాసిన మాలపల్లి నవల అప్పటికి తెలుగు ప్రాంతంలోని భూస్వామ్య సంబంధాలను గాంధీ ప్రవేశంతో - ప్రజా పోరాటాలల్లో వచ్చిన మార్పును దళితులను కూడగట్టే కమ్యూనిస్టు శాస్త్రీయ సిద్ధాంతాన్ని మాలపల్లిలో చిత్రీకరించారు. అతను చివరకు గాంధీ మార్గంలో వయనించారు. మాలపల్లి రెండుసార్లు నిషేధింపబడింది...

చలం నాటికి వలస సంబంధాలు తెలుగు ప్రాంతాలల్లో పూర్తిగా విస్తరించాయి. క్రూరమైన అమానవీయమైన బ్రాహ్మణీయ భూస్వామిక సంబంధాలల్లో పెట్టుబడిదారి సబంధాలు రావడం - ఈ నేపథ్యంలో స్త్రీ పురుష సంబంధాలల్లో బూర్జువా ప్రజాస్వామిక సంబంధాల ఆకాంక్ష చలం నవలలు ఒక రకంగా పితృస్వామిక బ్రాహ్మణీయ భూస్వామిక సంబంధాల మీద తిరుగుబాటు-అయితే-అలాంటి ఆర్థిక భూమిక పూర్తిగా ఈ కాలంలో, ఈ ప్రాంతంలో ఏర్పడలేదు-ముఖ్యంగా మహిళలకు ఆస్తిలేకపోవడం వలన-ఆ పాత్రలన్ని ఊహాత్మ గాలిలో తేలాడాయి. తీవ్రమైన భావోద్వేగాలకు లోనయ్యాయి. మైదానంలోకి పారిపోయాయి... పునాదికి చైతన్యానికి మధ్య ఉన్న గతితార్కిక, భావవాద, ఉద్వేగాల మయమైన చలం నవలలు - పూర్తిగా భావవాదం, బ్రాహ్మణీయ భూస్వామ్యం ఆవరించిన సాహిత్య వాతావరణంలో సంచలనం సృష్టించాయి.

అయితే 1934 నుండే కమ్యూనిస్టు పార్టీ - ప్రజలల్లో పనిచేయడం, అన్ని రకాల జాతీయ పోరాటాలలో పాలుపంచుకోవడం, మద్యపాన నిషేధం లాంటివి పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం తెలుగు నేల మీద అప్పటికి కొనసాగుతున్నాయి.

ఇదే సమయంలో కొడవటిగంటి కుటుంబరావు, శారద లాంటి వాళ్లు సాహిత్యంలో మార్క్సిస్టు శాస్త్రీయ అవగాహనతో చదువు, అనుభవం, శారద నవలలు మంచీ-చెడు, అపస్వరాలు రాశారు. మహీధర రామమోహన్ రావు నవల కొల్లాయికట్టితేనేమి - 1920 - 1945 కాలానికి సంబంధించిన గాంధీ మార్గంలో నడిచిన పోరాటాలను చిత్రించారు...

భూస్వామిక సబంధాలను మూలాల్లోకి వెళ్లి శాస్త్రీయంగా అధ్యయనం చేయడం - ముఖ్యంగా బ్రాహ్మణీయ భావవాద సాహిత్య ధోరిణిని తిరస్కరించడం - అభివృద్ధి చెందాల్సిన జాతీయ భూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహించే నవలలు గోపిచందు-చీకటి గదులు, అసమర్ధుడి జీవయాత్ర ఆ తరువాత అది సాధ్యంకాక-మెరుపులు మరకల్లోకి నిష్క్రమించారు.

ఆ తరువాత స్పష్టమైన ప్రజాస్వామిక సంబంధాల గురించి - ముఖ్యంగా స్త్రీ పురుషుల సంబంధాల నేపథ్యంలో ఉప్పల లక్ష్మణరావు అతడు-ఆమె (1947-51) జీవితాన్ని చిత్రించారు. అప్పటికే రష్యన్, చైనా, యూరప్ అనేక పేరెన్నికగన్న నవలలు తెలుగులో అనువాదమయ్యాయి. తుర్గనేవ్, టాల్‌స్టాయ్ దోస్తొవిస్కీ, గోర్కీ, చెహోవ్, - చైనా లూషన్ నవలలు తెలుగులోకి వచ్చాయి.

సాహిత్యంలోకి భావోద్రేకాలతో పాటు - ఆర్థిక, రాజకీయ, నేపథ్యాలను తెచ్చినవారు రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు గారలు. రావిశాస్త్రి అల్పజీవి, అసమర్థుని జీవనయాత్ర, రాజు మహిషి, గోవులొస్తున్నాయి జాగ్రత్త, రత్తాలు రాంబాబు లాంటి నవలలు రాశారు.

పితృస్వామిక వ్యవస్థల్లోంచి మహిళలు బయటపడాలనే కథాంశంతో రంగనాయకమ్మ బలిపీఠం నుండి - జానకి విముక్తి - ఆ తరువాత ఓల్గా సహజ, మానవి, ఆకాశంలో సగం లాంటి నవలలు రాశారు. రంగనాయకమ్మ, ఓల్గా, గోపీచంద్ తప్ప వీళ్లందరు అగ్రకుల బ్రాహ్మణులే అప్పటి నుండి ఇప్పటి దాకా జరుగుతున్న ప్రజా పోరాటాల నేపథ్యంతో నల్లూరి రుక్మిణి - నల్రెంగచెట్టు కింద, ఒంగ్రు మట్టి, నిషిధ, మేరువు నవలలు రాశారు.

శ్రీకాకుళ ఆదివాసీ పోరాటం నేపథ్యంలో - భూషణం కొండగాలి ఆ తరువాత పరిణామాలు, అట్టాడ అప్పలనాయుడు పునరావాసం నుండి బహుళ దాకా రాశారు... వీళ్లిద్దరు వ్యవసాయ కుటుంబ నేపథ్యం. శ్రీకాకుళ ఆదివాసీ పోరాట నేపథ్యంలోంచి వచ్చిన వారు. మధ్యలో-మధ్య తరగతి కలలకు రెక్కలు తొడుగుతూ యుద్దనపూడి, యండమూరి, కొమ్మూరి వేణుగోపాలరావు లాంటి వాళ్లు వందలాది నవలలు పాపులర్ సాహిత్యంగా రాశారు.

ఇటీవల కాలంలో వెలువడిన కళ్యాణరావు నవల అంటరాని వసంతం దళిత జీవన నేపథ్యంలో భారతదేశంలోని మూడు తరాల ఆర్థిక, రాజకీయ మార్పులతో - పోరాటాలతో సహా చిత్రించింది... కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, దళితుల నవలలు ఇంకా ఏమైనా వచ్చాయో తెలుసుకోవాల్సే ఉన్నది. ఎక్కువ భాగం అగ్రకులాల వారే నవలలు రాయడం విశేషం. బహుజనుల నుండి ఏమైనా నవలలు వచ్చాయేమో చూడాలి.

ముందు అనుకున్న విధంగా నరహరి గోపాల కృష్ణశెట్టి, శ్రీరంగరాజు చరిత్ర (1972) తొలి రాయలసీమ నుండి వచ్చిన నవల వీరు రెవెన్యూ ఉద్యోగి-రాయలసీమలో జరిగిన జాతీయోద్యమ కాలంనాటి పోరాటాల నేపథ్యంలో - సంస్కరణవాద దృక్పథంతో దాదావు 25 నవలలు వచ్చాయి. జనమంచి శేషాద్రి శర్మ మనోరంజని-(1905) మల్లవరపు సుబ్బమ్మ సుదక్షినా చరిత్రము 1906 కల్వటాల జయరామారావు రేనాటి వీరుడు (1925) సువర్ణకేసరి, కృష్ణసేన (1923), అనంతగిరిపేర నార్యకవి సుశీల - 1915, బూదిరాజు రామానుజరెడ్డి రత్నాబాయి (1925) దేవమణి సత్యనాథన్ - లలిత (1927) మురళీకృష్ణ మూర్తి స్వార్థత్యాగము (1931) గంటి సుబ్రహ్మణ్యశర్మ మాధవాశ్రమము 1933 గాంధీ నడిపిన ఉద్యమ నేపథ్యంలో - అమిద్యాల కృష్ణారావు - ఓనామీ (1934)

అపరాధ పరిశోధన డిటెక్టివ్ నవలలు కూడా రాయలసీమ నుండి రావడం విశేషం. అయితే వ్యాపార సాహిత్యం కోస్తాంధ్ర, తెలంగాణలో వచ్చిన విధంగా వచ్చిందోలేదో తెలియదు...

ఆ తరువాత రాయలసీమలోని ప్రజా పోరాటాల నేపథ్యాలలో - రాయలసీమ సమాజంలోని వైరుధ్యాలను గతితార్కికంగా-రాజకీయార్థిక కోణం నుండి చిత్రించిన నవలలు డా. కేశవరెడ్డివి. బానిసలు-రాముడుండాడు రాజ్యముండాది. ఇన్క్రెడిబుల్ గాడెస్, శ్మశానం దున్నేరు, మూగవాని పిల్లనగ్రోవి, చివరి గుడిసె, అతడు అడవిని జయించాడు, మునెమ్మ. మధురాంతకం మహేంద్ర - స్వర్ణసీమకు స్వాగతం, వినుకొండ నాగరాజు - ఊబిలోఉన్న (1970) మధురాంతకం రాజారాం త్రిశంకు స్వర్గం (1969), జొన్నవిత్తుల రామచంద్రమూర్తి వలసదేవర-నామిని సుబ్రమణ్యం-మునికన్నడి సేద్యం, మూలింటావిడ. సుంకోజి దేవేంద్రచారి - నీరు నేల మనిషి - పాణి -నిప్పులాగు - గుమ్మెటమోత, చిలుకూరి దేవపుత్ర - అద్దంలో చందమామ, చీకటిపూలు, పంచమం, కక్షశిల. బండినారాయణస్వామి - గద్దలాడుతుండాయి, మీ రాజ్యం మీరేలండి, రెండు కలలదేశం, సప్తభూమి. కనుపంపల్లి రాజారాం - ఎదురగ్గి, పి. రామకృష్ణారెడ్డి నత్తగుల్లలు (1975) కేతు విశ్వనాథరెడ్డి వేర్లు (1978), బోదీ - 1984 - ఏదిఏమైనా రాయలసీమలో జరిగిన ప్రజా పోరాటాల నేపథ్యంలో మొత్తం నవలలను అధ్యయనం చేయల్సియే ఉన్నది... బహుజనులు దళితుల నుండి నవలలు రావడం విశేషం. మహిళలు రాసిన నవలలు వచ్చాయో లేదో తెలియదు.

నేను తెలంగాణ ప్రాంతంలో - నైజాం నవాబు సంస్థానాధీశుని కాలంలో జరిగిన రాజకీయార్థిక పరిణామాల నేపథ్యంలో దాదాపు 800 తెలంగాణ నవలల గురించి అధ్యయనం చేశాను...

అవి కాల విభజన ప్రకారంగా - వస్తువులో, ప్రజాపోరాటాలల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఏడు అధ్యాయాలుగా అధ్యయనం చేశాను.

1. 1866 నుండి 1910 వరకు - ఈ కాలంలో వచ్చిన నవలలన్నీ దాదాపుగా చారిత్రక నవలలు - ముస్లిం రాజు పాలన కనుక చారిత్రిక నవలలన్నీ ఎక్కువగా హిందూ రాజుల, రాణుల చారిత్రిక నవలలు వచ్చాయి. అప్పటికే చాలా మంది జమీందారుల కొడుకులు విద్యాభ్యాసం కోసం యూరప్ వెళ్లినందున - మొదటి తరం నవలా రచయితలందరికి యూరప్‌లో జరిగిన పారిశ్రామిక విప్లవం ప్రభావం - ఫ్యూడల్ రాజులను వ్యతిరేకించే ప్రజాస్వామిక ఆలోచనలు - ఈ నవలలకు ప్రేరణ - కోస్తాంధ్రలో జరిగిన విధంగా సంస్కరణవాదం తొలి నవలలకు ప్రేరణగా పని చేయలేదు.

మునగాల జమీందారు కుమారుడైన తడుకమల్ల కృష్ణారావు నవల కంబుకందర చరిత్ర, కామ రూప (1866) తొలి నవల, ఆదిరాజు వీర భద్రరావు చిత్ర శాకున్తలమ్ (1901), భోగరాజు నారాయణ మూర్తి - విమలాదేవి - వేలాల సుబ్బారావు - రాణి సంయుక్త, కేతవరపు రాయచూరు యుద్ధము - మొత్తానికి బ్రాహ్మణీయ భూస్వామిక భావజాలం ప్రచారం చేయడానికే ఈ చారిత్రిక నవలలన్నింటి సారాంశం.

2. 1911 నుండి 1930 దాకా... ప్రజాస్వామిక ఆలోచనలు సాంఘీక నవలలు రాయడం ఆరంభమయ్యింది. ఈ దశలో కూడా చారిత్రిక నవలల పరంపర కొనసాగింది. అయితే ఈసారి తెలంగాణ ప్రాంతానికి చెందిన రాజుల గురించి - ఒద్దిరాజు సీతారామరాజు రుద్రమదేవి (1918) లాంటి నవలలు రాశారు. సీతా పీరాటమ్మ శోభవతి (1924) మొదటి మహిళా నవల - చట్రాతి లక్ష్మీ నరసమాంబ అనురాగపాకము (1924) స్త్రీ విద్య గురించి -

ఒద్దిరాజు సీతారామ చంద్రరావు, బ్రాహ్మణ సాహసము, స్త్రీ సాహసము, ముక్తవలస, ప్రేమ ప్రవాహము, ఇరువురు మగలు, నాగరిక భార్య, ఎరువుసొమ్ము - సురవరం ప్రతాపరెడ్డి శుద్ధకాంత (1917) లాంటి అనేక నవలలు వెలువడ్డాయి....

బెంగాలీ, కోస్తాంధ్ర నుండి వెలువడిన సంస్కరణవాద నవలల పద్ధతిలో ఈ నవలలు సాగాయి.

3. 1931 నుండి 1944 దాకా - కమ్యూనిస్టు పార్టీ యువకుల్లో ప్రవేశంతో - అనేక సాంస్కృతిక సంస్థలు పనిచేయనారంభించాయి. 1930 జోగిపేటలో ప్రథమాంధ్ర మహాసభతో పాటు భాగ్యరెడ్డి వర్మ, బి.యస్. వెంకటరావు, అరిగెంచు స్వామి, ముదిగొండ లక్ష్మయ్య లాంటి వాళ్లు అంబేద్కర్‌తో ప్రభావితమై దళితులను ఆది హిందువులుగా ప్రకటించాలని - ఉద్యమాలు రచనలు వచ్చాయి. మరోపక్క అటవీ భూముల మీద తమకే హక్కుకావాలని కొమురం భీం లాంటి ఆదివాసి నాయకులు ఆదివాసీ ప్రాంతంలో పోరాటాలు

చేశారు.

మఠం వీరయ్య - నిరపరాధి (1930) వెంకటరాజన్న అవానీ పతీ-పత్ని సయ్యద్ అజ్మతుల్లా - సుశీల, సుజాత, రంపరాకాసి - మానేపల్లి తాతాచార్య - ఆకలి - అట్టడుగు కులాల చదువు ఎంత కష్టమో - లోకమల హరి జగ్గని విద్దె - సురవరం - ఆరె వీరులు - ఈ కాలానికి సంబంధించిన ఇతివృత్తంతో - 1955లో వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి నవల వచ్చింది. 1940 నుండి 1944 దాకా గంగు నవలలో చిత్రించారు.

జి. రాములు - పిచ్చిశామన్న - దాశరథి రంగాచార్య చిల్లర దేవుళ్లు.

వస్తువులో రైతాంగం, కింది కులాల వాళ్లు నవలల్లో చిత్రించడం ఆరంభమయ్యింది. బహుజనులు నవలలు రాయడం ఆరంభమయ్యింది.

4. 1945 నుండి 1956 దాకా - తెలంగాణ సాయుధ పోరాటం, నైజాం సంస్థానం 17-09-1948 భారతదేశంలో బలవంతంగా విలీనం-1956లో తెలంగాణ, కోస్తాంధ్ర కలిపి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పాటు చేయడం జరిగింది.

ముందే ప్రస్తావించినట్లుగా - తెలంగాణాలో రైతాంగ సాయుధ పోరాటం ఆరంభించిన కమ్యూనిస్టు పార్టీ - 1947 ఆగస్టులో బ్రిటిష్ వారి నుండి భారత్‌కు అధికార మార్పిడి జరిగిన తరువాత తీవ్ర నిర్బంధానికి లోనైంది... గెరిల్లా జోన్లు, స్థావరప్రాంతాలు ఏర్పాటుచేసుకోవడంలో విఫలమయ్యింది... నైజాం రాజుతో ఫ్యూడల్ వ్యతిరేక పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీ - భారతదేశంలో విలీనం తరువాత - భారత ప్రభుత్వం అర్ధ వలస - అర్ధ భూస్వామిక ప్రభుత్వంగా గుర్తించి - అశేష పీడిత ప్రజానీకాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమంలో సమీకరించడంలో తగిన ఎత్తుగడలు - వ్యూహంలేక కకావికలయ్యింది. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా అనుకూల వైఖరి మూలకంగా - మిత్ర రాజ్యమైన బ్రిటన్‌కు వ్యతిరేకంగా చెలరేగిన క్విట్ ఇండియా మూవుమెంట్‌లో పాల్గొనక కమ్యూనిస్టులు ప్రజా పోరాటాల నుండి వేరుపడి పోయారు. ప్రజలకు నాయకత్వం వహించే అవకాశాన్ని కోల్పోయారు. చివరగా 1-10-1951 నాడు తెలంగాణ సాయుధ పోరాట విరమణ జరిగింది.

ఈ విధమైన అనేక చరిత్రాత్మకమైన ఘటనలు, సంఘర్షణాత్మకమైన తెలంగాణ జీవితంలో నుండి రూపంలోనూ, సారంలోనూ, ప్రజల భాషలలోను అనేక నవలలు వచ్చాయి. జి. రాములు - పెరటి చెట్టు - కందిమల్ల కృష్ణారెడ్డి బందూకు - దాశరథిరంగాచార్య - మోదుగుపూలు, సరిపెల్లి కృష్ణారెడ్డి ఉప్పెన, ముదిగంటి సుజాతారెడ్డి - మలుపుతిరిగిన రథచక్రాలు, సంకెళ్లు తెగాయి, అంపశయ్య నవీన్ ముళ్ల పొదలు, కాలరేఖలు, వట్టికోట ఆళ్వారుస్వామి గిర్దావర్, పి. చంద్ - శేషగిరి, దేవులపల్లి కృష్ణమూర్తి ఊరు-వాడ-బతుకు, భాస్కరభట్ల కృష్ణారావు - యుగసంధి

5. 1957-1972 ఉత్పత్తి శక్తుల అణచివేత - అంతర్గత వలసలు - ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. 1969లో మొదలైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం. విద్యార్థుల్లో చెలరేగి 340 మంది విద్యార్థుల బలిదానం - నాయకుల దగాతో 1972 కల్లా వెనుకంజ వేసింది.

ఈ కాలంలో నవీన్ అంపశయ్య, పరవస్తు లోకేశ్వర్ సలాం హైదరాబాద్, నవీన్ - చెదిరిన స్వప్నాలు - బాంధవ్యాలు, మంజుశ్రీ నూరుశరత్తులు, లాంటి అనేక నవలలు వచ్చాయి. పోల్కంపల్లి శాంతాదేవి 60 నవలలు, మాదిరెడ్డి సులోచన 70 నవలలు - బొమ్మాహేమాదేవి 60 నవలలు రాశారు.

వందలాది వ్యాపార నవలలు ఈ కాలంలో వచ్చాయి. మహిళలు ఎక్కువగా నవలలు రాశారు. దళిత జీవితం గురించి భూతం ముత్యాలు, నూర, ఎరుకల వారి జీవితం గురించి దేవులపల్లి కృష్ణమూర్తి బయటి గుడిసెలు యం.డి.మునీర్ సిగరేణి కార్మిక జీవితం గురించి తరతరాల పోరు రాశారు...

6. 1972-2001 నక్సల్బరీ - శ్రీకాకుళం ప్రేరణతో తిరిగి ఆరంభమైన రైతాంగ పోరాటాలు - తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఒక సంవత్సరం చదువు కోల్పోయిన కోపోద్రిక్త విద్యార్థి యువకులు అప్పటికే ఆరంభమై దేశవ్యాప్తమౌతూ - అనేక నిర్బంధాలు ఎదుర్కొంటున్న నక్సల్బరి, శ్రీకాకుళ ఉద్యమం - ఆ రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు... ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాలను, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వైపల్యాలను అంచనావేసి విప్లవానికి బాట రచించుకున్నారు. అర్ధ వలస అర్ధ భూస్వామిక దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనలో - భూస్వామ్యానికి అశేష పీడిత ప్రజానీకానికి మధ్య వైరుధ్యమే ప్రధాన వైరుధ్యంగా ఎంచి - విద్యార్థులు గ్రామ సీమలకు తరలి రైతుకూలీ సంఘాలు నిర్మించారు. 08-09-1978 జగిత్యాల జైత్రయాత్రగా ప్రసిద్ధి గాంచిన రైతాంగ పోరాటం క్రమంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు విస్తరించింది...

ఎమర్జెన్సీ కన్నా ముందు సంఘటితం కాని యువకుల లోలోపలి స్థితిని - సోషలిజం వస్తే ఎట్లా ఉంటుందో, దాశరథి రంగాచార్య - రానున్నది ఏది నిజం (1973) నవల. చెరబండరాజు నిప్పురాళ్లు (1974) మాపల్లె (1974) నవలలు రాశారు.

నవీన్ చీకటి రోజులు (1976) ముళ్లపొదలు (1976) రాశారు. గూడ అంజయ్య పొలిమేర - దళితులు పోరాటంలో పాల్గొనడం చిత్రించారు... నేను రాసిన కొలిమంటుకున్నది (1978) జగిత్యాల జైత్రయాత్ర నాటి స్థితికి సంబంధించినది. ఊరు (1982), ఆ తరువాత పరిణామాలు చిత్రించినది. మహిళల మీద పితృస్వామిక అణచివేత అగ్నికణం-(1983) - చెరబండరాజు ప్రస్థానం-(1981) నిప్పురాళు (1983) బి.యస్. రాములు బతుకుపోరు (1980) సి.హెచ్. మధు - తూరుపు ఎరుపులో మహిళ - జ్వాలాముఖి వేలాడిన మందారం. ఈ నేపథ్యంలో వచ్చిన నవలలు కొన్ని.

సింగరేణిలోకి కార్మికవర్గ పోరాటాలు విస్తరించిన నేపథ్యంలో తుమ్మేటి రఘోత్తమరెడ్డి నల్లవజ్రం, పి. చంద్ నవలలు స్ట్రైక్, కార్మికయోధుడు - ఒక కన్నీరు, హక్కుల యోధుడు లాంటి పది నవలలు వచ్చాయి.

ఆదివాసి ప్రాంతాలల్లోకి పోరాటాలు విస్తరించడంతో సాహుతో కలిసి కొమురం భీం - నేను వసంతగీతం నవలలు రాశారు. విప్లవోద్యమాలు క్రమంగా ఇతర రాష్ట్రాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు విస్తరించడం - వనజ అడవి పుత్రిక, సాధన సరిహద్దు (1987) ఆదివాసీ మహిళలు విప్లవకారులుగా రూపొందడం చిత్రించిన నవల 'రాగో'లు వచ్చాయి.

ఈ సందర్భంలో వందలాది నవలలు, రామాచంద్రమౌళి, నవీన్, మలయశ్రీ, కాలువ మల్లయ్య హీరాలాల్ మోరియా, వ్యాపార నవలలు విస్తృతంగా వచ్చాయి. పెద్దింటి అశోక్‌కుమార్ నవలలు ఊరికి ఉప్పలం, జిగిరి లాంటివి ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చాయి.

7. 2002 ఇప్పటి దాకా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు:

ఈ కాలంలో తెలంగాణ ప్రజలు మునుపెన్నడు లేనంత నిర్బంధాన్ని అనుభవించారు. రకరకాల ముసుగు సంస్థలు, ప్రజాస్వామిక వాదులను, విప్లవకారులను హత్యచేశారు. చురుకైన నాయకులను హత్యచేశారు. ప్రజలల్లో ప్రజాస్వామిక హక్కుల కోసం పెద్దఎత్తున ఉద్యమం వలస వాదులకు వ్యతిరేకంగా జరిగింది. వంటావార్పు - మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె లాంటి అనేక పోరాటాలల్లో లక్షలాది మంది ప్రజలు కదిలారు. ఫలితంగా అధికార మార్పిడి జరిగి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం జూన్ 2, 2014లో ఏర్పడింది... ఈ కాంలో పి. చంద్ - నల్లమల - జాతశ్రీ - వెదురు పొదలునినదించాయి, వసంతరావ్‌దేశ్ పాండే - అడవి, భూమి గుండ్రంగానే ఉన్నది. పెద్దింటి అశోక్ కుమార్, దాడి, జిగిరి, సంచారి, మిలియన్ మార్చ్ నవలలు. పి. చంద్ సకల జనుల సమ్మె - జాజుల గౌరి వొయినం - బోయ జంగయ్య నవలలు; భూతం ముత్యాలు - సూర, వేముల ఎల్లయ్య, సిద్ది. పద్మ కుమారి - పొల్గుణ, స్కైబాబా ముస్లిం జీవిత నేపథ్యం ఆపా వచ్చింది. ఈ కాలంలో వందలాది నవలలు విప్లవోద్యమం, దళిత, మహిళ, ఆదివాసీ, మత మైనారిటీ కార్మికోద్యమ నవలలు వచ్చాయి. మొదట బ్రాహ్మణులే నవలలు రాసినా - ఆ తరువాత బహుజన దళిత, మహిళలు నవలలు రాయడం ప్రత్యేకత -ఉత్పత్తి శక్తులు పడుతున్న సుదీర్ఘ పెనుగులాట, పోరాటం ప్రధాన వస్తువయ్యింది.

నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం భారతదేశంలో దీర్ఘకాలిక పోరాటంగా మారడం నుండి - ప్రపంచంలో - సోషలిస్టు శిబిరం లేని దశలో - 1976 తరువాత మార్క్సిజం - లెనినిజం - మావోయిజం చేర్పుగా జరుగుతున్న ప్రజా పోరాటాల నేపథ్యంలో తెలుగులో నవలలు తమ వంతు కర్తవ్యంగా అన్ని రకాలుగా ప్రజా ఉద్యమాలతో పాటే నడవడం ఈ కాలపు నవల సాధించిన కృషి... ప్రజల భాష ఎక్కువ భాగం నవలల్లో రావడం విశేషం.

నూతన ప్రజాస్వామిక విప్లవం మూడో దశ:

భారతదేశ నూతన ప్రజాస్వామిక పోరాట చరిత్రలో మూడో భాగమైన 1947 తరువాతి చరిత్ర ఇప్పటి దాకా క్లుప్తంగా చెప్పుకోవాలంటే అధికార మార్పిడి ఆగస్టు 15, 1947లో జరిగిన తరువాత భారతదేశం వలస దశ నుండి అర్ధ వలస - అర్ధ భూస్వామిక దేశంగా మారిపోయింది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో మూడు వంతుల దేశాలు వలస పాలన నుండి విముక్తమైన దశ. ఒకపక్క కమ్యూనిజం భూతం ప్రపంచాన్ని చుట్టేసిన దశ - మరోపక్క పెట్టుబడి సామ్రాజ్యవాదంగా మారి - ఈ కొత్త పరిణామంలో - తమ మనుగడకోసం - కొత్త ఎత్తుగడలు - వ్యూహం అనుసరించడానికి పూనుకుంది. సోవియట్ యూనియన్ ప్రపంచ కార్మిక వర్గ పోరాటాలకు అండగా నిలుచున్నది. చైనాలో కార్మిక కర్షకపోరాటాలు - అక్కడి భూసామ్య శక్తులతో - అమెరికా సామ్రాజ్యవాదంతో వీరోచిత పోరాటాలల్లో ముందుకు సాగుతోంది. యూరప్‌లోని జర్మనీ, ఇంగ్లడ్ ఆసియాలోని జపాను పెట్టుబడిదారిదేశాలు యుద్ధంవలన - వలసలు కోల్పోయి మరెంత మాత్రం - తమ వలసలను నిలుపుకోని పరిస్థితి - రెండో ప్రపంచ యుద్ధంలో ఆయుధాలు అమ్ముకొని బలపడిన అమెరికా సామ్రాజ్యవాద దేశంగా ప్రపంచ పెత్తనం చేయడానికి రంగం సిద్ధం చేసుకొంటోంది.

ఇలాంటి సన్నివేశంలో - అన్ని భూర్జువా పార్టీలను ధిక్కరించి - పోరాడిన ప్రజలను పక్కదారి పట్టించడానికి దేశ విభజన - దేశ వ్యాపితంగా మత కలహాలను భూర్జువా పార్టీలు వ్యాపింప చేశాయి.. దేశ వ్యాపితంగా మిగిలివున్న సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసుకున్నది.

ఇలాంటి సంక్షోభ సమయంలో - బ్రాహ్మణీయ భూస్వామ్య దళారీ పెట్టుబడిదారుల బాంబే ప్లానుకు అనుకూలంగా బ్రిటిష్ వారి పెట్టుబడి సజావుగా సాగడానికి తగిన రాజ్యాంగం కోసం, గాంధీ నెహ్రూ, పటేల్ లాంటి వాళ్లు భారత రాజ్యాంగం నిర్మాణం చేపట్టారు.

బ్రిటన్‌కు నమ్మకమైన సేవకుడు - జడ్జి కర్నాటకు చెందిన బ్రాహ్మణుడు బెనిగల్ నర్సింగ రావుతో తొలి రాజ్యాంగ ముసాయిదా 243 ఆర్టికల్స్ పదమూడు షెడ్యూల్స్‌తో వీరందరు కలిసి రాయించారు. ఆయన ఇంగ్లండు, ఐర్లాండు, కెనడా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, అమెరికా దేశాల రాజ్యాంగంలోని విషయాలను ఈ రాజ్యాంగంలో పొందుపర్చారు. ప్రజలను మభ్యపెట్టడానికి ఫేబియన్ సోషలిస్టు నెహ్రూ ప్రణాళికలకు సంబంధించి రష్యా ప్రణాళికలను అదీ లెనిన్ - స్టాలిన్ అమలు పరుస్తున్నవికాక కౌటిస్కీ ప్రభుత్వ, ఉమ్మడి, ప్రైవేట్ యాజమాన్యపు దీర్ఘకాలిక ప్రణాళికలకు చోటిచ్చారు.

అప్పటికే ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఈ కొత్త రాజ్యాంగ రచనకు అంబేద్కర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆ విధంగా స్వంతాస్తిని స్థిరపరిచే - ఊహాత్మకమైన హక్కుల ఆడంబరంతో అనేక సవరణలతో - చివరకు 395 ఆర్టికల్స్ ఎనిమిది షెడ్యూల్స్‌తో రాజ్యాంగం తయారయ్యింది.

నిమ్న కులాల ప్రయోజనాలు కాపాడాలని తప్ప మరేపెద్ద ఆశతోనూ నేను రాజ్యాంగ సభలోకి రాలేదని అంబేద్కర్ అన్నారు. ప్రజలచేత, ప్రజలకొరకు, ప్రజల యొక్క అనే ఆడంబరంతో రాజ్యాంగం 26 జనవరి 1950 నాడు అమల్లోకి వచ్చింది. ఈ మాత్రం సహించని బ్రాహ్మణీయ తీవ్రవాద శక్తులు - పాకిస్తాన్ ప్రత్యేక దేశంగా ఏర్పాటుకు ఒప్పందం ప్రకారంగా 72 కోట్లలో 22 కోట్లు ముందే చెల్లించి.- ఇంకా 50 కోట్లు చెల్లించడం భరించజాలని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన నాథ్‌రామ్ గాడ్సే 30-01-1948 నాడు గాంధీని కాల్చి చంపారు.

108 స్థానాలకు ఎనిమిది స్థానాలు మాత్రమే గెలిచిన కమ్యూనిస్టులు, సోషలిస్టులు ఈ రాజ్యాంగాన్ని ఖండించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కాకుండా కార్మికవర్గ నియంతృత్వంపై ఆధారపడిన రాజ్యాంగం డిమాండ్ చేశారు.

ప్రైవేట్ ఆస్తులన్నింటిని పరిహారం చెల్లించకుండా , జాతీయంగాని, సంఘంపరంగానీ చేయడానికి వీలుకలిగించే రాజ్యాంగం - వారి మొదటి డిమాండ్. రెండోది ప్రాథమిక హక్కులు సంపూర్ణంగా ఉండాలి. వాటిపై పరిమితులు ఉండరాదు.

రాజ్యాంగంలో పొందుపర్చిన సూత్రాలన్నీ ఈ తరం వారి అభిప్రాయాలు - ఎక్కువగా చెప్పానుకుంటే - రాజ్యాంగ సభ్యుల అభిప్రాయాలే (ప్రజల అభిప్రాయాలు కాదు) ప్రజలకు ఈ రాజ్యాంగం అవసరం లేదనుకుంటే మార్చుకుంటారని అంబేద్కర్ రాజ్యాంగం ముగింపు సభలో చెప్పారు.

అదే సభలో - అంబేద్కర్ - ప్రజాస్వామ్యం నియంతృత్వానికి దారితీసే ప్రమాదముంది - ఇప్పుడే పుట్టిన మన ప్రజాస్వామ్యం తన స్వరూపాన్ని అలా వుంచుకుంటూనే ఆచరణలో నియంతృత్వానికి దారితీయవచ్చునని చెప్పారు...

1947 నుండి ఇప్పటిదాకా 74 సంవత్సరాల కాలంలో బ్రాహ్మణులే ప్రధానమంత్రిగా 51 సంవత్సరాలున్నారు. అధికార

భారతదేశంలో 1947 తరువాత కుల ప్రధాన్యం మరింత పెరిగింది. ప్రతి సామాజిక మార్పులో ముందు వరుసలో ఉన్న కులాలు ఎంతో కొంత లబ్ది పొందాయి. ఆ విధంగా లబ్ది పొందిన కులాలు కింది కులాలకు పీడక శక్తులుగా నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో తయారయ్యాయి. ఉత్పత్తి శక్తులు తమ మీద అంతకంతకు పెరుగుతున్న దోపిడి హింసలకు వ్యతిరేకంగా నిరంతరాయంగా పోరాడుతూనే ఉన్నాయి-1967 నక్సల్బరి నుండి నేటి దాకా ప్రజలు పోరాడుతూనే ఉన్నారు.

యంత్రాంగమంతా ఎక్కువ భాగం బ్రాహ్మణ కులంతో నిండిపోయి ఉన్నది. రాజపుత్రులు 2 సంవత్సరాలు, సిక్కు మన్‌మోహన్ సింగ్ 10 సంవత్సరాలు మొత్తంగా 67 సంవత్సరాలు అగ్రకులాలే - వి.పి. సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో మండల్ కమిషన్ - బహుజన, దళిత కులాల ఆందోళనలకు కేంద్రమయ్యింది.

ఫలితంగా అగ్ర కులంగా గుజరాత్‌లోని ఒక కులాన్ని బి.సి.గా మార్చి మరో ఏడు సంవత్సరాలు అగ్రకులమే ముసుగుతో పాలించింది. చైనా 01-10-1949 పీపుల్స్ రిపబ్లిక్‌గా ఏర్పడింది. శ్రామిక వర్గ నియంతృత్వంతో సోషలిస్టు చైనాగా రూపొందడం ఆరంభించింది. రష్యా సాంకేతిక, ఆర్థిక సహాయాలందించింది.

స్టాలిన్ మరణం తరువాత కృశ్చేవ్ అధికారంలోకి వచ్చారు. 1956 తరువాత వర్గ పోరాటం స్థానే శాంతియుత పరివర్తన ప్రచారంలోకి తెచ్చారు. అదును కోసం చూస్తున్న అమెరికా కృచ్చేవ్‌కు రెడ్ కార్పెట్ పరిచారు. క్రమ క్రమంగా రష్యా సోషల్ సామ్రాజ్యవాద దేశంగా రూపొందడం ఆరంభమయ్యింది. చైనా రష్యాను రివిజనిస్టుగా ప్రకటించింది. రష్యా నుండి పొందుతున్న ఆర్థిక, సాంకేతిక సహాయాలు ఆగిపోయాయి. భారతదేశంలో ఈ ఫలితాలు ప్రారంభమయ్యాయి.

అమెరికా భారత్‌లో తన పెట్టుబడులు పెంచుకోవడానికి పాకిస్తాన్‌ను పావుగా వాడుకున్నది. అందుకు కశ్మీర్ బలిపశువు మొదటి యుద్ధం ఏప్రిల్ 1965 నుండి సెప్టెంబర్ 1965 దాకా జరిగింది. తాష్కంట్‌లో అప్పటి ప్రధాన మంత్రి లాల్ బహద్దూర్ శాస్త్రి, ఆయూబు ఖాన్ మధ్య చర్చలు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరిగాయి. శాంతి సంధి మీద సంతకాలు చేసిన మరునాడు 11-01-1966 అనూహ్యంగా గుండెపోటుతో లాల్ బహద్దూర్ శాస్త్రి మరణించారు. అమెరికా తన గూడచారి వ్యవస్థ సి.ఐ.ఏ.తో విష ప్రయోగం చేయించినట్లు ప్రజలు భావించారు. విచారణలు - అతని వ్యక్తిగత డాక్టర్‌ను విచారణ హాజరు కావడానికి బయలుదేరగా ఒక లారీ గుద్ది చంపడం - వ్యక్తిగత కార్యదర్శిని ఇంటి ముందే గుర్తు తెలియని వ్యక్తులు చంపడం - లాంటివి ఈ భావనకు కారణం. అణుశాస్త్రవేత్త హెూమీబాబా విమాన ప్రమాదం-లాల్ బహదూర్ శాస్త్రి మరణం గురించి తమకు ఆలోచన ఉన్నట్లు మాజీ సి.ఐ.ఏ. అధికారి ఒకరు పదవీ విరమణ తరువాత వెల్లడించారు. ఆ తరువాత చాలా కాలం రష్యా సోషల్ సామ్రాజ్యవాదం అమెరికన్ సామ్రాజ్యవాదపు ఆట స్థలంగా భారతదేశం మారిపోయింది. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రుల హత్యలు జరిగాయి. ఈ పరంపరలో భారతదేశంలో పి.వి. నర్సింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో డెంగ్ జియావో పింగ్ ఉత్పత్తి శక్తుల సిద్ధాంతాన్ని ఆదర్శంగా తీసుకొని పి.వి. నర్సింహారావు 1991లో ప్రపంచీకరణకు తలుపులు బార్లా తెరిచారు.

భారతదేశంలో 1947 తరువాత కుల ప్రధాన్యం మరింత పెరిగింది. ప్రతి సామాజిక మార్పులో ముందు వరుసలో ఉన్న కులాలు ఎంతో కొంత లబ్ది పొందాయి. ఆ విధంగా లబ్ది పొందిన కులాలు కింది కులాలకు పీడక శక్తులుగా నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో తయారయ్యాయి. ఉత్పత్తి శక్తులు తమ మీద అంతకంతకు పెరుగుతున్న దోపిడి హింసలకు వ్యతిరేకంగా నిరంతరాయంగా పోరాడుతూనే ఉన్నాయి-1967 నక్సల్బరి నుండి నేటి దాకా ప్రజలు పోరాడుతూనే ఉన్నారు.

మండల్ కమిషన్ - మూలకంగా బహుజనులు, దళితుల్లో విద్యావంతులు తయారయ్యారు. అందులోనే ఆర్థిక హెూదా రీత్యా పెటీ భూర్జువా వర్గంగా మార్పు చెందింది. వీళ్ళ రాజ్యాంగం పట్ల నిబద్దులు-మిగతా అట్టడుగు ప్రజల పట్ల వీళ్లకు సానుభూతి తప్ప - పోరాటంలో నిలబడి పొరాడిందిలేదు. నూతన ప్రజాస్వామిక ప్రజా పోరాటాలల్లో నుండి - బహుజనులు, దళితుల నుండి నాయకత్వ స్థానంలోకి ఎదిగిన తరం ఇప్పుడు అగ్రకుల రాజ్యాధికారానికి పెను సవాలుగా నిలిచింది. వీళ్లను ఏరిఏరి విప్లవోద్యమ పరిణామ క్రమంలో కుల ప్రాతిపదికన రకరకాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒక పద్ధతి ప్రకారం హత్యలు గావించాయి.

1947 తరువాత మహిళల పరిస్థితి మరింత దిగజారింది. వ్యవసాయంలోను, ఇంటి బాధ్యతలకు తోడు, ఉద్యోగంలో చేరడంతో శ్రమ పెరిగింది-ఆస్తి మీద హక్కు-తగిన ఆస్తి లభించకపోవడం మూలకంగా-తీవ్రమైన వైరుధ్యాలకు దారితీసింది.

ఈ మొత్తం పరిణామ క్రమంలో-సారవంతమైన భూముల కోసం, ఖనిజాల కోసం-బహుళజాతి పరిశ్రమలు అడవుల్లోకి విస్తరించాయి. ఈ పరిణామం ఆదివాసులకు చావోరేవో తేల్చుకోవాల్సిన స్థితికి నెట్టింది.

ఈ నేపథ్యంలో వచ్చిన భారతీయ నవలా సాహిత్యంలో 'ఉత్పత్తి శక్తుల పెనుగులాట-విధ్వంసం, వొత్తిడి, నిరాశ, నిస్పృహ-అపనమ్మకం లాంటివి ప్రధాన కథావస్తువులుగా వచ్చాయి. ఇది ఒక రకంగా స్వీయాత్మక వ్యక్తివాదపు, అనుభవ వాదపు ఉత్సాహమే.

1967 తరువాత నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం ఆరంభమైన తరువాత క్రమంగా ఉత్పత్తి శక్తుల పరిమాణాత్మక పోరాటాలు, గుణాత్మక పోరాటాలుగా ఎదగడం నవలల్లో చోటుచేసుకున్నది... అలాంటి విప్లవ పోరాటాలు కొన్ని ప్రాంతాల నుండి-ఎదిగి దేశ వ్యాపితంగా విస్తరించే క్రమం ఆరంభమయ్యింది.

ఈ దశలో విప్లవ శక్తుల రాజకీయ బలాన్ని, నిర్మాణాన్ని గుర్తించడం-రకరకాల వైరుధ్యాలతో-ముఖ్యంగా కుల, వర్గ, లింగ, మత, ప్రాంత ప్రజా పోరాటాలను ఐక్యం చేయడం-వీరోచిత పోరాటాలను ఎత్తిపట్టడం-ప్రజల్లోకి బలంగా తీసుకుపోవడం-పెరుగుతూ వస్తున్నది...ప్రజా పోరాటాలను సైద్ధాంతికంగా-క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయడం పెరిగింది.

(ఇంకా ఉంది)

ప్రతీకారం

మొలకలపల్లి కోటేశ్వరరావు

"మంగీ! ఓ మంగేయ్ కుడితి తెచ్చావా?" చీకట్నే నిద్రలేచి పందుల్ని మేపుకు తోలుకుపోయిన ఎర్రోడు పొద్దు బారెడు ఎక్కినాక వాటిని తోలుకొస్తూనే కేకపెట్టాడు.

"తెచ్చా! గుడిసెలో వుంది బుంగ" గుడిసె వెనుక వున్న రోట్లో పచ్చడి నూరుతూ తనూ కేక పెట్టి చెప్పింది మంగి.

ఎర్రోడు గుడిసెలోకి పోయి, కుడితి బుంగ తెచ్చి పందులు కుడితి తాగే గాబులో పోసాడు.

పందులు అరుస్తూ, ఒక దాన్ని ఒకటి ముట్టెతో నెట్టుకుంటూ కుడితి తొట్టిమీద పడ్డాయి. మంగి కుడితి బుంగ తీసుకొచ్చి, తనే గాబులో పోసేది. పక్కనే వున్న తన బావ వాళ్ళ పందులు వచ్చిపడి తాగి పోతున్నాయి. తను పోయడం, వాళ్ళ పందులు తాగడం, తగాదా పట్టం ఎందుకు గొడవ అని గాబులో పోయకుండా తెచ్చిన కుడితి బుంగ, గుడిసెలో పెడుతోంది.

ఎర్రోడు, మంగీ భార్యా భర్తలు, అన్యోన్య దాంపత్యం. ముచ్చటైన జంట.

ఇద్దరూ ఏపనికైనా కలిసే వెళ్తుంటారు. జీవితంలోనూ అలానే కలిసి పోయారు. పందులు కుడితి తాగినాక, వాటిని గూట్లో తోలి, గూటికి అడ్డంగా చెక్క పెట్టాడు. అప్పటికి పచ్చడి నురుకుని మంగి గుడిసెలోనికి వచ్చింది.

"తొందరగా కానిచ్చి కూడు వండీ, తిని పోయి మెల్లె కొట్టుకుని వద్దాం"

"సుజాతమ్మ వాళ్ళ ఇంటో చద్ది కూడు మిగిల్తే తెచ్చా! పచ్చడేసుకుని తిని పోదాం. మజ్జెన్నం వచ్చినాక కూడు వండుతా!" అంది మంగి.

ఎర్రోడు ఈత మెల్లెలతో తట్టలూ, బుట్టలూ, గంపలూ అల్తాడు. మంచి పనోడు. చక్కగా, అందంగా, నైపుణ్యంతో బుట్టల అల్లకం చేస్తాడు. మంగి వాటిని వూళ్ళోనూ, చుట్టు పక్కల వూళ్ళలోనూ అమ్ముకుని వచ్చిద్ది.

పచ్చడేసుకుని ఇద్దరూ చద్దన్నం తిన్నారు. ఎర్రోడు కండవా భుజానేసుకుని కత్తి తీసుకుని బయల్దేరాడు. అనుసరించింది మంగి.

వాగులమ్మటా, చేలమ్మటా, గట్లమ్మటా ఈత చెట్లు వున్నాయి. ఎర్రోడు చెట్లెక్కి మెల్లెలు కొట్టాడు. మంగి వాటిని పేర్చి మోపులు కట్టింది. ఇద్దరూ చెరొక మోపు నెత్తికి ఎత్తుకుని మజ్జాన్నం వేళకి గుడిసెకి చేరారు.

మంగి బియ్యం కడిగి పొయ్యి మీద పెట్టింది. ఎర్రోడు కుక్కినులక మంచం మీద నడుం వాల్చాడు.

ఎర్రోడి అసలు పేరు సుబ్బుడు. వాళ్ళ అమ్మా అయ్యకి నలుగురు కొడుకులు. వీడు మూడో వాడు. వీడి అన్నలు ఇద్దరూ, తమ్ముడూ కటిక నలుపు. వాళ్ళలో వీడు ఒక్కడే ఎర్రగా వుండేవాడు. అందుకే చిన్నప్పట్నించీ వీడ్ని "ఎర్రోడా, ఎర్రోడా" అని పిలిచేవాళ్ళు. అదే పేరు వాడికి పడిపోయింది.

ఊర చెరువు కట్ట మీద వీళ్ళ గుడిసె. గుడిసె పక్కన పందుల దొడ్డి.

అన్నం ఉడికిన తరువాత తిని, పందుల్ని నీళ్ళు ఎండిన చెర్లోకి తోలుకుపోయాడు ఎర్రోడు. మంగి కూడా అన్నం తిన్నది. కొద్దిసేపు తరువాత పంది పెంట గంప తీసుకుని ఎర్రోడు వెళ్ళిన దారిన వెళ్ళింది మంగి.

ఎర్రోడు పందుల్ని కాస్తుంటే, మంగి ఆ పందుల వెంట

తిరుగుతూ, ఉదయం పూట, ఈ పూటా పెట్టిన పెంటికల్ని ఏరి గంపలో వేసుకునేది. గుడిసె పక్కన ఆ పెంటికల్ని పెద్ద రాశి చేసింది. రైతులు చాలా ఇష్టంగా, చాలా ధర పెట్టి వాటిని కొంటారు.

ఎర్రోడు, మంగి దంపతులకి ఒక కొడుకూ, కూతురూ! కొడుక్కి 17 ఏళ్ళు. వాడు బేల్దారీ పని కోసం ఒక మేస్త్రీ దగ్గర జీతం మాట్లాడుకుని నైజాం పోయాడు.

కూతురికి 15 ఏళ్ళు. రెండేళ్ళ నాడు కూతురికి 13వ ఏటనే మంగి సొంత తమ్ముడితో పెళ్ళి చేసింది. మేనమామని చేసుకున్న ఆ అమ్మాయి అత్తవారింటికి, అంటే అమ్మమ్మ వాళ్ళింటికి కాపురానికి వెళ్ళింది.

ఎర్రోడికి పది పందులు వున్నాయి. అవే వాళ్ళ స్థిర చరాస్తులు. ఆ పందులంటే ఎర్రోడికి అమిత ప్రేమ.

"మనకి బువ్వ పెడతంది ఈ పందులేనే! మనం వీటిని ఎంత జేగర్తగా చూసుకుంటే అంత ఆదాయం. ఇయ్యే మనకి ఆధారం! బిడ్డలైనా మనకి కానీ ఇయ్యరేమో కానీ, ఈ జీవాలు కోరినంత డబ్బు ఇస్తయ్యే! ఈట్ని ఎంత సక్కగా సాక్కుంటే అంత మంచిది!" అనేవాడు భార్యతో.

మంగికి కూడా పందులంటే ఇష్టమే! వాళ్ళ పుట్టింటి వాళ్ళకి కూడా చాలా పందులు వున్నాయి. చిన్న తనం నించీ పందుల్తో పాటు పుట్టి పెరిగినదే! పందుల్ని మాలిమి చేసుకోవడం, వాటి నడకా, తీరూ మంగికి ఎరికే!

మంగి భర్తకి అనుకూలంగానే వుంటుంది కానీ, ఒక్కోసారి ఎర్రోడి తీరు బొత్తిగా నచ్చదు.

"నువ్వు మడిసి మంచోడివే కానీ కాస్తంత ఎర్రి వుందయ్యా నీకూ! ఏపకాయంత ఎర్రి! ఆ ఎర్రి వదిలిచ్చుకుంటే బాగుడిద్ది. నువ్వు ఎర్రోడివే కాదు, వెర్రోడివి కూడా! ఎర్రిని పోగొట్టుకో ముందు! అదొక్కటే లోటు నీకు!" అనేది ఎర్రోడితో నవ్వుతూ ముద్దుముద్దుగా,

ఎర్రోడికి ముఖమాటం లేదు. నేది ఎదో ముఖం మీదనే అంటాడు. సొంత అన్నలతో ఆనీ, వూళ్ళో వాళ్ళతో కానీ ఏదైనా సందర్భం వచ్చినప్పుడు నిర్మోహమాటంగా మాట్లాడతాడు.

మనసులో మాలిన్యం లేదు. మర్మం లేదు. కల్లాకపటం లేదు. కంత్రీ తనం లేదు.

ఎర్రోడి అన్నలు రేత్రిళ్ళు గూట్లో నించి పందుల్ని వదిలేవాళ్ళు. అవి రైతుల చేలల్లో పడి మేసి వచ్చేవి. ఇక రైతులు కర్రల్తో వచ్చి ఆ అన్నల్ని తిట్టీ, ఒక్కోసారి కొట్టీ గొడవ చేసేవాళ్ళు. అయినా ఆ అన్నలు పద్ధతి మార్చుకునే రకం కాదు. ఎర్రోడు అన్నల్ని తిట్టేవాడు. తప్పు పద్ధతి అని దండించేవాడు. రైతుల పక్షానే మాట్లాడేవాడు. రైతులు దురుసుగా, బూతులు మాట్లాడితే వాళ్ళని ఎదిరించేవాడు.

ఎర్రోడు తన పందుల్ని ఎప్పుడూ చేలల్లో పడనిచ్చేవాడు కాదు. జాగ్రత్తగా కాచుకునేవాడు.

అన్నదమ్ములు నలుగురైనా ఎర్రోడు వాళ్ళ అమ్మని తన వద్దనే వుంచుకుని ఆమె మంచీ చెడ్డా చూసాడు.

పందులు మేపుకోవడం, సమయం వుంటే బుట్టలు, తట్టలు, గంపలు అల్లుకోవడం అదేపని. ఊళ్ళోకి కూడా ఎప్పుడూ వెళ్ళడు.

మంగి ఉదయం మూడు ఇళ్ళలో పని చేస్తుంది. ఇద్దరు బడి పంతుళ్ళు, మరొకరు ప్రెసిడెంట్ ధర్మయ్య వాళ్ళ ఇంటిలో పని. బడి పంతుళ్ళు నెలకి తొమ్మిది వందలు ఇస్తే, ప్రెసిడెంట్ వాళ్ళు వెయ్యి జీతం ఇస్తారు. అవి వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు! ఇక వాళ్ళ ఇళ్ళలో మిగిలిన చద్దికూడు, చద్దికూర తెచ్చుకుని వాటితోనే ఎక్కువసార్లు ఉదయం పొట్ట నింపుకునే వాళ్ళు.

* * *

పంచాయితీ ఎన్నికలు. ఊరంతా సందడి సందడిగా వుంది.

ధర్మయ్య ఒక పార్టీ తరపునా, రామకృష్ణ ఒక పార్టీ తరపునా పోటీ చేస్తున్నారు. పార్టీ గుర్తులు లేకపోయినా అనధికార పార్టీ అభ్యర్థులు. పోటీ గట్టిగానూ, హొరాహొరీగానూ వుంది.

పాతికేళ్ళుగా పంచాయితీ ధర్మయ్య ఆధీనంలోనే వుంది. జనరల్ అయితే ఆయనా, జనరల్ మహిళ అయితే ఆయన భార్య సర్పంచ్‌లుగా పనిచేసారు. బీసీలకీ, ఎస్సీలకీ రిజర్వేషన్ అయినప్పుడు తన మనుషుల్నే సర్పంచ్‌లుగా నిలబెట్టి గెలిపించుకున్నాడు. నిజానికి వాళ్ళు సర్పంచ్‌లు అయినా పెత్తనం అంతా ధర్మయ్యే చలాయించాడు.

ఇప్పుడు జనరల్ కావడంతో ధర్మయ్య, ఆయనకి పోటీగా రామకృష్ణ రంగంలో వున్నారు.

కొద్ది మంది అభిమానులూ, అనుచరులూ, కార్యకర్తలూ వెంటరాగా, ధర్మయ్య ఇల్లిల్లూ తిరుగుతూ, ఓట్లు వేయమని అభ్యర్థిస్తూ ఎర్రోడి గుడిసె దగ్గరకి వచ్చాడు. చీకట్లు ముసురుకుంటున్నాయి.

కుక్కి నులక మంచం మీద పడుకుని కూని రాగాలు తీస్తున్న ఎర్రోడు వస్తున్న జనాన్ని చూసి లేచి నిలబడ్డాడు.

"ఏరా ఎర్రోడా... ఏం చేస్తున్నావురా!" వస్తూనే అడిగాడు ధర్మయ్య.

"ఏముంది సామీ చేయడానికీ? తినడం, పందుల్ని కాసుకోవడం ఇదేగా సామీ నా పని!"

"సరేరా! గురువారం పంచాయితీ ఎన్నికలు, నువ్వూ, నీ పెళ్ళాం ఓటెయ్యాల్రా!"

"ఎవురికీ?"

"ఎవురికేందిరా? నాకే! గంట గుర్తు మనది!"

"ఓటా! నీకా? చస్తే నీకు ఓటు వేయను సామీ!"

ఊహించని జవాబుకి బిత్తర పోయాడు ధర్మయ్య. ఆయన ఎన్నో ఎన్నికల్ని చూసాడు. ఎన్నో వేల మందిని ఓట్లు అడిగి వుంటాడు. ఇంత కరాఖండిగా, ఇంత నిక్కచ్చిగా, ఇంత తెగింపుగా 'నీకు ఓటు వేయను' అని ముఖమాటం లేకుండా ముఖాన్నే చెప్పిన

వాడు ఒక్కడు లేడు. ఎన్నడూ ఎరుగని అనుభవం! షాక్ తిన్నట్లు అయిపోయాడు. ముఖం వాడిపోయింది.

"ఏందిరా అంత మాట అన్నావూ? ఓటేగా నేను అడిగింది!"

"నేను చెప్పిందీ అదేగా సామీ! ఓటేగా!"

"ఏమైందిరా అంత గట్టిగా అంటున్నావూ?"

"నీకు ఎందుకు వేయాలి సామీ ఓటు? మేం అడిగిన పనిచేసి పెట్టావా? నువ్వు మాకు ఏం చేసావు?"

"ఏం అడిగారూ, ఏం చేయలేదురా?"

"నీకు తెలియదా సామీ? నాకు ఓటు వచ్చిన కాణ్ణించీ నీకో, నువ్వు చెప్పినోళ్ళకో తప్ప మరొకరికి ఓటేసి ఎరుగను. అసుంటిది మేం అడిగిన చిన్నపని... చచ్చి ఎక్కడుందో మా అమ్మ, ఆమెకి పించను ఇప్పిచ్చు సామీ అని నీ చుట్టూ ఎంతకాలం తిరిగానూ? అదిగో ఇదిగో, రేపూ మాపూ, చేద్దాం చూద్దాం అంటూ కాలం జరుపుకుంటూ వచ్చావుకానీ పించను ఇప్పిచ్చావా? మా ముసల్ది పించను ఎరక్కుండానే కాలంచేసే కదా?, ఓపిక వున్నంతకాలం మీ ఇంట్లో చాకిరీ చేసిందే! ఒకపనా? మీ ఇంట రేయింబొగుళ్ళు చాకిరీ చేసినా ముందే నీ దగ్గరకొచ్చి, మొగుడు చచ్చిన దేవినేని కాంతమ్మ, పదెకరాలు వున్న ఆసామి అడిగితే ఆమెకి ఇప్పిచ్చావు. భూములూ, బాడవలూ, ఆస్తులూ అంతస్తులూ వున్న పెద్ద పెద్ద మారాజులకి పించన్లు వచ్చినయ్యి కానీ, కూటికి గతిలేని మాలాంటోళ్ళకి ఇయ్యకపోతిరి! మేమేం ఉజ్జోగాలు కావాలని అడిగామా, వూళ్ళు ఏలాలని అడిగామా? దానబ్బదాల......? పించనేగా సామీ! అదీ మీ సొమ్ము కాదుగా? సర్కారు ఇచ్చే సొమ్ము! అంత చిన్న పని చేసిపెట్టకపోతివీ! ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని నువ్వు ఓటు అడుగుతావూ, మేం ఏ ముఖం పెట్టుకుని నీకు ఓటు యేస్తాం సామీ?"

"సరేరా ఎర్రోడా! ఓటు వెయ్యకపోతే వెయ్యకపోయావులే! రేపట్నించీ మీ పందులు ఎక్కడమేపుకుంటావో, ఎట్ట మేపుకుంటావో చూస్తాం! నీ పందులు మా చేలల్లో పడకుండా వుంటయ్యా, నీ అంతు చూడమా? నిన్ను తేలిగ్గా వదుల్తాం అనుకోవాకురేయ్!" ధర్మయ్య ముఖ్య అనుచరుడు ఏదు కొండలు కోపంగా కన్నెర్రచేస్తూ, ముందుకురుకుతూ అన్నాడు.

"నువ్వు వూరుకోరా కొండలూ! నోరు జారవాకు. అమ్మా అయ్యా అని బతిమాలుకోవాలి కానీ నోరు జారితే ఎట్రా? ఇయ్యాల అవసరం మనది!" కొండల్ని శాంతపరుస్తూ అన్నాడు ధర్మయ్య.

"ఏందన్నా, గోచిగాడు! వీడెంతా, వీడి బతుకెంతా? నువ్వు తీసిపారేసిన చెప్పులు కరీదు చేయడు. ఎట్ట అంటే అట్ట మాట్టాడతాడూ?"

"నేను గోచిగాడ్నే! నేనేం నీ సొమ్ముకి ఆశపడలేదే, నువ్వే నా ఓటుకి ఆశపడ్డావు కానీ! నీకు వుంటే నువ్వు పది సార్లు తినూ, ఇరవై సార్లు పో! పందులా, అవి మీ చేలల్లో పడినప్పుడు అడుగూ, అప్పుడు చూద్దాం. నా అంతు చూస్తా? ఏం చేస్తావు ఏంది? తల తీసి పాతిపెడతావా? చంపుతావా? నీ లాంటి వాళ్ళని చాలా మందిని చూసా కానీ పోపో ఇంక చాలు!" చాలా నిర్లక్ష్యంగానూ, చాలా ధీమాగానూ, చాలా ఆగ్రహంగానూ, చాలా నిరసనగానూ, కసితో అన్నాడు ఎర్రోడు.

ధర్మయ్యకి తల తీసేసినట్లయింది. అవమానభారంతో తల దించుకుని పక్క గుడిసె దగ్గరకి వెళ్ళాడు. ఆయన మనసు ఆగ్రహ జ్వాలతో రగిలిపోతోంది. ఉక్రోషంతో ఉడికిపోతోంది. కసిగా వుంది. కానీ ఇప్పుడు ఏం చేయలేని స్థితి. వాడ్ని చీమనో, దోమనో, నల్లినో నలిపినట్లు నలిపి పారేయొచ్చుకానీ, ఇది సమయం కాదు.

ఎర్రోడు అన్న మాటలు గంటలోనే వూరంతా తెలిసిపోయాయి. ఎన్నికల సమయంలో నిప్పు లేకుండానే పొగలూ, సెగలూ వస్తుంటాయి. అలాంటిది కాస్తవుంటే, అది గోరంత అయినా సరే కొండంత అవుతుంది.

ధర్మయ్య వాళ్ళు వచ్చినప్పుడు మంగి ఇంట్లో లేదు. ఊళ్ళోకి వెళ్ళింది. అక్కడే విషయం తెల్సింది. వస్తూనే ఎర్రోడి మీద తగాదా వేసుకుంది.

"ఎర్రితనం తగ్గిచ్చుకోరా దేవుడా అని నెత్తీనోరూ కొట్టుకుని మొత్తుకుంటున్నా నువ్వు ఆలకిచ్చవా? నీకు ఇష్టమైతే ఓటెయ్యి లేకపోతే నోర్మూసుకుని వుంటేపోదూ? అంతేకానీ, నీకు ఓటెయ్యనూ అని ముఖాన్నే చెపుతాడా బుద్ధున్నోడు ఎవుడన్నా?"

"తప్పేముందే? వాళ్ళకి ఓటు వెయ్యను కాబట్టి వెయ్యనని చెప్పాను!"

"అంత ముకమాటం లేకుండా మాట్టాడితే ఎట్ట? నిద్రలేస్తే నేను వాళ్ళింటో పనిచేసేదాన్ని! సరేనంటే ఒక మాటతో పోదూ!"

"సరే అని ఎందుకు అంటాను? సరేనంటే నిజంగానే నేను ఆయనకి ఓటువేస్తాను అనుకోదూ? ఆయన తప్పు ఏందో ఆయనకి తెలియకపోతే ఎట్ట?"

"ఏందీ ఆయన తప్పు? ఆయన తీరే అది! పైకి తీపీ లోపల విషం! వళ్ళంతా కుట్రే, కపటమే! అసుంటోడితో ఎందుకూ? పాములాంటోడు! కొరివితో ఎందుకూ తలగోక్కోవడం? నీ బతుకుచెడ! నువ్వు మారవూ, నీ ఎర్రితనం పోదూ?" అని మంగి చెడామడా ఎర్రోడ్ని తిట్టింది.

ఆమెకి మనసులో భయంగా వుంది. ధర్మయ్యతో ఎప్పుడైనా ప్రమాదమే! ఈ విషయాన్ని తేలిగ్గా పోనివ్వడు. ఏదో చేస్తాడు.

నాలుగు రోజులు గడిచాయి. రేపే ఎన్నికలు.

గత రాత్రీ, ఉదయం రెండు పార్టీల వాళ్ళూ జనాలకి బాగా డబ్బు పంచారు. ఓటుకి ఐదువేలు ఇచ్చారు. ఇంట్లో ఎన్ని ఓట్లు వుంటే అన్ని ఐదులు!

పోటీ గట్టిగా వుందనీ, తను ఓడిపోయే అవకాశం వుండొచ్చనీ ధర్మయ్యకి సందేహం వచ్చింది. రాత్రి ముఖ్య అనుచరులతో మేడ మీద మంతనాలు మొదలుపెట్టాడు.

"ఒరేయ్...తెలిగ్గాలేదురా ఎవారం! జనంలో మార్పు

కనపడతంది. ఇప్పటికి చాలా డబ్బుపెట్టాం. తేడా పడితే డబ్బంతా బూడిదలో పోసిన పన్నీరే! గెలుపు ఓటములకి ఒక్క ఓటు చాలు. పోయినసారి జరిగిన ఎలక్షన్లలో పోతవరంలో జాగర్లమూడి రామారావు ఒక్క ఓటుతోనే గెలిచాడు. ఆ ఓడిపోయినోడు కూడా నాకు తెల్సినోడే! పాపం. వాడి ఏడుపు చెప్పేపనికాదు. దేశానికి ప్రధానిగా పనిచేసిన వాజ్‌పాయ్ కూడా ఒక్క ఓటు తేడాతోనే ఒకసారి దిగిపోయాడు. ఇసుమంటప్పుడు మనకి ప్రతి ఓటూ ముఖ్యమే! మన ఓట్లు ఒక్కటి కూడా పోనివ్వకూడదు. వాడికి పడతాయనుకున్న ఓట్లు ఎన్ని పడకుండా చేస్తే మనకి అంత మంచిది. అది వాడికి మైనస్సే! వాడికి పడే ఓట్లు పడకుండా చేసినా సగం గెలిచినట్లే!" అన్నాడు ధర్మయ్య.

అనుచరులతో మంతనాలు ముగిసాయి. ముఖ్య అనుచరుడు కొండల్ని పక్కకి పిలిచి ముఖ్యమైన మాట చెప్పాడు.

తెల్లవారితే ఎన్నికలు. రెండు ముఠాల వాళ్ళ కంటిమీద కునుకులేదు. తాము కొన్న ఓట్లు ఎదుటిపక్షం వాళ్ళు ఇంకా ఎక్కువ మొత్తం ఇచ్చి రహస్యంగా కొంటారనే భయం! దాంతో రెండు ముఠాల వాళ్ళూ తాము కొన్న ఓటర్ల ఇళ్ళని రహస్యంగా కాపలా కాయడం మొదలుపెట్టారు.

గ్రామంలో జనం తిరక్కుండా 144వ సెక్షన్ పెట్టి పోలీస్ వ్యాన్లు కుయ్‌కుయ్‌మంటూ తిరుగుతూనే వున్నాయి. కార్యకర్తలు సందుల్లోనూ, గొందుల్లోనూ చీకట్లో నక్కి చూస్తున్నారు. పోలీస్ వ్యాన్ల శబ్దం వినిపించినప్పుడు గోడల పక్కకి తప్పుకుంటున్నారు.

ధర్మయ్య ముఖ్య అనుచరుడు కొండలు చెరువుకట్ల మీదకి, ఎర్రోడి గుడిసె దగ్గరకి అర్ధరాత్రి దాటిన తరువాత రెండు మూడు సార్లు వెళ్ళివచ్చాడు.

అక్కడ అందరూ చలికీ, మంచుకీ గుడిసెల్లోనే ముడుక్కుని పడుకున్నారు. తెల్లవారింది.

ఊరంతా ఎన్నికల హడావుడీ, కోలాహలం ఒకవైపు, మరోవైపు ఎర్రోడి ఇంట్లో ఏడుపులు! ఎర్రోడూ, భార్యా ఒకరి ఎదురుగా ఒకరు కూర్చుని గుండెలవిసేలా ఏడుస్తున్నారు.

రాత్రి వాళ్ళ పందుల్ని విషం పెట్టి చంపేసారు. వాళ్ళకి వున్న స్థిర చరాస్తులు అవి! వాళ్ళ సకల సంపదలు ఆ పందులే!

వాళ్ళ జీవనాధారం, జీవనం ఆ జీవాలు! అవి చచ్చి పడివున్నాయి.

"మా పందుల్ని చంపినోడు పురుగులుపడి చావాలి దేవుడా! మా పందులు ఎట్ట చచ్చాయో అట్నే వాడూ చచ్చేటట్టూ చేయి సామీ! మా ఉసురూ, మా పందుల ఉసురూ తగిలి వాళ్ళు సర్వనాశనం కావాలి సామీ" అని శాపనార్థాలు పెడుతూ కడుపు తరుక్కుపోయేలా ఏడుస్తున్నారు ఆ దంపతులు.

సాయంత్రమైంది. వాళ్ళు ఓట్లు కాడికి వెళ్లలేదు. ఆ ధ్యాసేలేదు.

ధర్మయ్య ప్రత్యర్థి కామకృష్ణకి పడాల్సిన రెండు ఓట్లు పడలేదు. ఎర్రోడు అవమానించినట్లు భావించిన ధర్మయ్య అహం చల్లారింది.

ఎర్రోడికీ, మంగికీ కూడా నీళ్ళూ లేవు. పచ్చి మంచినీళ్ళు ముట్లుకోలేదు.

"నీ నోటి దురుసు గుండానేగా ఇంతపని జరిగింది! కాపరానికి వచ్చిన కాణ్ణించీ ఎర్రితనం తగ్గించుకోరా సామీ అని మొత్తుకుంటున్నా! నువ్వు నా మాటని ఆలకిచ్చలా! నా మాట వినని కాడికి నేను ఎందుకు ఇంకా ఇక్కడ? నేను అమ్మాయి కాడికి పోతన్నా!" అని మంగి సంచిలో రెండు కోకలూ, రైకలూ కుక్కుకుని కూతురూ, తమ్ముడు దగ్గరకి పుట్టింటికి వెళ్లిపోయింది.

ఎర్రోడు ఎర్రి చూపులు చూస్తూ ఒంటరిగా మిగిలిపోయాడు.

నాలుగు రోజుల తరువాత ఏడు కొండలకి చెందిన పంటకి వచ్చిన ఎకరంన్నర మిరపతోట తెల్లవారేసరికి పీకిపారేసాడు ఎర్రోడు.

(17వ పేజీ తర్వాత)

విషయాన్ని సంపూర్ణంగా, సమగ్రంగా తెలుసుకోవాలంటే దాని రూపసారాలను తెలుసుకోవాలి. అందుకు శాస్త్రీయ సిద్ధాంతం అవసరమవుతుంది. దానికి మానవ బుద్ధి ఉపయోగపడుతుంది. మానవ బుద్ధి సామర్థ్యాన్ని పెంచుకొని విశ్లేషించి తెలుసుకునే తలమే సిద్ధాంతం. అటువంటి సిద్ధాంతాన్ని రూపొందించుకోవడం ద్వారానే సంస్కృతిని కూడా సమగ్రంగా తెలుసుకోగలం. అందుకే సమాజంలో విభిన్న కోణాల్లో సాగే వివిధ సిద్ధాంత అధ్యయనాలు, చర్చలు చాలా బాగా దోహదపడతాయి.

చివరగా మళ్లీ మానవ బుద్ధి, క్రియాశీలతల దగ్గరకు వస్తే- అవి స్వేచ్ఛగా పనిచేసే సామాజిక పరిస్థితుల కోసం పోరాడాలి. అందుకు బుద్ధి, క్రియాశీలతలను నిరంతరం కుదించి, నియంత్రించే పితృస్వామిక, కులాధిపత్య తదితర తిరోగామి సంస్కృతులపై పోరాడుతూ, వాటి నుండి మనుషులు విముక్తం కావాలి. వ్యక్తిస్వేచ్ఛ, హేతుదృష్టి, ప్రగతి అనే ఆధునిక ప్రమాణాలే గీటురాయిగా శ్రామి(కార్మి)క వర్గపు కొత్త సాముదాయకతను బలోపేతం చేసుకుంటూ దాని దన్నుపై రాజ్యాధికార స్పృహతో ప్రత్యామ్నాయ ప్రజా(స్వామిక) సంస్కృతులను నిర్మించుకుంటూ స్థిరీకరించుకోవాలి.

ఇక్కడ రాజ్యాధికారమంటే దోపిడీ, పీడనాణచివేతలకు గురవుతున్న ప్రజలు వ్యక్తిగత, సాంఘిక స్థాయినుండి ఆర్థిక స్థాయి వరకు స్వయం(నిర్ణయ) అధికారం సాధించడమే. అందుకు ఆర్థిక దోపిడీ, సాంఘిక పీడనాణచివేతలను నిర్మూలించే రాజీలేని మార్క్సిస్టు సిద్ధాంతబద్ధమైన విప్లవకర వర్గ పోరాటాలే సరైన శాస్త్రీయమార్గం. వాటి సమన్వయంలోనే మానవ బుద్ధి, క్రియాశీలతలను స్వేచ్ఛగా వికసింపజేసే సకల ప్రజా పోరాటాలను నిర్వహించాలి.

(నెల్లూరులో విరసం 28 వ మహాసభలలో ప్రసంగం కోసం తయారుచేసుకున్న నోట్స్ నుండి రాసిన వ్యాసం)

రెయిన్‌బో

లైంగిక వైవిధ్యాలను అర్థం చేసుకుందాం: రెండో భాగం

లైంగిక వైవిధ్యాలు ఎలా ఏర్పడతాయి?

- బిట్టు కెఆర్

పుట్టుకతో ఆడ, మగ కాని వ్యక్తులుగా వైద్యుల చేత గుర్తించబడే శరీరాలు గలవారు ఉంటారని మనకు తెలుసు. అలాగే తమ జీవితంలో ఏదో ఒక సమయంలో వైద్యులు లేదా కుటుంబ సభ్యులు తమని "ఆడ మగ కాని" వారు అని వైద్యపరంగా వర్గీకరించబడిన శరీరాలు గలవారుంటారు. అటువంటి అనుభవం కలిగి ఉన్న వారు ఇంటర్‌సెక్స్ వ్యక్తులు. హిజ్రాలందరూ ఇంటర్‌సెక్స్ వ్యక్తులని మన సమాజం తప్పుగా భావిస్తూ ఉంటుంది. కాని హిజ్రా సమూహంలో ఎక్కువ మంది ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు. కొద్ది మంది ఇంటర్‌సెక్స్ వ్యక్తులు కూడా ఉంటారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు చాలా వరకు ఇంటర్‌సెక్స్ కాదు. పుట్టినప్పుడు వారిని ఆడ అని గాని, మగ అని గాని వైద్యులు కచ్చితంగా గుర్తించి వుంటారు. కానీ వారి శరీరాలకు ఏ లైంగితక (సెక్స్) నైతే నిర్దేశించి ఉంటారో దానికి సంబంధించిన లింగంతో (జెండర్) వారు ఎదగరు. (సెక్స్ అంటే జీవసంబంధమైనదని, జెండర్ సామాజికమైనదని మొదటి భాగంలో చదివి ఉంటారు).

బదులుగా దానికి విరుద్ధమైన జెండర్‌తో గుర్తించబడతారు -ట్రాన్స్‌జెండర్, మూడవ జెండర్, కిన్నర్, తిరునంబి, తిరునంగై, అరవని, మంగలముఖి -ఇలా వారి స్థానిక భాషలోని పేరుతో పిలవబడతారు. కొన్నిసార్లు, వారు తమకు నచ్చిన లింగంలో జీవించడానికి కాస్త చోటిచ్చే మతపరమైన గుర్తింపులను కూడా తీసుకుంటారు. ఉదాహరణకు ఉత్తర కర్ణాటకలోని జోగప్ప కమ్యూనిటీ, మహారాష్ట్రలోని జోగ్తాలు, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లోని శివశక్తి సంఘం మొదలైనవి. వీరు సాధారణంగా దేవాలయంలో వివిధ రకాల జీతంలేని చాకిరీలు చేస్తూ ఉంటారు.

ఇంటర్‌సెక్స్ వైవిధ్యం ఒకే రకంగా ఉంటుందని జనం అనుకుంటారు. అయితే వాస్తవానికి ఇంటర్‌సెక్స్ వైవిధ్యాలు చాలా రకాలు ఉంటాయి. వాటికి మూలకారణాలు ట్రాన్స్‌జెండర్‌కు గల శాస్త్రీయ ఆధారాలతో కలిసి ఉంటాయి. ఈ రెయిన్‌బో శీర్షికలో ముందే చెప్పినట్లు వ్యక్తులకు వారి తల్లిదండ్రులు చెరొక్కరి నుండి ఒక్కో డిఎన్ఎ సముదాయం (సెట్) వస్తుంది- ఒకటి అండం (గుడ్డు) నుండి, ఒకటి వీర్య కణం నుండి. తిరిగి మళ్లీ వారిలోని ఈ రెండు సముదాయాలు విభజనచెంది అండంలో గాని, వీర్యంలో గాని ఒక్కో సముదాయం పంపిణీ అవుతుంది. ఉదాహరణకు స్త్రీలో అండం విడుదలయ్యేటప్పుడు ఒక జత డిఎన్ఎ సముదాయంలో సగం ఆ అండానికి చేరుతుంది. ఇదే విధంగా పురుషుడిలో వీర్య కణాలు విడుదలయ్యేటప్పుడు ఒక జత డిఎన్ఎ సముదాయంలో సగం ఒక్కో వీర్య కణానికి వస్తుంది.

తల్లిదండ్రుల నుండి పిల్లలకు సంక్రమించే వంశపారంపర్య లక్షణాలు చాలా వాటికి 'డిఎన్ఎ'నే మూలం. ఈ డిఎన్ఎ 'క్రోమోజోములు' అని పిలవబడే పొడవైన తీగలలో ఉంటుంది. ఒక్కో క్రోమోజోములో చాలా జన్యువులు (జీన్స్) ఉంటాయి. మన శరీరంలోని లక్షణాలను ప్రభావితం చేసే ఒక్కో ప్రోటీను తయారవ్వడానికి ఒక్కో జన్యువు కారణమవుతుంది. సెక్స్‌ను ప్రభావితం చేయడానికి ఒక జత సెక్స్ క్రోమోజోములుంటాయి. ఈ జతలో ఒకటి తల్లి నుండి ఒకటి తండ్రి నుండి బిడ్డకు వస్తాయి. క్షీరదాలలో సాధారణంగా స్త్రీ క్రోమోజోముల అమరిక ఎక్స్‌ఎక్స్ గా, అంటే రెండు ఎక్స్ క్రోమోజోములతో ఉంటుంది. స్త్రీ నుండి విడుదలయ్యే అండాలన్నిట్లో ఒక ఎక్స్ క్రోమోజోము ఉంటుంది. దీనికి భిన్నంగా పురుష క్రోమోజోముల అమరిక ఎక్స్‌వై గా, అంటే ఒక ఎక్స్, ఒక వై క్రోమోజోముతో ఉంటుంది. మగజీవి వీర్యకణాలను విడుదల చేస్తే వాటిలో కొన్ని ఎక్స్ క్రోమోజోము గల వీర్యకణాలుగా, కొన్ని వై క్రోమోజోము గల వీర్యకణాలుగా ఉంటాయి. ఏదైనా ఒక వీర్యకణం (ఎక్స్ లేదా వై), ఒక అండం యొక్క యాదృచ్ఛిక కలయిక వల్ల శిశువు ఆవిర్భవిస్తుంది. అందువల్ల క్రోమోజోముల పరంగా శిశువులో లింగ నిర్ధారణ, వీర్యకణం ఎక్సా, వైయా అన్నదానిమీద ఆధారపడి ఉంటుంది.

అయితే కొన్నిసార్లు తల్లిదండ్రుల క్రోమోజోములు అండంలో గని, వీర్యంలో గాని పంపిణీ అవుతున్నప్పుడు ఒక అండానికి, ఒక వీర్యకణానికి ఒక్కో సెట్ క్రోమోజోములు రావాల్సింది పోయి, అండంలో గాని, వీర్యంలో గాని ఒక క్రోమోజోము అదనంగా వచ్చేస్తుంది. ఒక అండానికి, ఒక వీర్యకణానికి ఒక్కో సెట్ క్రోమోజోములు వస్తే శిశువు ఎక్స్‌ఎక్స్‌గా గాని, ఎక్స్‌వైగా గాని

వుంటుంది. అలా సమానంగా పంపిణీ కాకుండా, అండంలో గాని, వీర్యంలో గాని ఒక క్రోమోజోము అదనంగా వచ్చేస్తే శిశువు ఇంటర్‌సెక్స్‌గా ఉంటుంది. అంటే వీరిలో ఎక్స్‌ఎక్స్‌వై (దీనిని క్లైయిన్‌ఫెల్టర్ సిండ్రోమ్ అంటారు), లేదా ఎక్స్‌వైవై క్రోమోజోములు ఉంటాయన్నమాట.

ఒక్కోసారి ఒక అండం గాని, ఒక వీర్యం గాని ఒక క్రోమోజోమును కోల్పోయి ఉండే అవకాశం కూడా ఉంది. అప్పుడు శిశువుకు కేవలం ఒక ఎక్స్ లేదా ఒక వై క్రోమోజోము ఉంటుంది. ఎక్స్ క్రోమోజోములో జీవి మనుగడకు అవసరమైన కీలక జన్యువులుంటాయి కాబట్టి, ఒక ఎక్స్ క్రోమోజోము ఉండే శిశువు టర్నర్స్ సిండ్రోమ్ అనే వ్యాధి లక్షణాలతో జీవించగలదు. అయితే వై క్రోమోజోము మాత్రమే ఉండే శిశువు పూర్తిస్థాయి పిండంగా కూడా రూపొందదు. లింగాన్ని గుర్తించే విషయంలో ఎక్స్ లేదా వై క్రోమోజోముల పాత్ర ఏమిటి? మానవ శరీర సాధారణ అభివృద్ధి ప్రణాళిక స్త్రీ జననాంగాలు, యోని, యోని శీర్షం (ద్వారం), గర్భాశయం, అండాశయాలను ఏర్పరుస్తుంది. ఈ ప్రణాళికకు అంతరాయం కలిగించే ఏకైక అంశం- వై క్రోమోజోములోని ఒక జన్యువు క్రియాత్మకమై (చైతన్యవంతమై) వృషణాలను ఉత్పత్తి చేయడం. ఆ కణాలు టెస్టోస్టెరాన్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇదే శరీరంలోని డిఫాల్ట్ స్త్రీలింగ ప్రణాళికకు భిన్నంగా చాలా వరకు పురుష లక్షణాలను అభివృద్ధి చేస్తుంది.

అందువల్ల, ఏదైనా భిన్నమైన జన్యువును కలిగి ఉన్న 'ఎక్స్‌వై' పిల్లవాడు వృషణాలను ఉత్పత్తి చేయకపోవచ్చు. అప్పుడు అతను క్రోమోజోముల పరంగా పురుషుడు కావచ్చు కానీ అంగం రిత్యా పురుషుడు కాదు. కొందరిలో వృషణాలు ఏర్పడి ఉండవచ్చు కానీ పెద్ద మొత్తంలో టెస్టోస్టెరాన్ ఉత్పత్తి కాకపోవచ్చు. అప్పుడు వారు క్రోమోజోముల పరంగానూ అంగం రిత్యానూ మగవారుగా ఉంటారు కానీ హార్మోన్లపరంగా మగవారు కారు. టెస్టోస్టెరాన్ తగినంత మోతాదులో లేకుంటే వారు వృషణాలను కలిగి ఉంటారు కాని ఆడవాళ్ళుగా కనిపిస్తారు. పుట్టుకకు ముందు టెస్టోస్టెరాన్ ప్రభావంతోనే యోని ద్వారం పురుషాంగం అవుతుంది, లేబియల్ కణజాలం బీజకోశం ఏర్పరుస్తుంది. అలాగే యుక్తవయస్సులో, అబ్బాయిల ముఖంపై వెంట్రుకలు మొదలైనవి అభివృద్ధి అవుతాయి.

'ఎక్స్‌వై' పిల్లలు కొందరు టెస్టోస్టెరాన్‌ను కూడా ఉత్పత్తి చేయవచ్చు కానీ టెస్టోస్టెరాన్‌కు ప్రతిస్పందించే అణువులు శరీరంలోని కొన్ని భాగాల్లో ఉండకపోవచ్చు (పార్షియల్ ఆండ్రోజెన్ ఇన్‌సెన్సిటివిటీ), లేదా అన్ని భాగాల్లో ఉండకపోవచ్చు (కంప్లీట్ ఆండ్రోజెన్ ఇన్‌సెన్సిటివిటీ). ఇది పురుష లక్షణాల అభివృద్ధి పరిధిలో వైవిధ్యాలకు దారితీస్తుంది. కొందరు గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు టెస్టోస్టెరాన్‌కు ఒకలాగా స్పందించి, యుక్తవయసులో భిన్నంగా ప్రతిస్పందిస్తారు. అటువంటి వారి శరీరాలు పుట్టినప్పుడు వైద్యులకు "ఆడ"గా కనిపిస్తాయి, కానీ యుక్తవయస్సు తర్వాత ఆకస్మికంగా "మగ" వలె మారిపోతాయి. అదేవిధంగా కొందరు ఎక్స్‌ఎక్స్ పిల్లలు వివిధ కారణాల వల్ల టెస్టోస్టెరాన్‌ను అధికంగా ఉత్పత్తి చేస్తారు. నిజానికి టెస్టోస్టెరాన్ కూడా సాధారణ స్త్రీ హార్మోన్ ప్రొజెస్టెరాన్ నుండే తయారవుతుంది. వీరు వేరువేరు స్థాయిలలో జననాంగాలలో పురుష లక్షణాలు కనబరుస్తారు. పురుషాంగం లాంటి దానితో కూడా జన్మించవచ్చు. కాబట్టి ఇంటర్‌సెక్స్ పిల్లలు ఆడ-మగ శరీరాల సాధారణ వర్గీకరణ నుండి దూరం జరగడానికి చాలా మార్గాలున్నాయి. ప్రతి 2000 మంది పిల్లల్లో ఒకరు అస్పష్టమైన జననేంద్రియాలతో, ఇంటర్‌సెక్స్‌గా వర్గీకరించబడిన శరీరాలతో పుడతారని ఒక అంచనా. అంతే కాదు, మనం ముందు చెప్పుకున్నట్లుగా ఆడ లేదా మగ అని చాలా స్పష్టంగా కనిపించే జననేంద్రియాలు కలిగి ఉండి, వారి జన్యు అమరిక వల్ల వచ్చే ఇంటర్‌సెక్స్ వైవిధ్యాలు కూడా ఉంటాయి. అన్నే ఫౌస్టో-స్టెర్లింగ్ వంటి ప్రొఫెసర్లు ఇలా దాగి ఉన్న ఇంటర్‌సెక్స్ వైవిధ్యాలు జనాభాలో 2% కన్నా ఎక్కువ ఉంటాయని సూచిస్తున్నారు.

వీటన్నింటికీ ట్రాన్స్‌జెండర్‌కి సంబంధం ఏమిటి? మెదడులో టెస్టోస్టెరాన్ కోసం, స్త్రీ హార్మోన్ ఈస్ట్రోజెన్ కోసం గ్రాహకాలను (రిసెప్టార్లు) కలిగి ఉన్న కొన్ని ప్రాంతాలు ఉంటాయి. ట్రాన్స్‌జెండర్ స్త్రీ గుర్తింపుతో ముడిపడి ఉన్న కొన్ని జన్యువులతో, మెదడును ప్రభావితం చేసే ఈ హార్మోన్ల పనితీరుకు సంబంధం ఉండొచ్చు. కాబట్టి ఎవరికైనా ఆడ లేదా మగ అని వైద్యులు స్పష్టంగా నిర్ధారించగలిగే పిల్లలు పుట్టవచ్చు, కానీ వారి మెదడు భిన్నమైన లింగానికి చెందిన హార్మోన్ల మోతాదు ద్వారా ప్రభావితం కావచ్చు. తద్వారా వారు భిన్నమైన లైంగిక లక్షణాలను చూపించవచ్చు. ఎక్స్‌ఎక్స్ పిల్లలకు కీలక అభివృద్ధి దశల్లో మగ హార్మోన్ల ఉనికి వల్ల, వారి మెదడు ఎక్స్‌వై పిల్లల మాదిరిగా మగవారిగా తమను తాము గుర్తించుకునేలా పరిణామం చెందుతుంది. ఈ మగ హార్మోన్లు తల్లి గర్భం నుండి లేదా ఆ పిల్లల స్వంత కణాల నుండి రావచ్చు. అదే మాదిరి ఎక్స్‌వై పిల్లల్లో స్త్రీ హార్మోన్ల ఉనికి లేదా మగ హార్మోన్లకు శరీరం స్పందించకపోవడం వల్ల స్త్రీ అస్తిత్వం రావొచ్చు. వారి మొదడులో ఎక్స్‌ఎక్స్ మహిళల మెదడులోని లైంగిక కేంద్రాలతో సారూప్యత ఉంటుంది. మొదడులోని ఈ ప్రదేశాల గురించి, అవి ఎలా ట్రాన్స్‌జెండర్ పిల్లల్లో, పెద్దల్లో బలమైన భావాలకు కారణమవుతాయో, అలాగే మన సొంత శరీరాల గురించిన గ్రహింపు మనకు ఎలా కలుగుతుందో నేను తర్వాత వివరిస్తాను. ప్రస్తుతానికయితే, మనకు జీవసంబంధమైన లైంగికత మాత్రమే కాదు, వేరువేరు విధాల లైంగికత ఉంటుందని గుర్తించుకోండి.

మన క్రోమోజోమ్‌లు, వృషణాలు/అండాశయం ఏర్పడే క్రమం, పుట్టుకతో వచ్చే హార్మోన్‌లు, జననేంద్రియాలు మరియు యుక్తవయస్సులో వచ్చే హార్మోన్‌లు అన్నీ మన శరీరం, మెదడు అభివృద్ధి చెందే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. ఒకవేళ ఈ వ్యత్యాసాలు అస్పష్టమైన జననేంద్రియాలు ఏర్పడేలా చేస్తే లేదా అస్పష్టమైన ద్వితీయ లైంగిక లక్షణాలను (యుక్తవయసులో వచ్చే లైంగిక లక్షణాలు) కలుగజేస్తే, వాటిని వైద్యులు గుర్తించినట్లయితే, ఆ శిశువును/వ్యక్తిని ఇంటర్‌సెక్స్ అని పిలుస్తారు. కానీ మనలో చాలా మంది తెలీకుండానే సాంకేతికంగా ఇంటర్‌సెక్స్‌గా వుండవచ్చు.

(ఇంకా ఉంది)

విప్లవోద్యమ వ్యక్తిత్వమే సాకేత్

-. యామిని

అక్టోబర్ 14వ తారీఖు భారతదేశ విప్లవోద్యమానికి, విప్లవ శ్రేణులకు, విప్లవ కార్యకర్తలకు అత్యంత దుఃఖదాయకమైన రోజు. ఒక ఆత్మీయుడు, ఒక స్నేహశీలి, ఒక ఓదార్పు, ఒక ఊరట, ఒక నిరాడంబర, నిస్వార్ధజీవి, ఒడిదుడుకుల్లో ఆత్మవిశ్వాసం నింపే ఒక ఆపన్నహస్తం, మచ్చుకైనా కోపతాపాలు ప్రదర్శించని సహన సౌమ్యశీలి, ఒక అన్వేషి, ఒక ఆర్గనైజర్, ఒక సైద్ధాంతిక రాజకీయ వ్యూహకర్త, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రామకృష్ణగా చిరపరిచితుడైన ప్రియతమ నాయకుడు కామ్రేడ్ సాకేత్, రామకృష్ణ, శ్రీనివాస్ (యస్.వి.), గోపాలం మాష్టారు (అక్కిరాజు హరగోపాల్) గంభీరమైన కిడ్నీ జబ్బుతో 2021వ సంవత్సరం అక్టోబర్ 14వ తేదీన ఉదయం 6.30 నిమిషాలకు అమరత్వం చెందారు. వెలకట్టలేని ఆ మహోన్నతమూర్తి ఆచరణను మన కార్యాచరణగా ఆచరిద్దాం!

పదిహేనవ తేదీ ఉదయం 7.45 నిమిషాలకు రేడియోలో వచ్చిన పిడుగులాంటి ఈ వార్త మనసును కుదిపేసింది. ఈ వార్త నిజం కాకపోతే ఎంత బాగుండును?! అనిపించింది. నిజమే అని 'రూఢి' అయ్యేటప్పటికీ మనసంతా ఒకలాంటి ఒంటరితనం, వెలితి ఆవహించింది. విప్లవోద్యమంలో అమరత్వం సహజమైనప్పటికీ జీర్ణించుకోవటం కష్టంగా ఉంటుంది. అందునా పరిచయం ఉన్న కామ్రేడ్స్ అమరత్వం చెందితే మరీనూ. ఆ బాధను అక్షరాలు, పదాలుగా పేర్చటం కష్టమే అవుతుంది. అయితే ప్రజల కోసం, సమాజ మార్పు కోసం జీవితాన్ని త్యాగం చేయడమంటే హిమాలయ పర్వతం కన్న ఉన్నతమైనది. వారి జీవితం ప్రత్యేకించి ఆదర్శంగా ఉంటుంది. విప్లవోద్యమంలో అసువులు బాసిన ప్రతి విప్లవకారుల జీవితాల్లో కొన్ని సాధారణాంశాలు, కొన్ని ప్రత్యేకాంశాలు ఉంటాయి. అవి విప్లవోద్యమానికి, విప్లవకారులందరికీ ఆదర్శప్రాయం. విప్లవోద్యమాన్ని మరింత బోల్షివీకరించేందుకు ఎంతగానో తోడ్పడతాయి. అలా మన ప్రియతమ నాయకులు కామ్రేడ్ ఆర్.కె. విప్లవ జీవితం కూడా ఎంతో ఆదర్శప్రాయమైనది. అజరామరమైన ఆ అమరమూర్తి గురించి కొన్ని వాక్యాలు..

కామ్రేడ్ ఆర్.కె. గుంటూరు జిల్లాలోని చారిత్రాత్మకమైన పల్నాడు ప్రాంతంలోని పిడుగురాళ్ళ మండలం గుత్తికొండ గ్రామంలో జన్మించారు. తండ్రి రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామంలో హెడ్మాష్టారుగా పనిచేస్తూ అక్కడే స్థిరపడ్డారు. ఒక స్కూలు మాష్టారిగా ప్రారంభించిన ఆర్.కె. విప్లవ అడుగులు అంచెలంచెలుగా ఎదిగి భారత విప్లవోద్యమానికి నాయకత్వం వహించే శీర్షనేతల్లో ఒకరిగా అగ్రస్థానం సంపాదించారు. కేడర్లు, ప్రజలను అక్కున చేర్చుకొని వారి సమస్యలకు, బాధలకు ఊరట ఓదార్పు అందించిన కామ్రేడ్ యస్.వి. అమరుడవ్వటం తెలుగు కామ్రేడ్సందరికీ

తట్టుకోలేని బాధ. విప్లవోద్యమానికి పూడ్చలేని నష్టం.

మొట్టమొదట కామ్రేడ్ యస్.వి. పరిచయం నేను దళంలోకి వచ్చిన కొత్తలో. అది గుంటూరు జిల్లా ప్లీనం సందర్భంగా. ప్లీనం తయారీ పనుల్లో అందరూ తలమునకలై ఉండగా 'ఎవరో పెద్దాయన వస్తాడం'టని మా సీనియర్ కామ్రేడ్ చెప్పగా తెలిసింది. కొద్దిరోజులకు ఆ పెద్దాయన రావటం, ప్లీనం మొదలవటం జరిగింది. ఆ సమయంలో ప్రతిరోజూ ఒక సంఘటన నన్ను దూరంనుంచే అమితంగా ఆకర్షించింది. ఆ పెద్దాయన క్షణం తీరిక దొరకగానే తనకు ప్రొటెక్షన్‌గా వచ్చిన మహిళా కామ్రేడ్‌కు స్కూలు చెప్పేవాడు. అది కూడా- చాలా నిదానంగా, ఒత్తులు, పొల్లులు ఎలా పలకాలని తను ఉచ్చరిస్తూ చెప్పేవాడు. ఇది గమనించిన నాకు 'అబ్బా! ఇలా కూడా ఉంటారా?' అని నాలో నేను ముచ్చటపడ్డాను. వాళ్లూ వీళ్లూ పిలుస్తుండగా తెలిసింది ఆ పెద్దాయన పేరు శ్రీనివాస్ అని. యస్.వి. అని పిలుస్తారని. తర్వాత్తర్వాత ఆ పెద్దాయనతో పరిచయం ఏర్పడింది. నా పేరుతో కాకుండా అప్పుడప్పుడు 'అమ్మాయ్' అని పిలిచేవాడు. 'అమ్మాయ్' అనే పిలుపుతో నా ఒళ్ళంతా పులకరించిపోయేది. ఒక్కసారిగా అమ్మా, నాన్న, అన్నాయ్ పిలిచినట్లనిపించేది. అందుకే 'అమ్మాయ్' అని పిలిచిన ప్రతిసారి రెక్కలు కట్టుకొని యస్.వి. ముందు వాలేది. అలా యస్.వి. అంటే మనసులో ఒకలాంటి అభిమానం, గౌరవం ఏర్పడింది. (అమ్మాయ్ అని అమరుడు యమ్.ఆర్. గారు, యస్.వి.గారే పిలిచేది.)

కేడర్లు, ప్రజలను అమితంగా ప్రేమించే కామ్రేడ్ యస్.వి.

వారి కష్టసుఖాల్లో పాలు పంచుకొనేవాడు. ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి, దానికి సరైన పరిష్కారం చూపేవాడు. అందుకే కామ్రేడ్ యస్.వి. అంటే అందరికీ గౌరవం, అభిమానం కూడా. ప్రజలతో ఎంతైతే మమేకమవ్వాలో అంత మమేకమయ్యాడు, కాబట్టే ఎన్ని సంవత్సరాలు గడిచినా ప్రజలు మరచిపోలేదు. వారి మనోఫలకంపై జీవించే ఉన్నాడు.

గుంటూరు జిల్లాలో దాచేపల్లి ఏరియా చిన్న చిన్న తుప్పలు మాత్రమే ఉన్న మైదాన ప్రాంతం. ఒకవైపు కృష్ణా నది, నది అంచెమ్మటి సిమెంటు ఫ్యాక్టరీలు, ఊర్ల అంచున ముగ్గు మిల్లులు, పిడుగురాళ్ళ సున్నపుబట్టీలు, నాపరాయి క్వారీలు ఉండేవి. క్వారీలు, చిన్న చిన్న పరిగకంప పొదల్లో దళం మకాం ఉండేది. అవి కూడా లేనిచోట పత్తి, మిర్చి, కంది చేలల్లోనే మకాం వేసేది. రోడ్డు, రైల్వేలైను, కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీస్టేషన్లు కూతవేటు దూరంలోనే ఉన్నప్పటికీ ప్రజలు వాళ్లను కంటికి రెప్పలా కాపాడుకునేవారు. ఆ ప్రజలకు ఉద్యమం పట్ల అంతటి విశ్వాసం కలిగించింది కామ్రేడ్ యస్.వి. రామాపురం, గామాలపాడు, పొందుగల, శ్రీనగర్, భట్రుపాలెం, పిన్నెల్లి, మాదినపాడు, తుమ్మలచెరువు గ్రామాలలో 'గోపాలం పంతులు' గా తిరుగుతూ అణగారిన బతుకులకు అండగా నిలబడి వర్గపోరాటాన్ని అడ్వాన్స్ చేయించాడు. పీడిత ప్రజలకు, అందునా దళిత ప్రజలకు అండగా నిలబడి వారిని ఒక తాటిపై నిలబెట్టాడు. అందుకే ఎన్ని సంవత్సరాలైన 'గోపాలం పంతులు గారి'ని ప్రజలు మరచిపోలేదు. ఏ ఇంటి గడప తొక్కినా, ఏ అన్నను, అక్కను కదిలించినా 'గోపాలం పంతులు గారి' ఊసే లేకుండా ఉండేది కాదు.

'మా బతుకులిలా ఉండేవా? ముందు ఎంత పెత్తనం, రెడ్ల ఇళ్ళ ముందు నుంచి పోటానికుందా? ఇప్పుడు గానీ పోతున్నాం. ఇదంతా గోపాలం మాష్టారు వచ్చినప్పటి నుంచే'... ఒక సందర్భంలో గుర్తు చేశాడు దానియేలు.

'నిజం! విప్లవోద్యమం చేసిన కృషి లేకుంట పెద్ద కులపోళ్ళకు ఎదురుపడటం ఉందా? మంచం మీద కూర్చున్నవాళ్ళు కూడా లేవాల్సిందే! మావైపు విప్లవోద్యమం ఉందని కిమ్మనకుండా ఉంటున్నారు. లేదంటే వాళ్ళు పాడిందే పాట–ఆడిందే ఆట. అప్పటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు చెప్పేవాళ్ళు ఏసోబన్న, మరియమ్మలు.

0 0 0

ఒక చల్లని సాయంకాలం. అప్పుడే చీకటి పడుతోంది. చలిగాలికి చీర గట్టిగా కట్టి వడివడిగా అడుగులు వేస్తూ ఊరి అంచుకు వచ్చేశాను. 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకొని మిరప చేలోంచి సన్నని కాలిబాట గుండా ఊళ్ళోకి దారి తీశాను. దొడ్డి దారిన ఇంట్లోకి ప్రవేశించాను. నా పని వీలయినంత తొందరగా అన్నం వండించుకొని తిరుగుముఖం పట్టాలి. ఎందుకంటే పక్కనే స్టేషన్, ఇంటిముందు బైపాస్ రోడ్డు. ఆ ఊరు బాగా పేరున్న గామాలపాడు. ఆ కుటుంబం బాగా పరిచయమున్న కుటుంబం. ఉద్యమాన్ని, అందునా యస్.వి.ని అమితంగా అభిమానించే జంట అది. నేనొచ్చిన పని ఇట్టే అర్థమైన ఇంటక్క వంట పనిలో నిమగ్నమైంది. అక్కకు సాయం చేస్తూ మాటలు కలిపాను. మాటల మధ్యలో ఇంటక్క 'గోపాలం పంతులుగారున్నారా? ఎట్టా ఉన్నారు? చాన్నాళ్ళయ్యింది చూసి. మా పెళ్ళి చేసింది గోపాలం పంతులుగారే. చిన్నప్పుడు పంతులు గారితో తిరిగేది. ఈయనైతే అస్సలు వదిలేవాడు కాదు. ఎప్పుడొచ్చినా పల్లెకే వచ్చేవాడు. ఎన్నిరోజులైనా మా ఇంట్లోనే ఉండేవాడు. అందర్నీ పోగేసి బడి చెప్పేవాడు. మందు బిళ్ళలు కూడా ఇచ్చేవాడు' అని 'పంతులు గారి' గురించి అక్క ఇంకా ఇంకా చెప్పుకుపోతూనే ఉంది. నిజంగా యస్.వి.పై ఆ జంట పెంచుకున్న ప్రేమకు చలించిపోయాను.

భట్రుపాలెం తండాలో కూడా 'మా పంతులు గారెలా ఉన్నార'ని కలిసిన ప్రతిసారి సోమ్లా నాయక్ బాగా గుర్తు చేసేవాడు.

ఒక ముఖ్యమైన పని మీద జిల్లాకు వచ్చినప్పుడు జనం మిమ్మల్ని గుర్తు చేస్తున్నారు అని యస్.వి. దృష్టికి తెచ్చినప్పుడు చిరు మందహాసంతో 'అట్టానా?' అని అప్పటి కష్టాలు, కడగండ్లు ప్రజల్లో విప్లవోద్యమాన్ని సొంతం చేయటానికి చేసిన పోరాటాలు, అప్పటి గ్రామాలు, పరిచయస్తులు, నాయకులు అప్పటి పట్టణోద్యమ పరిస్థితి (గుంటూరు, విజయవాడ)ని అంతా పూసగుచ్చినట్టు చెప్పాడు. విజయవాడ టౌన్‌లో సానుభూతిపరుల పేర్లు, ఇళ్ళను కూడా గుర్తుకు తెచ్చుకుంటూ ఇప్పుడు ఎలా ఉన్నారో? అని కలత చెందారు. ప్రజలతో, కేడర్లతో నిరంతరం ఆత్మీయ సంబంధాన్ని కలిగి ఉంటూ, దూరంగా ఉన్నప్పుడు వారి యోగక్షేమాలను లెటర్స్ ద్వారా ఆరా తీసేవాడు. అందుకే యస్.వి. అంటే అందరికీ చాలా అభిమానం. తను సి.వో.గా తిరిగినప్పటి పరిచయస్తులు, సానుభూతిపరులను జిల్లాకు వచ్చినప్పుడు పిలిపించుకొని మాట్లాడేవాడు.

ఉద్యమ లైను పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలనేవాడు. ఎన్ని సమస్యలొచ్చినా లైనును, పాలసీలను ఒంటబట్టించుకోవాలి. వాటికి కట్టుబడి ఉండాలి, ప్రజలకు అవి నేర్పాలి. అప్పుడే మన మీద మనకు, ఉద్యమంపై నమ్మకం ఏర్పడుతుంది అనేవాడు.

విప్లవోద్యమంలో వచ్చిన అంతర్గత సంక్షోభాలను యస్.వి. చాలా చాకచక్యంతో పరిష్కరించి అందరి విశ్వాసాన్ని చూరగొన్నాడు. రెండు వేల సంవత్సరంలో గుంటూరు జిల్లా పార్టీ కమిటీలో అంతర్గత ఘర్షణలు వచ్చి పార్టీ రెండు గ్రూపులుగా అయిపోయింది. కాన్ఫరెన్స్ నిర్వహించినా సమస్య తెగని కారణంగా యస్.వి.నే వచ్చి ప్లీనం నిర్వహించాడు. ఎవరి తప్పులు ఎంతున్నదో సీరియస్‌గా వారి దృష్టికి తీసుకుపోయాడు. మైనారిటీ గ్రూపులో అరాచకంగా ఉన్న వారికి విప్లవోద్యమంలో స్థానం లేదని ఖరాఖండిగా చెప్పాడు. దాని తర్వాత మైనారిటీ గ్రూపులో ఉన్న ముఖ్యమైన వారు శత్రు పంచన చేరటం కూడా జరిగింది.

2003 సంవత్సరంలో వచ్చిన మరో సమస్యను కూడా అప్పటికప్పుడు ప్లీనం నిర్వహించి జిల్లా క్యాడర్‌కు ఒక అవగాహన కల్పించాడు. అందరి మన్ననలను పొందాడు. అగ్రవర్ణంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ యస్.వి. చాలా సౌమ్యంగా, స్నేహంగా, నిర్మలంగా వ్యవహరించేవాడు. ఏ విషయమైనా నిశితమైన పరిశీలనతో విశ్లేషించేవాడు. పురోగామి శక్తి భావజాలాన్ని నిరంతరం వెన్నంటి పెట్టుకున్న కామ్రేడ్ యస్.వి. మనందరికీ ఆదర్శప్రాయుడు.

మహిళా ఉద్యమమన్నా, మహిళా కామ్రేడ్స్ అన్నా ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముందుకు నడిపించేవాడు యస్.వి. తన పనులరీత్యా ఎంత బిజీగా ఉన్నప్పటికీ దొరికిన అతి కొద్ది సమయాన్ని మహిళా కామ్రేడ్స్‌కు కేటాయించేవాడు. వారి ఎదుగుదల, ఆరోగ్యం, కుటుంబ

విషయాలను చాలా ఓపికగా మాట్లాడేవాడు. తనున్నంతసేపు, మాట్లాడుతున్నంత సేపు 'మనకంటూ వట్టించుకునేవారు ఒకరున్నార'నే ఆత్మవిశ్వాసం, ఓదార్పు, ఊరట కలిగించేవాడు. అలా ఎపి నుంచి రిలీవ్ అయిన (2005) మీటింగు సందర్భంలో తక్కువ సమయంలోనే కా. రమణ డి.సి.యమ్ (శేషాచలం ఎన్‌కౌంటర్‌లో అమరురాలైంది)తో, కా. శాంతితో నాతో 'చర్చలు విఫలమై శత్రు నిర్బంధం పెరిగింది' కనుక చాలా జాగ్రత్తలు తీసుకొని పని చేయాలని ధైర్యం చెప్పి అందరికీ చేతులు కలిపి విడిపోయాడు.

తనకంటూ ఏదీ ఆలోచించని నిస్వార్థజీవి కామ్రేడ్ యస్.వి. ఎపి నుంచి రిట్రీట్ అయ్యి దండకారణ్యం వచ్చిన ఏడు సంవత్సరాలకు ఒక ఉదయాన యస్.వి.ని కలవటమైంది. మనిషి ఎంతలా ఉన్నాడంటే అసలు తనేనా?! కాదా! అన్నంత ఎముకల గూడులా అయిపోయాడు. మాట్లాడుతానని కబురు పంపిస్తే తన మకాంకు వెళ్ళాను. రాళ్ళు, రప్పలు, రక్తం పీల్చే దోమలు చూడగానే అర్రె! అనిపించింది. 'ఏంటి యస్.వి. దోమతెర కట్టుకోలేదా?' అని అడిగాను. 'సాయంత్రం కడతార'ని చెప్పాడు. మాట్లాడుతూనే తీరిక లేకుండా కుడుతున్న దోమల దెబ్బకు తన కిట్టులో నుండి టవల్ తీసి 'బాగా కుడుతున్నాయ్ కాళ్ళకు కప్పుకో' అని నాచేతికిచ్చాడు. 'టవల్ కదా!' అన్నప్పుడు 'ఏం కాదులే!' అన్నాడు. ఎంత ఔన్నత్యం, ఎంత ఉదాత్తమూర్తి. యస్.వి. ఈ సంఘటన ఎప్పటికీ మరపురాని గుర్తుగా మిగిలిపోయింది. తన పేరు స్ఫురణకు వచ్చినప్పుడు ఆనాటి సంఘటన కళ్ళముందు లీనమవుతుంది.

ఆ సమయంలోనే కుటుంబ విషయాలు చెప్పి నా చేత ఇంటికి లెటర్ రాయించాడు. ఎన్నో మైళ్ళ దూరంలో ఉన్న నాకు కుటుంబ సమాచారం తెలియటం గానీ, నా సమాచారం కుటుంబానికి తెలియటం గానీ అసాధ్యమనుకున్న నాకు యస్.వి. ఇచ్చిన సలహాతో నేను ఇంటికి లెటర్ రాయటం, తక్కువ సమయంలోనే అమ్మ నుంచి రిప్లై రావటం చాలా సంతోషమేసింది.

మరల ఐదు సంవత్సరాలకు ఉద్యమానికి ప్రపోజల్ పెట్టుకుని కలిశాము. కలిసిన రోజు దూరం నుంచి యస్.వి.ని చూసిన నాకు తట్టుకోలేక కళ్ళ వెంబడి నీళ్ళు కారాయి. చేతులు కలుపుతూనే 'ఏడ్వద్దు ధైర్యంగా ఉండాలి' అని సముదాయించాడు. మాకిచ్చిన రెండు రోజులు కూడా పూర్తి కాకుండానే విడిపోవాల్సి వచ్చింది. కానీ కలిసున్న ఆ కొద్దిపాటి సమయంలోనే చాలా విషయాలు మా ముందుకొచ్చాయి. ఎపి, తెలంగాణా, ఎఓబిల ఉద్యమ పరిస్థితి - శత్రు ఎత్తుగడలు, సీరియస్ నిర్బంధంలో కూడా మనవాళ్ళు చేస్తున్న కృషి చెప్తుంటే.. ఒక్కసారిగా ఎపికి పోయినట్టనిపించింది. విడిపోతున్నప్పుడు ఇంకొద్ది సేపు తనతో గడపాలని మనసు ఆరాటపడింది.

ఎపిలో ఉన్న సీరియస్ నిర్బంధం వలన నీటి తావుల దగ్గర మకాం వేయలేని పరిస్థితి. ప్రతిరోజూ నీళ్ళు మోసుకోవాల్సిందే. అందరం లైన్లో నిలబడగానే యస్.వి. కూడా తంచనుగా వచ్చి లైన్లో నిలబడేవాడు. 'మేం ఉన్నాం గదా!' అన్నప్పుడు 'కొద్ది సేపేగా!' అని రెండు చేతుల్లో రెండు పది-పది లీటర్ల క్యాన్లు మోసేవాడు.

శత్రు దాడులు ఊపిరాడకుండా ఉన్న సమయంలో దక్షిణ తెలంగాణా రీజినల్ సెక్రటరీగా, ఎపి రాష్ట్ర కమిటీ సెక్రటరీగా, ఎఓబి స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా నిస్వార్థమైన తన సేవలను ప్రజలకు అందించాడు. శత్రు దాడులు, అనారోగ్యం, శరీరం సహకరించకున్నా సరే నడకలో వెనుకపడ్డ కామ్రేడ్స్‌కు అన్ని విధాలా సహాయపడుతూ ఉత్సాహపరిచేవాడు.

కామ్రేడ్ యస్.వి.కి రామకృష్ణ అనే పేరు బాగా ప్రాచుర్యం పొందింది. 1992వ సంవత్సరంలో వెల్దుర్తి ఏరియాలో కృష్ణానది ఒడ్డున ఉన్న చంద్రవంక దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన కమాండర్ పేరే రామకృష్ణ. ఈ ఎన్‌కౌంటర్‌లో రామకృష్ణతో పాటు జిల్లా కమిటీ సభ్యుడు ఏసన్న, మాధవీలత, నలుగురు జాలర్లు అమరులయ్యారు. ఎన్‌కౌంటర్ జరిగి సంవత్సరాలు గడిచినా గానీ అప్పటికప్పుడు జరిగిన సంఘటనగా ఇప్పటికీ ప్రజలు చెపుతుంటారు. అందుకే చంద్రవంక పేరు వినగానే ఆ సంఘటనలో లేనప్పటికీ ఘటన తాలూకు భావ సన్నివేశం మనసులో ఏర్పడుతుంది.

1999వ సంవత్సరంలో కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను హత్య చేసిన శత్రువు రకరకాల ప్రచారాల ఊపందుకున్నాడు. ఈ ప్రచారాల మధ్యనే శత్రు దిమ్మ తిరిగి పోయేంతగా ప్రజా గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేయటంలో ముఖ్య భూమిక పోషించాడు. కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు కారణమైన అప్పటి హోం మంత్రి మాధవరెడ్డిపై చర్య తీసుకొని విప్లవోద్యమానికి కొత్త ఊపిరులందించాడు.

కారంచేడులో దళితుల నరసంహారానికి కారకుడైన దగ్గుబాటి చెంచురామయ్యపై, వేంపెంట దళితుల మారణహోమానికి కారకుడు భూస్వామి బుడ్డా వెంగళరెడ్డిపై, రామాపురం అచ్చిరెడ్డి, అంకిరెడ్డిలపై, ఉమేశ్చంద్ర లాంటి వారిపై చర్యలు తీసుకోవడంలో ముందున్నాడు.

2016 అక్టోబర్ నెలలో ఎఓబిలో జరిగిన రామగూడ ఎన్‌కౌంటర్ అప్పటి భారతదేశ విప్లవోద్యమ చరిత్రలోనే పెద్ద ఘటన. ఎంతో విప్లవోద్యమ అనుభవం ఉన్న కామ్రేడ్సును కోల్పోయిన ఈ ఘటనలో యస్.వి. కొడుకు మున్నా కూడా అమరుడయ్యాడు. కంటి ముందే కన్న కొడుకు జీవచ్ఛవంలా పడి ఉన్నా బాధను పంటి బిగువున అదిమి పట్టుకుని కర్తవ్య దీక్షలో లీనమైనాడు. ఈ ఘటన అనంతరం కొద్దిమంది కుహనా మేధావులు 'పీఎల్‌జీయే అంటే చావు సైన్యమని' ప్రచారం చేశారు. 'త్యాగాలు లేకుండా చరిత్ర పురోగమనం ఉండదు. తమ స్వార్థ ప్రయోజనాలకు, డబ్బు సంచులకు అమ్ముడుపోయే మేధావులు ఈ విషయం అర్థం చేసుకోరు. మాది అజేయమైన సైన్యం. మా సుదీర్ఘ ప్రయాణంలో, లక్ష్య సాధనలో ఈ నష్టం, చిన్న అవరోధం అనివార్యమే. ప్రజలే చరిత్ర నిర్మాతలు' అని సూటిగా, ధీటైన జవాబు చెప్పాడు.

యస్.వి. రచనా వ్యాసంగం కూడా చాలా సింపుల్‌గా అందరికీ అర్థమయ్యే విధంగా ఉంటుంది. అలాగే కామ్రేడ్స్‌కు కూడా రాతల్లో సలహాలు, సూచనలు అందించేవాడు. అలా నేను కలిసిన ఒక సందర్భంలో నేను రాసిన ఒక లెటర్‌ను చూపించాను. ఆ లెటర్‌లో ఒకచోట 'మార్క్సిజం కార్మికవర్గానికి దిశా నిర్దేశం చూపిస్తుంది అని రాశాను. దాన్ని ఒకటికి రెండుసార్లు చదివిన యస్.వి.'కార్మికవర్గం' అన్నచోట 'పురోగామి శక్తి' పెట్టమని, పురోగామి శక్తి అంటే చాలా విస్తృత అర్థముంటుందని సలహా ఇచ్చాడు.

వి.ఎల్‌జీఎ ఇరవయ్యవ వార్షికోత్సవం సందర్భంగా విడుదలైన సావనీర్ పుస్తకంలో యస్.వి. వ్యాసం హెడ్డింగ్ చూసి అందరూ వెరైటీగా హెడ్డింగులు పెడితే ఈయనేంటి, ఇంత సింపుల్‌గా పెట్టాడని నా చిట్టి బుర్రకు తట్టింది. ఆ వెంటనే గతంలో తనిచ్చిన విశ్లేషణ గుర్తుకొచ్చింది.

కా.యస్.వి.కి కొరియర్‌గా పనిచేసిన గుంటూరు ఆర్.కె. మాటల్లో.. 'మూడు నెలలకొకసారి రూమ్‌కి వచ్చేవాడు. ఒక్కోసారి నాలుగు, ఐదు నెలలకు. ఒకసారి కలిశాడంటే మళ్ళీ ఎప్పుడు కలుస్తాడోనన్న ఆత్రుతతో ఎదురుచూసే వాడిని. కలిసిన ప్రతిసారి రోజువారి పనులను, రాజకీయ, సిద్ధాంత అధ్యయనానికి నిర్దిష్టంగా ప్లాను చేసేవాడు. విడిపోయేటప్పుడు కూడా అంతే. అలా కామ్రేడ్స్ ఉత్సుకతను పెంచేవాడు. పనులు పురమాయించటమే కాకుండా పనిలో నైపుణ్యం, రాజకీయ స్ఫూర్తి కలిగించే విధంగా డీల్ చేసేవాడు. కష్టకాలాల్లో (అరెస్టులు, అమరత్వాలు) గుండె నిబ్బరం పెంచే విధంగా ఓదార్పు ఇచ్చేవాడు. తప్పులను నిశితంగా విమర్శిస్తూనే దాన్నుండి బయటపడే విధంగా సహాయ సహకారాలు అందించేవాడు. ఒక్కోసారి కొందరికి నాయకత్వం దగ్గర మాట్లాడాలంటే ఒకలాంటి బెరుకు అనిపిస్తుంది. కానీ యస్.వి. దగ్గర అలాంటివేవి లేని ఒక ప్రజాస్వామికమైన రాజకీయ వాతావరణం, ఏ విషయమైనా ఫ్రీగా చెప్పుకునే స్వేచ్ఛ ఉండేది. అది ప్రజలకైనా, కేడర్లకైనా. అందుకే తను కలుస్తాడంటేనే కొండంత ధైర్యమొచ్చేది. తనతో ఏవేవో పంచుకోవాలనే ఆత్రుత వెంపర్లాడేది'.

నిజం! అక్షరాలా ఇది నిజం! ఉన్నతమైన కమ్యూనిస్టు విలువలు, ఆదర్శాలు పుణికిపుచ్చుకున్న కా. యస్.వి. జీవితాచరణ నుంచి మనం నేర్చుకోవాల్సిన, ఆచరించాల్సిన ఎన్నో విషయాలున్నాయి. అందుకే కామ్రేడ్ యస్.వి. అంటేనే తరగని విప్లవాల గని.

వీలయినంత మేరకు అందుబాటులో ఉన్న ఎపి కామ్రేడ్స్‌ను కలవటం, దూరంగా ఉన్న వారికి లెటర్స్ ద్వారా యోగక్షేమాలు, ఉత్సుకతను నింపే ఎపి రిపోర్టులతో కూడిన లెటర్స్ రాసేవాడు. అలా నాకు రాసిన లెటర్‌లోని కొన్ని వాక్యాలు..

'ప్రతి సమావేశంలోనూ మెదడు భావాల సంఘర్షణను ఎన్నో రెట్లు పెంపొందించుకొని ఎంతో కొంత అదనపు జ్ఞానాన్ని సముపార్జించుకుంటుంది'.

'నీ ఉత్తరం చూడగానే కాసేపు పాత దినాల్లోకి వెళ్ళిపోతాను. నీ అల్లరి మాటలు, అమరుడు యమ్.ఆర్. గారి పెద్దరికపు మాటలు గుర్తుకు వచ్చి నవ్వుకుంటాను. మళ్ళా నేటి బాధ్యత గల నాయకత్వ కామ్రేడ్‌గా హుందాగా కనిపిస్తావు'.

'ఎప్పుడూ రెండు భావాల మధ్య సంఘర్షణ జరగాలి. అప్పుడే నూతనమైన భావాలు ఉద్భవిస్తాయి. అవే మన ఆలోచనా పరిధిని పెంచటానికి దోహదం చేస్తాయి'.

ఎపి నుంచి చాలా దూరంగా పని చేస్తున్న కామ్రేడ్స్ కుటుంబాల క్షేమ సమాచారాన్ని తీసుకుంటూ కామ్రేడ్స్‌కు పంపటం; అలాగే కామ్రేడ్స్ చేత లెటర్స్ రాయించేవాడు. 'ఇప్పుడున్న పరిస్థితుల్లో కుటుంబాలను కలవలేము, కనీసం ఉన్నామా?! లేమా? అని ఇంటివారికి తెలియాలి కదా! మనమీదే ఆశలు పెట్టుకున్న వారికి కనీసమైన ఊరట కలిగించే కబురుండాలి కదా!' చివరిసారి కలిసినప్పుడు అన్న మాటలు.

నిజం. ఏ సమయంలో ఏం జరుగుతోందో తెలీని పరిస్థితుల్లో పిల్లల మీదున్న మమకారం తల్లిదండ్రులను నిరంతరం ఆందోళనకు గురి చేస్తుంది. ఈ సమయంలో ఆయన సహచరి ఎలా ఉందో? ఒకవైపు కా. మున్నా అమరత్వం, మరోవైపు కా. యస్.వి. అమరత్వం. రెండింటినీ ఆమె ఎలా సంభాళించుకుంటుందో? మానసికమైన ఒంటరితనంతో ఎంత తల్లడిల్లిపోతుందోననిపిస్తుంది.

కామ్రేడ్ సాకేత్ అమరత్వం అందరికీ విషాదమే. ఒక కామ్రేడ్ అన్నట్లు 'ఎన్ని గొంతులు పెగలకుండా పూడుకొనిపోయాయో, ఎన్ని మనో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయో ఊహించడం కష్టమే'. కామ్రేడ్ సాకేత్ అమరత్వం నుండి తేరుకోకముందే మరొక పిడుగులాంటి వార్త. మరో భారీ నష్టం. ఉత్తర గడ్‌చిరోలి జిల్లాలో నవంబరు పదమూడవ తేదీన మహారాష్ట్ర సి-60 కమాండోలు వెంటాడి, వేటాడి హత్య చేసిన ఘటనలో మన ప్రియతమ కామ్రేడ్స్, ప్రజల ముద్దు బిడ్డలు ఇరవై ఏడు మంది కామ్రేడ్స్ అమరులవ్వటం - వారిలో కేంద్రకమిటీ సభ్యుడు కా. దీపక్‌దా అమరత్వం. ఇది వెంటనే కోలుకోలేని దెబ్బ.

కా. దీపక్ దాదాని చూసింది, మాట్లాడింది రెండేసార్లు. కానీ ఎంతో పరిచయం ఉన్న కామ్రేడ్‌లా ముద్ర వేశాడు. ఒకరకంగా తన మాటల్లోనే అక్కున చేర్చుకొనే స్వభావం కలవాడు. అందుకే తొలిసారి పరిచయమైనప్పుడే ఆయనంటేనే ఒక ప్రత్యేకత ఏర్పడింది. 'జ్వాలాగ్రహి' అనే తన కలం పేరుతో వెలువడే సాహిత్యం విప్లవ శక్తులు అభిమానించేవిగా, విప్లవ ప్రతిఘాతక శక్తులకు వాడిగా, వేడిగా, పదునుగా గుచ్చుకొనేవిగా ఉండేవి. ఎంతో రాజకీయ పరిణితి ఉన్న కా. సాకేత్, కా. దీపక్ దాదా ఈ మధ్యకాలంలో సీనియర్ నాయకులు కా. అంబర్ దా, కా. హరిభూషణ్ దాదాల అమరత్వం నేడున్న విప్లవోద్యమ పరిస్థితిలో వెంటనే కోలుకోలేనటువంటిది. ఒక పక్క వెంటాడే శత్రువు, మరో పక్క సీరియస్ అనారోగ్యాలు. సకాలంలో సరైన వైద్యసౌకర్యాలు అందకుండా చేస్తూ, తిండి పదార్థాల్లో విష ప్రయోగాలు చేస్తూ నాయకత్వాన్ని పాశవికంగా హత్య చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు. శత్రువు అమలు చేస్తున్న పాశవిక నిర్బంధాన్ని, ప్రతిఘాతుక విప్లవ ఎత్తుగడలను తిప్పికొడదాం! ఓడిద్దాం! అమరులు నెలకొల్పిన ఆదర్శాలను, ఆశయాలను చివరికంటా కొనసాగిద్దాం! వారి జీవితాచరణను మన కార్యాచరణగా ఆచరిద్దాం! అదే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి.

నిర్మలమైన నీ మనసు
సౌమ్యమైన నీ పలకరింపు
ఒడిదుడుకుల్లో నింపే ఆత్మవిశ్వాసం
బాధలను అక్కున చేర్చుకునే ఆపన్నహస్తం
'గోపాలం పంతులు'గా ప్రజల్లో
నీవేసిన ముద్ర ఎప్పటికీ మా కాదర్శం.

(తమకంటూ ఏదీ ఆలోచించకుండా ఉన్నతమైన ఆదర్శాలతో జీవించిన కా. యస్.వి. మరియు కా. దీపక్‌దా ల జ్ఞాపకాలతో..)

వర్గపోరాట ఆచరణలో సంస్కృతి నిర్మాణం

ప్రగతి



సంస్కృతిలోని సిద్ధాంత విషయాలు ఆచరణలో ఎలా ఉంటాయో కా. ప్రగతి ఈ వ్యాసంలో వివరించారు. వర్గపోరాట క్రమం అనేక సామాజిక సాంస్కృతిక నాగరికతా సమస్యలను వెలికి తీస్తుంది. విప్లవకారులు ఆ పని ఎంత సృజనాత్మకంగా, సాహసికంగా చేయవలసివస్తున్నదో ఇందులో రాశారు. దోపిడీ రద్దు కోసం పోరాడినట్లే ప్రాచీన, ఆధిపత్య, అహేతుక, ప్రగతి వ్యతిరేక సాంస్కృతిక బంధనాల నుంచి విముక్తి కోసం పోరాడటం విప్లవోద్యమంలో అంతర్భాగమని ప్రగతి వివరించారు. ప్రజల వాస్తవ జీవితం నుంచే కొత్త సంస్కృతి వికసిస్తుందని చెప్పే క్రమంలో విప్లవోద్యమం ముందున్న సాంస్కృతిక సమస్యలను కూడా చాలా ఓపెన్ మైండ్‌తో చర్చనీయాంశం చేశారు. ఒక సుదీర్ఘ పరివర్తనను సాంఘిక సాంస్కృతిక పోరాట క్రమంలో సాధించగలమనే సైద్ధాంతిక స్పష్టతే లేకుంటే విప్లవోద్యమ ప్రాంతాలు నూతన సాంస్కృతిక స్థావరాలుగా కూడా ఎదిగేవి·కావని ఈ వ్యాసం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

– వర్కింగ్ ఎడిటర్

మన దేశంలోని ప్రజాస్వామిక విప్లవానికి దాదాపు 160 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. నిర్దిష్టంగా మన దేశంలో దీర్ఘకాల ప్రజా వర్గపోరాటానికి 50 సంవత్సరాలకు పైబడిన చరిత్రే ఉంది. లక్షలాది మంది భాగస్వామ్యంతో, వేలాది మంది అమరత్వంతో ఒక నూతన చరిత్రను నిర్మిస్తున్నారు. ఇందులో నూతన కళా సంస్కృతుల వికాసం జరుగుతున్నది. అది, నూతన ప్రజాసంస్కృతికి పునాదులు వేసింది. వాటిని మనం మరింత బలోపేతం చేస్తూ ప్రజల ప్రజాస్వామిక సమాజ నిర్మాణ దిశలో, దోపిడీ రహిత సమాజ ఆవిర్భావానికి అంకితం చేయాలి. దానినే మనం ప్రజల సంస్కృతి లేదా విప్లవ సంస్కృతి అంటాం.

కాబట్టి మొట్టమొదట మనం అసలు సంస్కృతి అంటే ఏమిటో దాని గురించి ఒక్కమాటలో ఇలా చెప్పుకుందాం: “సమాజంలోని భౌతిక ఉత్పత్తులు అ సమాజానికి పునాదులు కాగా, బౌద్ధిక ఉత్పత్తులను సంస్కృతిగా చెప్పుకోవచ్చు”. లేదా ఉత్పత్తి సంబంధాల సమష్టి రూపమైన సామాజిక అర్థిక వ్యవస్థ మనుషుల సామాజిక జీవితానికంతటికీ పునాది, పునాదిని బట్టి ఏర్పడే

మనుషుల సామాజిక చైతన్యరూపాలన్నీ ఉపరి నిర్మాణంగా చెప్పుకుంటాం.

మరో మాటలో ఇవి న్యాయసూత్ర సంబంధమైనవి, రాజకీయపరమైనవి, న్యాయపరమైనవి, కళా సౌందర్యానికి చెందినవి, తత్వ సంబంధమైనవి.. ఇలా సామాజిక చైతన్యం నిశ్చిత రూపాలన్నీ వాస్తవ పునాదికి అనుగుణంగా ఉంటాయి. పునాది ప్రభావం వీటన్నిటిపైనా ఉంటుంది. అంతిమంగా వీటన్నింటిని నిర్ణయించేది పునాదే! అయితే, వీటి ప్రభావం పునాది మీద ఎంతగానో ఉంటుంది అనే విషయాన్ని మనం అర్థం చేసుకున్నపుడే పునాదికి, ఉపరి నిర్మాణానికి లేదా భౌతిక ఉత్పత్తులకు, బౌద్ధిక ఉత్పత్తులకు మరోమాటలో సంస్కృతికి మధ్యగల సంబంధం స్పష్టమవుతుంది. ఈ వర్గపోరాట అవగాహనను ముందు అర్థం చేసుకుంటే దాని వెన్నంటే వర్గ సమాజంలో కళలు, సాహిత్యం లేదా సంస్కృతి ఏ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తాయనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది.

దీనిని అర్థం చేసుకొవడానికి తన సుప్రసిద్ధమైన 'కళలు సాహిత్యంపై యేనాన్‌లో చేసిన ప్రసంగం'లో కామ్రేడ్ మావో ఏం చెప్పాడో చూద్దాం.

"వర్తమాన ప్రపంచంలోని సమస్త కళలు, సాహిత్యం నిర్దిష్ట వర్గాల, రాజకీయాల ప్రయోజనాలకోసమే ఉద్దేశించబడినవి. వాస్తవంగా కళ కళ కోసమంటూ ఏదీ లేదు. వర్గాలకు లేదా రాజకీయాలకు అతీతంగా ఏ కళా లేదు. కామ్రేడ్ లెనిన్ చెప్పినట్టు మొత్తం ఒక యంత్రంలో భాగమైన పళ్లూ, చక్రాల్లాగే సమస్త శ్రామిక వర్గ ప్రయోజనాలలో భాగమే కార్మికవర్గ సాహిత్యం కళలు". అంటే వర్తమాన దోపిడీ ప్రపంచంలోని సమస్త కళలు, సాహిత్యం ఆ దోపిడీ వర్గాల ప్రయోజనాలనే ఈడేరుస్తాయని అర్థం చేసుకోవాలి. అలా అనుకున్నపుడు దోపిడీ సమాజంలోని పునాదికి దాని ఉపరి నిర్మాణంలోని సంస్కృతి సేవ చేస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ సామాజిక భౌతిక ఉత్పత్తులను పరిరక్షించడానికి, పెంపొందించడానికి బౌద్ధిక ఉత్పత్తులైన కళలూ సాహిత్యం తదితరాలు అంకితమవుతాయి. అవి ప్రజలను గాఢంగా ప్రభావితం చేస్తాయి. వాటి ఫలితమే సమాజంలో శాస్త్రీయ అవగాహనలు ప్రజలకు ప్రధానంగా పునాది వర్గాలవారికి అందకపోవడం! వారు మతమౌఢ్యం, అంధవిశ్వాసాలలో కూరుకపోయి, నిరుపేదలకు అక్షర జ్ఞానం కూడా చాలా వరకు కరువై ఉండడం! అలాంటి శ్రమజీవులను సమీకరించడానికి, సంఘటితీకరించడానికి, విప్లవించడానికి మనకు విప్లవ కళలు, సాహిత్యం, సంస్కృతి కావాలి. వాటిని ఆయుధాలుగా మలచగలిగే శక్తులు (సాంస్కృతిక సైన్యం) కావాలి. ఆ విషయ ప్రాధాన్యతను మనకు మావో ఇలా బోధించాడు.

"విశాల విప్లవ ప్రజారాసులకు విప్లవ సంస్కృతి అనేది ఒక శక్తిమంతమైన విప్లవ ఆయుధం. విప్లవానికి ముందు అది భావజాల రంగంలో భూమికను తయారుచేస్తుంది, కాగా విప్లవకాలంలో అది సాధారణ యుద్ధరంగంలో ఒక ముఖ్యమైన, అవశ్యమైన పోరాట రంగం". (నూతన ప్రజాస్వామికం-మావో) పై మావో బోధనలను మనం లోతుగా అధ్యయనం చేసి అర్థం చేసుకోవాలె. అలాగే మన దేశ చరిత్రను, సంస్కృతిని కూడా మనం తెలుసుకోవాలె. ఎందుకంటే, దేశంలో విప్లవాత్మక పరిస్థితి వుందని ప్రజానీకానికి తెలియజేయడం, ఆ పరిస్థితి విస్తృతిని గురించి ప్రగాఢతను గురించి వివరించి చెప్పడం, శ్రామికవర్గంలోని విప్లవాత్మక చైతన్యాన్ని విప్లవాత్మక దృఢ నిశ్చయాన్ని మేలుకొల్పడం, అది విప్లవ చర్యలకు దిగేటందుకు సహాయపడటం, అందుకోసం విప్లవాత్మక పరిస్థితికి తగిన సంఘాలను ఏర్పర్చడం సోషలిస్టులందరి ప్రధాన కర్తవ్యం అన్నాడు కామ్రేడ్ లెనిన్.

మన ప్రియమైన భారతదేశం అనేక భాషలకు, పలు మతాలకు, అనేక అదివాసీ సముదాయాలకు (వికసిస్తున్న/అవిర్భావ జాతులకు), భిన్న సంస్కృతులకు నిలయం. అనేక జాతులతో విలసిల్లుతున్న దేశం మనది. మన దేశ జనాభా 140 కోట్లను దాటనుంది. ఈరకమైన మన దేశ వైవిధ్యాన్ని ముందుగా మనం అర్థం చేసుకోవాలి. ప్రపంచ ప్రజలందరిలాగే మన దేశ ప్రజలు కూడా అత్యంత ప్రజాస్వామ్య ప్రియులు, గొప్ప పోరాటవారసులు. మన దేశంలో బ్రాహ్మణ్యానికి వ్యతిరేకంగా క్రీస్తు పూర్వమే చార్వాకులు ధ్వజమెత్తారు. మన దేశ వేదాలను నిలదీసిన చరిత్ర లౌకికవాదానికి భౌతికవాదానికి ఉంది. మన దేశప్రజలు జరిపిన ప్రగతిశీల పోరాటాలలో నుండి క్రీస్తు పూర్వమే నూతనంగా బౌద్ధం, ఆ తరువాత క్రీస్తు శకం 14వ శతాబ్దంలో సిక్కు లాంటి మతాలు ఆవిర్భవించాయి. బ్రాహ్మణీయ అధిపత్యానికి కుల సంకెళ్లకు సవాలు విసురుతూ మన దేశంలో చెలరేగిన భక్తి ఉద్యమాలు కుల రహిత సమాజ భావనను ముందుకు తెచ్చి శ్రామిక ప్రజలలో సోదర భావాన్ని ఎత్తిపట్టాయి. కాలం చెల్లిన, ప్రగతి నిరోధకమైన కరుడుగట్టిన బ్రాహ్మణ మతాన్ని చార్వాకుల నాటి నుండి ఎదిరిస్తూ, ఖండిస్తూ, వివిధ సందర్భాలలో ఓడిస్తూ వచ్చిన ప్రజలు, ఆ తరువాత బ్రిటిష్ సామ్రాజ్యవాదులనూ ఎదిరిస్తూ దేశంలో ప్రజాస్వామిక విప్లవ తరంగాలను నిలుపుతూ వచ్చారు. మన దేశం నిరంతరం ప్రజా పోరాటాలలో ప్రజ్వరిల్లింది. వాటి ఫలితంగానే తుదకు మనదేశం నుండి వలసాధిపతులు 1947లో తెరమరుగు కాక తప్పలేదు. అందుకు ప్రపంచపరిస్థితులు ఎంతగానో దోహదపడ్డాయి. దేశంలో బలమైన విప్లవోద్యమం రూపొందకపోవడంతో ఆ నామమాత్ర స్వాతంత్రమే దేశ స్వతంత్రంగా ప్రజల మనసులలో నాటుకుపోయింది.

మన దేశ యావత్ ప్రజల పోరాటాలలో ఆదివాసీ ప్రజా తిరుగుబాట్లు గొప్ప విశిష్టతను కలిగి ఉన్నాయి. క్రీస్తు పూర్వం సాగిన మౌర్య సామ్రాజ్య విస్తరణను అడ్డుకొని "యుద్ధ పిపాసి" అశోకుడి పురోగమనాన్ని కళింగ యుద్ధంలో నిలిపివేసిన నాటి నుండి 19వ శతాబ్దం తొలిసగంలో గేంద్ సింగ్, బిర్సా ముండాలు, మలి సగంలో సద్మెక్ బాబూరావు, వెంకట్రావు, సిద్దూ కానూలు, 20వ శతాబ్దం మొదటి దశాబ్దంలో గుండాదుర్,

మలిభాగంలో కొమరం భీము లాంటి వాళ్ల వరకు నడిపిన అనేక ప్రజా పితూరీలు వీరోచిత ఆదివాసీ ప్రజల చరిత్రకెక్కాయి. ఆ వరుసనే సామ్రాజ్యవాదుల దోపిడీ విధానాలనే భారత పాలకులు అమలుచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రజల కోసం నిలిచి పోరాడి 1964లో పోలీసుల తూటాలకు నేలకొరిగిన బస్తర్ రాజు ప్రవీర్ చంద్ర బాంజ్‌దేవ్ వరకు అనేకమంది ప్రజా యోధులకు, వారి నాయకత్వంలో ప్రజా తిరుగుబాట్లకు నిలయంగా నిలిచినవే ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం, బీహార్, జార్ఖండ్‌లు. ఆ వీరయోధులతో పాటు రామరాజులాంటి దేశభక్తుల వారసులే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దండకారణ్య, బిహార్, జార్ఖండ్ ఉద్యమ ప్రాంతాల ఆదివాసీ ప్రజలు.

ఆ చరిత్ర పుటల కొనసాగింపుగా 1960ల చివర్లో భారత విప్లవకారులలో ఒకరైన కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వంలో నక్సల్బరీ (పశ్చిమ బంగాల్) సంతాల్ ఆదివాసీ రైతాంగం భూమి కోసం ఉద్యమించారు. ఆ పోరాటం అలలు అలలుగా దేశమంతా వ్యాపించింది. చిన్న నిప్పు రవ్వ దావానలంలా మారింది. విప్లవ మహానాయకులు కామ్రేడ్స్ చారు మజుందార్, కన్హయ ఛటర్జీల వారసత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమం గత 50 సంవత్సరాలకు పైగా దేశంలో భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమాన్ని పురోగమింపచేస్తున్నది. భారత దోపిడీ పాలకవర్గాల భద్రతా బలగాలను సవాలు చేస్తూ ప్రజారాజ్యాధికార స్థాపన దిశలో అనేక ఆటు-పోట్ల మధ్య భారత విప్లవోద్యమం కొనసాగుతోంది.

ఈ వెలుగులో ప్రస్తుతం ఉద్యమ ప్రాంతాల పోరాట చరిత్రను, వారి సంస్కృతిని లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేయాలి. దేశంలో నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమాన్ని విజయపథంలో పురోగమింపచేస్తూ అంతిమ విజయం సాధించడానికి ప్రజల ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాలలో చోటుచేసుకుంటున్న మార్పులు (వీటిని పాదార్థిక సంబంధాలు అని కూడ వ్యవహరిస్తారు), వాటిపై ఆధారపడి వాటికి సేవ చేసే ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, కళలు, సాహిత్యం మరోమాటలో సంస్కృతి (వీటిని భావజాల సంబంధాలు అని కూడ వ్యవహరిస్తారు) క్షుణ్ణంగా తెలిసి ఉండడం చాలా అవసరం. అలా తెలిసినపుడే కాలం చెల్లిన దోపిడీ వర్గాల సంస్కృతిని తుదముట్టించి దాని స్థానంలో దోపిడీ రహిత ప్రజాస్వామిక, సోషలిస్టు సంస్కృతిని నిలపడానికి చేస్తున్న మన కృషి సఫలమవుతుంది.

ప్రజల జీవితాలను మనం రెండుగా విభజిస్తే, వారి జీవితంలోని ఆర్థిక వ్యవహారాలన్నీ పునాదిగానూ, దానిపై ఆధారపడి వ్యక్తమయ్యే వాటిని సంస్కృతిగానూ చెప్పుకుంటారనే మౌలిక అవగాహనను ముందే చూశాం. అంటే ఆర్థికాన్ని సంస్కృతి ప్రతిబింబిస్తుంది. అంటే, ఒక సమాజ సంస్కృతి ఆ సమాజం తాలూకు ప్రజల మధ్య (ఉత్పత్తి) సంబంధాలను, ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను, కట్టుబాట్లను ప్రతిబింబిస్తుంది.

అంటే మన దేశ సంస్కృతి విషయానికి వస్తే ఇక్కడి విశిష్టతల నేపథ్యంలోనే దీనిని అర్థం చేసుకోవాలి. మన దేశంలో దోపిడీ పాలకవర్గాల హైందవ సంస్కృతి ఆధిపత్యంలో ఉంది. ఫలితంగా వర్గవ్యవస్థ స్థానంలో అది సృష్టించిన వర్ణవ్యవస్థ, అందులో నుండి పుట్టుక వచ్చిన నికృష్ట కుల వ్యవస్థ చిహ్నాలు ప్రజల జీవితాలలోని భాషతో సహా అన్ని పార్శ్వాలను ప్రతిబింబిస్తుంటాయి. కాబట్టి మన సమాజంలో మనం కేవలం వర్గ దోపిడీకి వ్యతిరేకంగానే కాకుండా లింగ, కుల దోపిడీలకు వ్యతిరేకంగా కూడా పోరాడాలి. ముఖ్యంగా కులం అనేది కుత్సితమైన, అత్యంత అప్రజాస్వామికమైనదే కాకుండా ప్రజలను నిలువునా చీలదీసే, వారి మధ్య సోదర భావానికి విఘాతాన్ని కలిగించే దుష్ట వ్యవస్థ. దుర్నీతి దాని లక్షణం. ఇది హిందూ మతంలో తప్ప ప్రపంచంలోని ఏ మతంలో మరెక్కడా లేదు. కాబట్టి వర్గ విముక్తి, జెండర్ విముక్తితో పాటు మన దేశంలో కుల విముక్తి చైతన్యాన్ని కూడా ముందుకు తీసికెళ్లాలి.

సంస్కృతి అనేది చాలా విశాలమైన అర్థాన్ని కలిగి వుంది. మనం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయడం అంటే, నూతన లేదా ప్రజల ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించడమే అవుతుంది. దీని కోసం మన దేశంలో వ్యవసాయక విప్లవం కొనసాగుతున్నది. ఇది దున్నేవారికే భూమి నినాదం ఇరుసుగా సాగుతున్నది. దీనిని ప్రజాస్వామిక విప్లవంగా పేర్కొంటాం. భూస్వామ్య దోపిడీని సమూలంగా రూపుమాపే విప్లవం ఇది. ఈ విప్లవం జయప్రదం కావడం ద్వారా దోపిడీకి ఒక మూల ప్రాతిపదిక అయిన ఉత్పత్తి సాధనం భూమి రైతాంగం చేతిలోకి వస్తుంది. అదే సమయంలో సామ్రాజ్యవాదుల, వారి దళారీలైన సీ.బీ.బీ.కి చెందిన కీలక, ప్రధాన పరిశ్రమలు, బ్యాంకులు జాతీయం అవుతాయి. వారి దోపిడీ కొనసాగింపుకు లేదా వారి అధికార కొనసాగింపుకు అసలైన సాధనం రాజ్యాంగ యంత్రం (పోలీసు, మిలిటరీ) ఓటమి పాలై ప్రజల ప్రజాస్వామిక రాజ్య యంత్రం రూపొందుతుంది. అంటే దేశం అర్ధవలస అర్ధభూస్వామ్య స్వభావాన్ని కోల్పోతుంది. దాని వెన్నంటే దానికి దన్నుగా ఉన్న సామ్రాజ్యవాదుల పరోక్ష దోపిడీ, పాలన, నియంత్రణ తొలగిపోయి దేశం వారి సంకెళ్ల నుండి నిజమైన విముక్తిని పొందుతుంది.

తద్వారా ప్రజాస్వామిక, జాతీయ విప్లవం పరిపూర్తి అవుతుంది. ఇది 1947 భారత 'జాతీయ' స్వాతంత్రోద్యమానికి మౌలికంగానే పూర్తి భిన్నమైనది. అంటే ఒకవైపు దళారీ నిరంకుశ బూర్జువాల, భూస్వామ్య దోపిడీ, మరోవైపు సామ్రాజ్యవాద దోపిడీ జమిలిగా సాగుతున్న నేటి వ్యవస్థ రద్దయి ఆ పునాదుల మీద ఏర్పడిన నూతన వ్యవస్థ ఆలంబనగా నూతన సంస్కృతి నిర్మాణమవుతుంది. ఇది భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతికి చరమగీతం పాడుతుంది. అందుకు నేటి స్థావర ప్రాంతాలు, జనతన సర్కారులే పునాదులు అవుతాయి. ఆ నూతన సంస్కృతి ఇక్కడి నుండే ప్రారంభమవుతుంది.

మన దేశంలోని భూస్వామ్యం కులాధారితం. సమాజ

వికాసంలో శ్రమ విభజన అధారంగా ఇది ఉనికిలోకి వచ్చినప్పటికీ, దీని పునాదులు చాతుర్వర్ణ వ్యవస్థను నెలకొల్పిన బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలంలో ఉన్నవి. ఇది దేశంలోని ప్రజల మధ్య సోదర భావం, సమానత్వం, స్వేచ్ఛ, స్వతంత్రతలకు అడ్డుగోడగా నిలిచింది. దేశ ప్రజలపై కొనసాగుతున్న తీవ్ర దోపిడీ, అసమానతలకు కారణమైన ఉత్పత్తి సాధనాల యాజమాన్యం నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వార పీడిత ప్రజల చేతులలోకి మారినప్పటికీ వారి మధ్య సాంస్కృతికంగా అసమానతలకు, ఎక్కువ తక్కువలకు, గొప్ప, హీన భేదభావాలకు కేంద్రంగా నిలిచిన కుల వ్యవస్థ పునాదులు విచ్ఛిన్నం కావడానికి వాటిని నామరూపాలు లేకుండా చేయడానికి కావలసిన ప్రాతిపాదికను నూతన ప్రజాతంత్ర విప్లవం ఏర్పరుస్తుంది.

మన దేశం కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల బలవంత విలీనాలతో ఒక జాతుల బందీఖానాగా మారింది. దేశ దోపిడీ పాలక వర్గాలు, సామ్రాజ్యవాదులు కుమ్మక్కై దేశంలోని భిన్న జాతుల వికాసాన్ని నిరంకుశంగా అడ్డుకుంటున్నవి. దేశంలో భిన్న జాతుల ఉనికినే కాదంటూ కల్పితమైన భారత జాతిని నిలపడానికి దోపిడీ పాలకవర్గాలు 1947 అధికార మార్పిడి తర్వాతి నుండి తమ ప్రయత్నాలను మరింత తీవ్రతరం చేశాయి. ఆ ప్రయత్నాల పరాకాష్టగా నేడు కేంద్రంలోని హిందుత్వ శక్తులు అన్ని రంగాలలో “ఏక్ భారత్- శ్రేష్ట్ భారత్” నినాదాన్ని ముందుకు తెస్తూ ‘నయాభారత్’ నిర్మాణ లక్ష్యాన్ని ప్రకటిస్తున్నాయి. ఇవి ‘హిందూ, హిందీ, హిందుస్తాన్ అనే కృత్రిమ భావాలను దేశ జనాభాపై రుద్దుతూ దేశ వైవిధ్యాన్ని ధ్వంసం చేస్తున్నవి. భాషల వికాసాన్నీ, లౌకిక భావాలనూ, వ్యక్తిగతమైన మత స్వేచ్ఛను, భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకుంటున్నవి. ఆహారపు అలవాట్లను, జన సంప్రదాయ జీవన విలువలను కాదంటూ పరాయితనాన్ని దౌర్జన్యపూరితంగా, హింసాయుతంగా రుద్దుతున్నవి. ఈ వైఖరి తాము రాసుకున్న భారత లిఖిత రాజ్యాంగానికే భిన్నమైనది. వారు భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హామీలను ఖాతరు చేయడం లేదు. హిందుత్వ - ఫాసిస్టు విధానాలన్నింటిని ఎదుర్కొంటూ, ఓడిస్తూ నూతన ప్రజాతంత్ర విప్లవం జాతుల స్వతంత్రతను, సార్వభౌమాధికారాన్ని నిర్ద్వంద్వంగా ఎత్తిపడుతుంది. కాబట్టి దేశంలోని పీడిత జాతులతో నమైక్యమై, వారి పోరాటాలతో భుజం-భుజం కలిపి పోరాడాలి. ఈ విషయం ఇప్పటికీ పలు సందర్భాలలో విప్లవోద్యమం తన ఆచరణ ద్వారా నిరూపించింది. ముఖ్యంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజాస్వామిక తెలంగాణ అంటూ ప్రజాస్వామిక వైఖరిని ఎత్తిపడుతూనే వర్గపోరాటాన్ని ముందుకు తీసికెళ్లేందుకు కృషి చేసింది.

మన దేశంలో వందలాది తెగలు సహజీవనం చేస్తున్నవి. వాటి జీవన విధానం ఎంతోవైవిధ్యంతో కూడుకున్నది. వాటికి తమదంటూ భాషా, సంస్కృతులున్నవి. కానీ వాటి వికాసక్రమాన్ని, దోపిడీ పాలకవర్గాలు అడ్డుకున్న ఫలితంగా వాటి “అభివృద్ధి వక్రమార్గం పట్టింది, లేదా అపసవ్యంగా మారింది. వారు నివసించే ప్రాంతాలు నేటికీ అపార ప్రాకృతిక వనరులకు నిలయాలుగా వుండి, దేశ ప్రజల అవసరాలు తీరుస్తూ, పర్యావరణ సమతుల్యతకు ప్రధానకేంద్రాలుగా ఉన్నాయి. మూలవాసులలో నరనరాన జీర్ణించుకొని ఉన్న తరతరాల ప్రజాస్వామ్య భావన, సోదర భావం, సామూహికత, సమష్టితత్వం ఫలితంగా వారు తమపై కొనసాగిన అనేక దాడులను, యుద్ధాలను సమైక్యంగా ఎదుర్కొన్నారు. మన దేశంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మొదటి పోరు శంఖం ఊదింది మూలవాసులే! వారు ఇప్పటికీ తమ మనుగడ కోసమే కాదు, ఈ అడవులు, సంపదలు తమకే, తమ దేశ ప్రజలకే చెందాలనీ బలంగా అకాంక్షిస్తూ పోరుకేతనాన్ని ఎగురవేస్తున్నారు. కానీ, నిన్నటి బ్రిటిష్ వలసాధిపతుల పాలనలోకానీ, వారి అడుగు జాడలలో నడుస్తున్న వర్తమాన భారత పాలకుల ఏలుబడిలో కానీ వారి వీరోచిత పోరాటాలన్నీ ఉక్కుపాదాల కింద అణచివేయబడుతున్నాయి. ప్రస్తుత పాలకులు వారిపై మావోయిస్టులనే ముద్రవేశారు.

చరిత్రలో బ్రాహ్మణవాద కులాచారాలను, దౌర్జన్యాలను, పరమ నికృష్టమైన అంటరానితనాన్ని తట్టుకోలేక క్రైస్తవం లేదా ఇస్లాంలలోకి మారారు. వారిని ఇపుడు పరమత సహనం తెలియని హిందూ ఛాందసవాదులు ‘పునరాగమనం’ (ఘర్ వాప్సీ) పేరుతో దౌర్జన్యంతో హైందవంలోకి మార్చుకుంటున్నారు. వారిని రియాక్షనరీ సంఘ్ ముఠా (కాషాయ బ్రిగేడ్)తో పాటు హిందూ భావజాలం నరనరాన జీర్ణించుకుపోయిన భారత దోపిడీ ప్రభుత్వాలు మూలవాసులుగా గుర్తించ నిరాకరిస్తూ వారి చారిత్రిక అస్థిత్వాన్ని అత్మగౌరవాన్ని కాలరాచివేస్తున్నారు. వారు విప్లవాల మార్గం పట్టకుండా నివారించడానికి భారత రాజ్యాంగంలో కొన్ని సంస్కరణల ఆశలను చూపి 5వ, 6వ షెడ్యూల్‌లను పొందుపరిచారు. ఆ తరువాత మావోయిస్టు ఉద్యమాల నుండి వారిని దూరం చేస్తూ వారి పోరాటాలను పక్కదారులు పట్టించడానికి 1996లో పెసా చట్టాన్ని ముందుకు తెచ్చారు. అంతే కాదు, ప్రపంచ బ్యాంకు గైడెన్స్‌లో 1988లో ‘జాతీయ అటవీవిధానం.. సంయుక్త అటవీ యాజమాన్య ప్రోగ్రాంను రూపొందించి ఆదివాసులకు అడవుల యాజమాన్యంలో భాగస్వామ్యం అంటూ వారిని కాపలాదారుల స్థాయికి కుదించారు. 2006లో నూతన అటవీ చట్టాన్ని రూపొందించారు. కానీ అమలు కాని ఆ చట్టాలతో, కంటితుడుపు సంస్కరణలతో మూలవాసుల ఉద్యమాలు సహజంగానే దేశంలో అగడం లేదు. దేశంలోని వ్యూహాత్మక ప్రాంతాలలోని ప్రధాన మూలవాసీ తెగల ప్రజలు విప్లవోద్యమంతో అత్యంత సన్నిహితంగా పెనవేసుకపోయి ఉన్నారు. వారు నిజమైన తమ ప్రజాస్వామిక అటానమస్(స్వయం పాలన) ప్రాంతాల స్థాపనను బలంగా కోరుకుంటున్నారు. అత్యంత పోరాట చేవగల ఆ ప్రజలు నిన్నటి ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలలో వంచింపబడ్డారు. ఒకే తెగ సమూహాలు వేరువేరు రాష్ట్రాలలోకి విభజించబడినారు. వారి ఏకత్వం, ఐక్యత, అచార వ్యవహారాలు, భాషా-సంస్కృతులకు,

జాతులుగా వారి వికాసానికి హాని కలిగింది.

ఆ వాస్తవాన్ని వారికి చారిత్రకంగా బోధించి మూలవాసుల ప్రాదుర్భావ జాతుల వికాసానికి పోరాడాలి. మన దేశంలోని దళితులు, ఆదివాసులు, మత మైనార్టీలు, శ్రామిక (కులాల) ప్రజానీకం హిందుత్వాన్ని, నయా ఉదారవాదాన్ని బలంగా వ్యతిరేకిస్తున్నారు. అవి రెండూ తోడు దొంగలుగా మన దేశ పీడిత ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. కాలం చెల్లిన కరుడు గట్టిన ప్రతిగామి లేదా యధాతథవాద బ్రాహ్మణీయ సంస్కృతిని సామ్రాజ్యవాదం సొమ్ము చేసుకుంటున్నది. ప్రపంచీకరణ ఫేజులో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిందంటూ 'గ్లోబల్ విలేజిలో తననరుకుల నంన్కృతిని (వన్తు వ్యామోహ నంన్కృతిని) వ్యాపింపచేస్తోంది. వీటిని విప్లవోద్యమం బలంగా, నిర్ద్వంద్వంగా అడ్డుకుంటున్నది. ప్రజలను దీని ప్రభావం నుండి బయటకు తేవడానికి విప్లవోద్యమ శక్తులు ఓపికతో కూడిన అలుపెరుగని కృషి తీవ్రం చేయాలి.

పైన పేర్కొన్న నమస్యల వరిష్కారానికి నిజమైన ప్రత్యామ్నాయం విప్లవోద్యమమే తప్ప మరోటి లేదని ప్రకటించడమే అసలైన ప్రజా సంస్కృతికి పునాది అవుతుంది. మన విప్లవోద్యమం ప్రాంతాల వారిగా అధికారాన్ని హస్తగతం చేసుకునే దీర్ఘకాల ప్రజా యుద్ధ పంథాలో కొనసాగుతోంది.

2

విప్లవోద్యమ ప్రాంతాలలో ఏ మేరకు ప్రజల రాజకీయ అధికారం సంఘటిత పడుతుందో అ మేరకు అన్ని ప్రజా సముదాయాల అకాంక్షలు వాస్తవ రూపం ధరిస్తుంటాయి. గత ఐదు దశాబ్దాల భారత నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమం ఈ వాస్తవాన్నే చాటుతోంది. కాబట్టి ఈ విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించడానికే తొలి నుండి భారత పాలక వర్గాలు బహుముఖ వ్యూహాల్ని ప్రధానంగా సైనిక అణచివేత విధానాలను అమలు చేస్తు పరమ నిరంకుశ ఫాసిస్టు పాలనను కొనసాగిస్తున్నవి. అవి ఇపుడు హిందుత్వ 'సమాధాన్' సైనిక వ్యూహంగా రూపుదిద్దుకొని అపరేషన్ 'ప్రహార్' రూపంలో తక్షణం మన ముందు నిలిచింది. విప్లవోద్యమంలో భాగంగా ఏర్పడిన ప్రజా సైన్యం గత ఐదు దశాబ్దాలకు పైగా దేశంలో కొనసాగుతోన్న ప్రజల ప్రజాస్వామిక ఉద్యమ అకాంక్షల ప్రతిరూపంగా నిలిచి పోరాడుతోంది. అ ప్రజా పోరాటాలన్నిటి అనుభవాలతో వదునెక్కిన ప్రజల సైన్యం చరిత్రంతా ఏయేటికాయేడు మరింత బలంగా ముందుకు వస్తున్న ప్రతీఘాతుక విప్లవోద్యమాన్ని దృఢంగా ప్రతిఘటిస్తూ రణరంగంలో మరింత రాటుదేలుతూ ప్రజల అపార విశ్వాసాన్ని చూరగొన్న చరిత్రే! ఇలా చేయడం ద్వారానే అది బలబడుతూ అలలు అలలుగా విస్తరిస్తున్నది. ఒంటరి ప్రాంతాల నుండి విస్తార ప్రాంతాలకు, చిన్న ప్రాంతాల నుండి విశాలమైన ప్రాంతాలకు అది పురోగమిస్తున్నది. ఈ అనుభవాన్నంతా గొప్ప త్యాగాల మార్గంలో అది తన రక్తాన్ని చిందిస్తూ సంపాదించినది. దీనిని గుర్తించకపోతే భారత విప్లవోద్యమ చరిత్రకు అర్థమే లేదు. ఇక ఇపుడు నవయువ్వనంలో ఉన్న ప్రజా సైన్యం తన అనుభవ సారాన్నంతా మరోసారి మదింపు వేసుకొని నయా ఉదారవాద విధానాల అమలులో భాగంగా ముందుకు వచ్చిన ఆపరేషన్ సమాధాన్‌ను దాని నాల్గవ సంవత్సరపు నేటి హిందుత్వ ప్రహార్ దాడులను అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ ఓడించాల్సిన తరుణం ఆసన్నమైంది. అందుకు అది తను పని చేస్తున్న ప్రాంతాలలోని పోరాట ప్రజలతో మరింత సమైక్యం అవుతూ వారితో పూర్తిగా తాదాత్మ్యం చెందాలి.

దోపిడీ పాలక వర్గాల భద్రతా బలగాలు తమ బహుముఖ వ్యూహంలో భాగంగానే సివిక్ అక్షన్ ప్రోగ్రాంలను వివిధ రూపాలలో వ్యాపింప చేస్తున్నాయి. ప్రజలకు సంతలలో మందులు, గంజులు, బట్టలు పంచడం నుండి యువతకు గ్రడలు నిర్వహించడం వరకు జరుగుతున్నాయి. అవన్నీ వాడి అసలైన సైనిక దాడులకు ముసుగులని ప్రజలకు సదా తెలుపుతూ ఉండాలి.

అవి వారి జీవితాలలో ఎలాంటి మౌలికమైన మార్పులను తేలేవనీ ప్రజల శ్రమ సంస్కృతిని భ్రష్టు పట్టిస్తున్నాయనీ స్పష్టం చేయాలి. అవన్నీ అమలు చేయడంలో అర్ధసైనిక బలగాలే ముందుంటున్నాయి. అ బలగాలు వాటికి 'సివిక్ అక్షన్ ప్రోగ్రాం" (క్యాప్) అని పేరు పెట్టి అమలు చేస్తున్నవి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా పోరాటాలను పక్క దారులు పట్టించడానికి, సైనిక అణచివేతకు సాధికారతను సాధించడానికి క్యాప్‌లను ఒక పథకం ప్రకారమే అమలు చేస్తున్నవి. వారి ఎల్.ఐ.సీ. విధానాలలో భాగంగా అ ప్రాంతాలను ప్రజా యుద్ధ ప్రాంతాలుగా గుర్తించ నిరాకరిస్తూ వాటిని 'ఘర్షణ ప్రాంతాలు" (కాన్‌ఫ్లిక్ట్ జోన్స్)గా పేర్కొంటూ వారు పొందుపరచుకున్న జెనీవా ఒప్పందాలను ఉ ల్లంఘిస్తున్నారు. ప్రజా అకాంక్షలను ఎత్తిపడుతూ పోరాడుతున్న విప్లవకారులను (గెరిల్లాలను) టెర్రరిస్టులుగా అభివర్ణిస్తున్నారు. కానీ నిజానికి ప్రపంచ ప్రజలపై పరమాణు బాంబులను (లిటిల్ బాయ్) ప్రయోగించిన అమెరికన్ సామ్రాజ్యవాదులను, మన దేశంలో కాషాయ ఉగ్రవాదాన్ని మించిన హంతక సంస్కృతి, టెర్రరిజం మరొకటి ఇప్పటివరకు లేవని మనం విప్లవ ప్రజానీకానికి తేటతెల్లం చేయాలి.

ఇదే సమయంలో దోపిడీ సమాజ దుష్ప్రభావంతో ప్రజా సైన్యంలో వదలుకోవలసిన చెడు ధోరణులు కూడా కొనసాగుతున్నవి. ఇవి దేశంలోని భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతి ఫలితమే. ప్రజలను గురువులుగా స్వీకరించి, వారిని చరిత్ర నిర్మాతలుగా గుర్తించి వారితో అత్యంత ఆత్మీయంగా, సన్నిహితంగా కామ్రేడ్లీ భావనతో తాదాత్మ్యయం చెందాల్సిన చోట కొన్ని సందర్భాలలో వారితో దురుసుగా వ్యవహరిస్తున్న చేదు అనుభవాలు ఎదురవుతున్నవి. వీటిని శత్రువర్గాలు గోరంతలు కొండంతలు చేస్తూ విప్లవోద్యమాన్ని, ప్రజా సైన్యాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి తన చేతిలోని ప్రచార, ప్రసార సాధనాలను

విరివిగా వినియోగించుకుంటున్నాయి. ప్రజా సైనికులు క్రమశిక్షణను అక్షరాల పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదు.

ప్రజా సైన్యంలో పురుషులతో పాటు మహిళా గెరిల్లాలు భుజం భుజం కలిపి పోరాడుతున్నారు. దోపిడీ, పితృస్వామ్య సంకెళ్ల నుండి మహిళా విముక్తికి నూతన ప్రజాతంత్ర విప్లవ విజయం సోపానం వంటిదనే అవగాహనను పెంపొందించుకుంటూ మహిళలు దృఢంగా నిలిచి పితృస్వామ్యాన్ని ఎదుర్కొంటూ రణరంగంలో పురుషులతో సమానంగా పోరాడుతున్నారు. శత్రువుతో పోరాడుతూ త్యాగాలలోనూ ముందుంటున్నారు. వారితో అనుక్షణం జెండర్ చైతన్యంతో వ్యవహరించడంలో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. నిత్య జీవితంలో ఉపయోగిస్తున్న పితృస్వామ్య భాష మొదలు సైనిక వ్యవహారాలలో వారిని అన్ని పనులలో భాగం చేస్తూ సమర్థవంతమైన ఉన్నత స్థాయి కమాండర్లుగా, కమ్యూనికేషన్ పర్సన్స్‌గా, టీం లీడర్లుగా, శిక్షణ ఇన్‌స్ట్రక్టర్లుగా, అన్ని పనుల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో విప్లవోద్యమం ఇంకా సాధించాల్సింది చాలా ఉంది.

నైతిక విషయాలలో మహిళలను గౌరవిస్తూ, వారి అభిప్రాయాలను ప్రజాస్వామికంగా పరిగణనలోనికి తీసుకోవడంలో, పరిశీలించడంలో పితృస్వామ్య భావజాలం అడ్డుతగులుతోంది. సమాజంలో ఆమోదయోగ్యం కాని వివాహపూర్వ సంబంధాలు, వివాహేతర సంబంధాలు విప్లవోద్యమంలో నిషేధితమే! కానీ, అ అవగాహన కొరవడినవారు, బలహీనమైనవారు పితృస్వామ్య బుద్ధితో స్త్రీ-పురుష సంబంధాల విషయంలో తప్పులు చేస్తున్నారు. స్త్రీలు స్వచ్ఛందంగా, తమ ఇష్ట ప్రకారం, తమ విప్లవ జీవితానికి ఆటంకం కాని విధంగా నచ్చిన వారితో తమ వైవాహిక జీవితాన్ని కొనసాగించడానికే విప్లవోద్యమం ప్రోత్సహిస్తున్నది.

కానీ, కొంతమంది మహిళలు తొందరపాటుతో, అపచైతన్యంతో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఎదుర్కొంటున్న చేదు అనుభవాలు వారి పురోగతిని వివిధ రూపాలలో అడ్డుకుంటున్నాయి. పిల్లలను కనే విషయంలో, భార్యా భర్తలే స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. అత్యధిక శాతం జంటలు తమ విప్లవ కార్యకలాపాలకు మహిళల గర్భధారణతో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకొని అంకితభావంతో తల్లితనాన్ని త్యజిస్తున్నారు. అయినప్పటికీ, కొంత మంది తొందరపాటుకు గురవుతున్నారు. ఫలితంగా, మహిళలు గర్భవిచ్ఛిత్తి సమస్యను ఎదుర్కొంటున్నారు. మరికొందరు ఉద్యమం ముందు తమ అభిప్రాయాన్ని వెల్లడించి శిశువుకు జన్మనిస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో పిల్లల పోషణకు ఉద్యమమే బాధ్యత పడుతోంది. అలాంటివారు ఉద్యమం నిర్ణయించిన కాలావధిలోపు తిరిగివచ్చి విప్లవోద్యమంలో చేరిపోతున్నారు.

ఈ తరహాలో విప్లవోద్యమం ఒక కొత్త ప్రజాస్వామిక, విప్లవకర సంస్కృతికి ప్రాణం పోస్తుంటే, పోలీసులు, పాలకులు విప్లవోద్యమంలో మహిళలకు రక్షణ లేదనీ, లైంగిక భద్రత కరవైందనీ దురుద్దేశ్యపూర్వకంగా దుమ్మెత్తిపోస్తున్నారు. నిజానికి అ విషయాలలో పల్లెత్తు మాట మాట్లాడడానికి కూడ వారికి కనీస నైతిక అర్హత లేదు. విధి నిర్వహణ పేరుతో పోరాట, పేద మహిళలపై ఖాకీలు జరిపే అత్యాచారాలు, దోపిడీ వ్యవస్థ దాష్టీకాలు యేటేటా నమోదయ్యే ఎన్‌సీఆర్‌బీ చూస్తే సరిపోతుంది.

3

ఉద్యమ ప్రాంతాలలో మునుపెన్నటికన్నా వేగంగా, ఎక్కువగా మత మార్పిడిలు జరుగుతున్నాయి. మన ఉద్యమ ప్రాంతాలలో ముఖ్యంగా శత్రు నిర్బంధ కెంపెయిన్‌ల సందర్భంగా తడవ తడవకు ఈ సమస్య తీవ్రత పెరుగుతోంది. నిజానికి మత ఘర్షణల రూపంలో వెల్లడయ్యే వాటి వెనుక ఆయా ప్రాంతాలలోని భూస్వామ్య, పెత్తందార్ల స్వార్థ ప్రయోజనాలే ప్రధానంగా పని చేస్తుంటాయనీ మన దేశంలో పెల్లుబికిన భక్తి ఉద్యమాల నాటి నుండి పదే పదే వెల్లడవుతోంది. ఇప్పుడు కూడా మన ఉద్యమ ప్రాంతాలలో ఎదురవుతోన్న హిందూ, క్రైస్తవ మత మార్పిడుల వెనుక గల శక్తులను, వారి రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆయా గ్రామాలలోని అధిపత్య వర్గాల వారి ప్రయోజనాలు స్పష్టమవుతాయి.

మన దేశ నికృష్ట కులవ్యవస్థ ఫలితంగా శ్రామిక కులాలను చాలా వరకు అంటరానివారుగా, శూద్రులుగా పరిగణిస్తున్నారు. ఆదివాసులలోకి కూడ అమానుష కుల వైరసు చాలాకాలం క్రితమే వ్యాపించింది. దానితో పాటు పరాయి పాలన నుండి ఇప్పటి వరకు రాజ్యం ప్రోత్సాహంతో ఆదివాసులలోనూ హైందవ, హైందవేతర మతాల చొరబాటు కొనసాగుతోంది. అవి సమాజంలో కొత్త చీలికలను ప్రోత్సహిస్తున్నవి. హైందవం అమానవీయమైన అంటరానితనాన్ని ప్రవేశపెడుతున్నది. దండకారణ్యంలో హైందవం స్వీకరించినవారిని మాలధారులుగా, మిగతా సోదర ఆదివాసీ ప్రజలను కత్వాలుగా సంబోధిస్తుంటారు. ప్రజలలోని పేదరికాన్నీ అజ్ఞానాన్నీ వాటిపై ఆధారపడిన అంధ విశ్వాసాలను, మౌఢ్యాన్ని ఆసరా చేసుకొని వారెరుగని మతాలు వారిపై సవారీ చేస్తున్నాయి. వాటిలో అత్యంత కరుడుగట్టిన బ్రాహ్మణవాదం లేదా హిందుత్వం రాజ్యం ప్రోత్సాహంతో అత్యంత అధివత్యంతో దూకుడుగా ప్రజలను తన ప్రభావంలోకి తెచ్చుకుంటుండగా, క్రైస్తవం చాపకింద నీరులా విస్తరిస్తూండడంతో ప్రజల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నవి. ఇవి గ్రామాలలో విప్లవోద్యమ కమిటీలను, ప్రజా సైనిక విభాగాలను చాలా చెడుగా ప్రభావితం చేస్తున్నవి. వాటి ప్రతిబింబం అ ప్రాంతాలలో పని చేసే ప్రధాన, ద్వితీయ సైనిక బలగాలపై కూడా పడుతోంది. వీటిని గోరంతలు కొండంతలు చేస్తూ పాలకవర్గాలు, పోలీసులు ప్రజలలో విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి తెగ ప్రచారానికి పూనుకుంటున్నారు. స్వచ్ఛంద సంస్థల ముసుగులో దోపిడీ వర్గాల ప్రయోజనాలను ఈడేర్చే అనేక పుట్టగొడుగు ఎన్జీవో సంస్థలు

అందుకు ఎంతగానో దోహదపడుతున్నవి. ఇవన్నీ విప్లవోద్యమాన్ని పక్కదారులు పట్టించే పాలక వర్గాల దుష్ట పన్నాగాలనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. మారుతున్న ప్రపంచ పరిస్థితులు, తీవ్రమవుతున్న పాలకవర్గాల సంక్షోభం ఒకవైపు, మరోవైపు అణచివేతలకు గురవుతున్న ప్రజల ప్రజాస్వామిక అకాంక్షలను ప్రజా సైన్యం అర్థం చేసుకొని ప్రజల ముందు పెట్టాలి. పాలకవర్గాలు తమ దుష్ట విధానాలలో భాగంగానే సమాజాన్ని ముఖ్యంగా యువత ఆలోచనలను అవినీతిమయం, నేరపూరితం చేస్తున్నాయి. దోపిడీ పాలకులు, వారి ప్రభుత్వాలు, పోలీసులు సల్వాజుడుం లాంటి శ్వేత బీభత్స కేంపెయిన్‌లను చేపట్టి ప్రజల మధ్య కొనసాగుతున్న సామాజిక విలువలను ధ్వంసం చేస్తున్నారు. ప్రధానంగా యువత విప్లవోద్యమం వైపు మళ్లకుండా లేదా ప్రజా సమస్యలపై వారు దృష్టి సారించకుండా చేయడానికి వాళ్ల మెదళ్లను మొద్దుబార్చే ప్రయోగాలు, లంపెనైజేషన్ లాంటివి అనేకం చేపడుతున్నారు. ప్రపంచం కుగ్రామంగా మారిందంటూ అంతర్జాలం అందుబాటులోకి వచ్చాక నీలి చిత్రాలు, పోర్నోగ్రఫీ, బూతు సినిమాలు ప్రతి ఒక్కరికి అందుబాటులోకి వచ్చాయి. ప్రింట్ మీడియాలో యువతను వక్రమార్గం పట్టించే అర్ధ నగ్న చిత్రాలు, మోసపు ప్రకటనలు అనేకం ఉంటూ వారిని ఆకర్షిస్తుంటాయి. విచ్చలవిడి సెక్స్, హింస, నేరప్రవృత్తిని రెచ్చగొట్టడం లాంటివి వందలాది చానెళ్ల ద్వారా ఇరవైనాలుగు గంటలు ప్రసారమవుతున్నాయి. ఇక ఫేక్ న్యూస్ ఎంతగా ప్రజలను పక్కదార్లు పట్టిస్తున్నదంటే వాస్తవాలను మరుగున పెడుతూ అవాస్తవాలను వాస్తవాలుగా నమ్మింపచేస్తున్నవి. అనేక కల్పితాలతో పాలకవర్గాలు ముఖ్యంగా అధికారంలో ఉన్న వారి విధానాలకు/ ప్రయోజనాలకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని తయారుచేయడానికి మీడియా శక్తులు ఎన్నడూ లేని విధంగా పూనుకుంటున్నాయి. యువతపై సాంస్కృతికంగా వీటన్నింటి దుష్ప్రభావం చాలా తీవ్రంగా ఉంటున్నది. ఇవి ఏదో రూపంలో విప్లవోద్యమాన్ని చాలా నెగిటివ్‌గా ప్రభావితం చేస్తున్నవి. ఈ సరుకుల సంస్కృతి, వస్తూ వ్యామోహ సంస్కృతి వెర్రితలలు వేస్తున్నది. వీటన్నింటి నుండి ప్రజా సైన్యం దూరంగా ఉండడమే కాకుండా ఆ వినాశకర సంస్కృతిని నామరూపాలు లేకుండా చేయడానికి ప్రజలను అనునిత్యం జాగరూకులను చేయాలి.

పైన పేర్కొన్న అన్ని రకాల దోపిడీ కుళ్లు సంస్కృతి ఉప ఉత్పత్తులే ప్రజా వ్యతిరేక, విప్లవోద్యమ వ్యతిరేక ఇన్ఫార్మర్లు, కోవర్టులు. వీరిలో అత్యధిక శాతం విప్లవ వర్గాలకు చెందిన శక్తులే ఉన్నప్పటికీ వారు వర్గ సంకర రాజకీయాలకు బలై పరమ స్వార్థంతో స్వంత వర్గాలకు తీరని ద్రోహం తలపెడుతున్నారు. దోపిడీ వర్గాలకు సేవ చేస్తూ వారి ప్రయోజనాలను నెరవేర్చడాన్ని గ్రామాలలో ప్రజలు సహజంగానే అసహ్యించుకుంటున్నారు. మరోవైపు, విప్లవోద్యమంలో, ప్రజా సైన్యంలో అలాంటి శక్తులు పుట్టుక రావడాన్ని మనం తీవ్రంగా పరిగణించాలి. అలాంటి శక్తుల పుట్టుకకు దారి తీస్తున్న పరిస్థితులను కూలంకషంగా పరిశీలించి వాటిని విప్లవ చైతన్యంతో మార్చాలి. అలాంటి కలుపు మొక్కల వర్గ స్వభావం, వారు విప్లవోద్యమంలో చేరడానికి పూర్వం ఉద్యమంతో వారి కుటుంబాలు కలిగి ఉన్న సంబంధాలు, దోపిడీ ప్రభుత్వ యంత్రాంగంతో వారి కుటుంబ సంబంధాలు, ప్రజలలో వారి పట్ల గల అభిప్రాయాలను గంభీరంగా పరిగణనలోనికి తీసుకొని వారిలో కార్మికవర్గ చైతన్యాన్ని, క్రమశిక్షణను, ప్రజల పట్ల విశ్వాసాన్ని జవాబుదారీతనాన్ని పెంచడానికి ప్రయత్నించాలి. అయినప్పటికీ మారని వారిని ఉద్యమం నుండి తొలగించాలి. ఈ విషయంలో చైనా అనుభవం ఈ విధంగా చెపుతున్నది.

"కొన్నిసార్లు శత్రు గూఢచారులు విజయం సాధించడానికి గల ఒక కారణం, వారు గత కొన్ని సంవత్సరాలుగా మరింత జిత్తులమారిగా మారడమేననేది నిర్వివాదం. కానీ ప్రధాన కారణం విప్లవకారులు తగినంత జాగరూకులుగా లేకపోవడమే".

విప్లవోద్యమ కార్యకర్తలు, నాయకులు, గెరిల్లా సహచరులు ప్రతి నిముషం ఎంతో చైతన్యంగా, జాగరూకతతో ఉంటే తప్ప నేటి దోపిడీ, కాలం చెల్లిన సాహితీ - కళలను తట్టుకోలేరు. ప్రమాదకర వైరస్‌లా విస్తరిస్తున్న ప్రజా వ్యతిరేక సాహిత్యాన్నీ, కళలనూ వ్యతిరేకిస్తూ ప్రజాస్వామిక విలువలను, సంస్కృతిని పెంచుకోకుండా ప్రజాస్వామిక, సోషలిస్టు అవగాహనను పెంచుకోలేం. శత్రువర్గాలు కుట్రలు, కుహకాలతో, ఉద్దేశ్యపూర్వకంగానే విప్లవోద్యమాన్ని, కార్యకర్తలను విప్లవ మార్గం నుండి దిగజార్చడానికి, నీరుగార్చడానికి ఎడతెగని ప్రయత్నాలు చేస్తుంటారు. ముఖ్యంగా ఆదివాసీ సమాజంలో ప్రజల మధ్య లోతైన సాంస్కృతిక సంబంధాలు, అనుబంధాలు, వైరి విరోధాలూ, స్వ-పర గోత్రీకుల మధ్య పెనవేసుకొని ఉంటాయి. వాటిని చాలా నేర్పుగా, తలలు పండిన అనుభవంతో టక్కరి వేషాలతో ప్రజా వ్యతిరేక పెద్దలు ఉపయోగించుకుంటూ ప్రజల మధ్య చిచ్చు రేపడానికి అనేక పాచికలు విసురుతుంటారు. వీరి వేషాలన్నీ, దుశ్చర్యలనూ నిత్య ఆచరణలో ఉన్న విప్లవకారులకు కొట్టిన పిండే! కానీ, అప్రమత్తత కోల్పేతేనే అనేక ప్రమాదాలు ఎదురవుతున్నాయి.

భారత పాలక వర్గాలు తొలి నుండి విప్లవోద్యమాన్ని అడ్డుకోవడానికి అన్ని విధాల పూనుకుంటూ భారీ నష్టాలను కలగిస్తున్నాయి. దండకారణ్యంలో కామ్రేడ్ పెద్ది శంకర్ నెత్తురు చిందించిన 2 నవంబర్, 1980నాటి నుండి ఈనాటి వరకు వేలాది మంది కార్యకార్తలు, విప్లవ ప్రజలు నెత్తుర్లు ధారపోసి సముపార్జించిన గొప్ప పోరాట అనుభవాలు, గుణపాఠాలు ఉన్నాయి.

ప్రజా సైన్యానికి మూడు రకాల కర్తవ్యాలు ఉంటాయి. వాటిలో ప్రధానమైనది శత్రు వర్గాల సైన్యాలు, అన్ని రకాల వారి భద్రతా బలగాలతో దేశ ప్రజల రక్షణ, వారి ఉద్యమ ప్రయోజనాలను కాపాడుకోవడానికై యుద్ధం చేయడం. కాగా

మిగితా రెండు కర్తవ్యాలలో ఒకటి ప్రజలతో కలిసి వారి ఉత్పత్తి కార్యకలాపాలలో పాలువంచుకోవడం, మరోటి ఉద్యమ విధానాలను, నిర్ణయాలను, సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయడం. ఈ కర్తవ్యాలను అది శక్తిమంతంగా పరిపూర్తి చేయాలంటే అది సాంస్కృతికంగా దాని స్థాయిని పెంచుకోవడం అనివార్యం. అందుకే కామ్రేడ్ మావో "సంస్కృతి లేని సైన్యం మానసిక వైకల్యంతో కూడినది, అలాంటి సైన్యం యుద్ధంలో శత్రువును ఓడించలేదు."అన్నాడు. (సాంస్కృతిక కృషిలో ఐక్య సంఘటన -మావో)

సాంస్కృతిక స్థాయిని పెంచుకోవడం అంటే మొదటే నిర్వచించుకున్న విధంగా సమాజంలోని అన్ని రంగాలలో -అర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక- తన అవగాహనను పెంచుకోవడం. ఇది దాని ప్రాథమిక విధి అవుతుంది. అది ప్రజాయుద్ధం చేస్తూ దానికి అద్వితీయంగా నాయకత్వం వహించాలంటే ప్రజలతో, పరిస్థితులతో పూర్తిగా తాదాత్మ్యం చెందాలి. శత్రువర్గాల గురించి క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. వర్తమాన హిందుత్వ పాలకులు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలను, మన దేశంలో వాటికి ఆలంబనగా నిలిచిన హిందుత్వ మత విద్వేష రాజకీయ, సాంస్కృతిక విషయాలను తెలుసుకున్నపుడే వాటిని ఓడించి దేశ ప్రజల సాంస్కృతిక వైవిధ్యాన్ని నిలబెట్టడానికి వీలవుతుంది. ప్రజల ప్రజాస్వామ్య సాంస్కృతిని సోషలిస్టు అవగాహనతో పెంపొందింప జేయడానికి అవకాశం ఉంటుంది. దీనికి విప్లవోద్యమ ప్రాంతాలే నారుమడిలా ప్రాతిపదికలుగా నిలుస్తాయి.

"మిషన్-2016", "అపరేషన్ ప్రహార్' లాంటి సైనిక ప్రతీఘాతుక దాడులతో తలపడుతూ విప్లవోద్యమం ముందుకు పురోగమిస్తున్నది. ఇందులో ఒక నూతన ప్రజా పోరాట వారసత్వ సంస్కృతి రూపొందుతున్నది. అ సంస్కృతి జనతన సర్కార్లు ఆలంబనగా రూపొందుతున్నది. అ అనుభవాలన్నీ రక్తం చిందించి సంపాదించినది. అది తిరోగామి, ప్రతిక్రియవాది సంస్కృతిని పెంచి పోషించే యధాతథ వాద సంస్కృతిని, పితృస్వామ్యానికి ప్రాతినిధ్యం వహిస్తూ వివిధ రూపాలలో పురుషాధిత్యాన్ని ఎదుర్కొంటున్నది. వర్గ పీడన, కుల పీడన, లైంగిక పీడనలకు వ్యతిరేకంగా, క్రూర అమానుష హింసలకు వ్యతరేకంగా ప్రజాస్వామిక చైతన్యాన్ని అభివృద్ధి చేస్తున్నది.

4

గ్రామాలలో రైతుల పంట పొలాల కోతలు ఉన్నాయంటే ప్రజా సైన్యం కోసం పేదలు, ఇంట్లో పని చేసేవాళ్లు లేని అనాథలు, నిరుపేదలు, విప్లవ కుటుంబాల వారు వెతుకుతుంటారు. భూమి చదును కార్యక్రమాలలో విప్లవకారులు ఎంతో శ్రద్ధగా, ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉద్యమ అవసరాల కోసం నిధులు సమకూర్చడానికై వర్క్-దేలు నిర్వహించినపుడు అందులోనూ విప్లవకారులు పాల్గొని గొప్ప శ్రమ సంస్కృతికి నమూనాగానే నిలబడుతున్నారు. ఇప్పటికీ వేసవిలో గెరిల్లాలు విడిది చేసిన చోట, అక్కడ తునికి అకు కోస్తారు, ఇప్పపూలు ఏరుతారు, చీపురు గడ్డి కోస్తారు, పేదల ఇండ్ల నిర్మాణంలో, అన్ని రకాల వ్యవసాయ పనులలో భాగం అవుతున్నారు. ఇలా ఎక్కడికక్కడే శ్రమలో పాల్గొని ప్రజలకు అన్ని రకాలుగా తోడ్పడుతున్నారు. మన విప్లవ ప్రజలకు వివిధ రూపాలలో వైద్య సేవలు అందిస్తున్నారు. వారిని విద్యావంతులను చేయడానికి ప్రాథమిక విద్యతో పాటు విప్లవ రాజకీయాలను అందిస్తూ, ప్రజా యుద్ధ సైనిక మెలకువలను నేర్పిస్తున్నారు. ప్రజలను గురువులుగా భావించి వారికి కష్టాలలో, కడగండ్లలో ఎంతగానో సేవ చేస్తున్నారు. 'వెనుకబడిఉన్న ప్రజానీకం మీద సిద్ధాంతం పని చేయదు, వారికి ప్రత్యక్ష అనుభవం అవసరం' అని లెనిన్ చెప్పినట్టుగానే విప్లవకార్యకర్తలు ఆచరణలో వారి మధ్య పని చేస్తూ వారి విశ్వాసాన్ని అపారంగా చూరగొంటున్నారు.

నూతన సంస్కృతిని నిర్మించడానికి ఇంత మౌలిక స్థాయి నుంచి విప్లవకారులు పని చేస్తున్నారు. ఈ సాంస్కృతిక క్రమం నుంచి దూరం కాకుండా పరిస్థితులకు తగినట్టు మరింత ప్రజా ఆచరణను పెంచుకోవాలి. అరోగ్యానికి హానికరమైన మద్యపానానికి, పొగాకు అలవాట్లకు దూరంగా ఉండేలా చూడాలి. యువతను పెడమార్గం పట్టించి వారిని నేరస్థులుగా, సోమరులుగా, లంపెన్‌లుగా తయారు చేయడానికి సామ్రాజ్యవాదం ప్రయత్నిస్తున్నది. అలాంటి సంస్కృతిని పెంచి పోషిస్తున్నది. అది ప్రజా వ్యతిరేకమైనది. దానితో విప్లవోద్యమం గట్టిగా తలపడాలి.

స్థానిక వనరులపై ఆధారపడి ఉత్పత్తిని పెంచడంలోనేగాక, ప్రజల ఆచార సంప్రదాయాలు, అలవాట్లు, జీవన విధానం, జీవనశైలి విప్లవకారులకు కరతలామలకం కావాలి. దేశ పరిస్థితులపై స్పష్టత, పట్టు పెంచుకోవాలి. మారుతున్న పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేయాలి. ఏనాటికానాడు మారే పరిస్థితులకు తగిన ఎత్తుగడలను ప్రజల జీవితాలతో పెనవేసుకపోయి రూపొందించుకోవాలి. ప్రజలతో దూరం కాకుండా, వారి సకల సత్సాంప్రదాయాలను, కాలం చెల్లిన వారి అచార వ్యవహారాలను వేరు చేస్తూ ముందుకు వెళ్లాలి. పితృస్వామ్య బంధనాలను తెంచుకోవడానికి ఆదివాసీ మహిళలకు అడుగడుగునా అండగా నిలవాలి. అప్పుడు వాళ్లు పోరాటశక్తిగా ఎదుగుతారు. ఈ పరివర్తనలో సంస్కృతి పాత్ర గణనీయం. మానవుల సకలశక్తి సామర్థ్యాలను విడుదల చేయగల చైతన్యం, అవగాహన, సంసిద్ధత వెల్లివిరిసినప్పుడే ప్రత్యామ్నాయ సంస్కృతి నిలదొక్కుకుంటుంది. ఈ విషయంలో విప్లవోద్యమం ఎంతో సాధించింది. అయినా దాని ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. వర్గపోరాట చైతన్యంతోనే వాటిని అధిగమించగలుగుతుంది. భారతదేశంలో ప్రత్యామ్నాయ సంస్కృతికి విప్లవోద్యమమే ఒక నమూనాను అందించగలుగుతుంది.

☆

నూరేళ్ల 'మాలపల్లి' సందర్భంగా ప్రత్యేక వ్యాసం

ఐతిహాసిక నవల మాలపల్లి

కాత్యాయనీ విద్మహే

మాలపల్లి నవల వంద సంవత్సరాలుగా తెలుగు జాతి సామాజిక సాహిత్య సాంస్కృతిక పరిణామాలతో కలిసి ప్రవహిస్తున్న జీవనది. అప్పటికి నలభై ఏళ్లుగా ఎన్ని సార్లు కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులకు అది పాఠ్య గ్రంథం అయిందో తెలియదు కానీ 1975- 1977 కాకతీయ విశ్వవిద్యాలయం ఎమ్మే తొలి బ్యాచ్ విద్యార్థులకు, ప్రత్యేకించి ఒక సెమిస్టర్‌లో ఐచ్ఛికాంశంగా నవల పేపర్‌ను ఎంచుకొన్నవారికి పాఠ్య గ్రంథాలైన నాలుగు నవలలో మాలపల్లి కూడా ఉంది. అలా అప్పటి నుండి ఈ నలభై అయిదు ఏళ్లుగా మాలపల్లి నవల నా హృదయ చైతన్యాలను ఒరుసుకొంటూ నాలో, నా చుట్టూ ఆవరించుకొనే ఉన్నది.

ఈ నవలను ఉన్నవ లక్ష్మీనారాయణ తన నలభై ఐదేళ్ళవయసులో పరిణత జీవితానుభవం నుండి వ్రాసాడు. వీరేశలింగం సంస్కరణ ఉద్యమంతో ప్రారంభించి, గిడుగు వ్యావహారిక భాషాఉద్యమం, గురజాడ సామాజిక సాహిత్య దృక్పథం, ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం, ఆది ఆంధ్రుల ఆత్మగౌరవ ఉద్యమం, జాతీయోద్యమం, ప్రపంచ రాజకీయార్థిక తాత్విక చింతనలు, ఉద్యమాలు ఆచరణ మొదలైనవాటితో ఒరిపిడి పడి పదునెక్కిన వ్యక్తిత్వం, జీవిత దృక్పథం ఉన్నవ లక్ష్మీ నారాయణది. ఈ క్రమంలో సమకాలీన సమాజంలో భావభౌతిక రంగాలలో సంచలనాత్మకమైన మార్పు దిశగా జరుగుతున్న సంఘర్షణ, సంవాదాలను నిశితంగా గమనిస్తూ వస్తున్న ఆయన ఆ మహాజీవన సంగ్రామాన్ని, సంరంభాన్ని సృజనాత్మకంగా నమోదు చేయటానికి మాలపల్లి నవల వ్రాసాడు. పల్నాడు అటవీ ప్రాంతాల పుల్లరి విధానానికి వ్యతిరేకంగా తలెత్తిన ప్రజాఉద్యమంలో పాల్గొని అరెస్ట్ కావటంవల్ల వెల్లూరు జైలులో గడిపిన ఏడాది కాలం అందుకు అవకాశం కల్పించింది. జైలు సెన్సార్‌ను, నిషేధాల నియంత్రణలను దాటుకొంటూ మనవరకు అందివచ్చిన ఈ నవల ఒక చారిత్రక అద్భుతం.

1872లో రంగరాజ చరిత్ర తెలుగులో నవలా ప్రక్రియను అంటుకట్టటానికి జరిగిన తొలి ప్రయత్నం కాగా 1878లో వచ్చిన రాజశేఖర చరిత్ర ఆ పనిని సమర్థవంతంగా పూర్తి చేసింది. అక్కడినుండి వలస సామాజిక సందర్భాలతో సంవదిస్తూ భూస్వామ్య బంధనాల నుండి విడివడుతూ ఆధునిక మానవుడు రూపొందుతున్న క్రమాన్ని వ్యక్తి చరిత్రలుగా నిరూపిస్తూ నవల గమనం సాగింది. నిజమైన అర్థంలో సామాజిక ప్రక్రియగా పరిపూర్ణత సాధించింది మాలపల్లి నవలతోనే. అందుకనే ఈ నవలతో తెలుగు నవలాసాహిత్య చరిత్ర వికాస యుగంలోకి అడుగు పెట్టింది అంటారు. తెలుగులో ఐతిహాసిక నవల ప్రారంభమైంది కూడా మాలపల్లి నవలతోనే. ఇంతకూ ఐతిహాసిక నవల లక్షణాలు ఏమిటి? మాలపల్లి నవలలో ఆ లక్షణాలు ఎంతవరకు ఉన్నాయి? మిగిలిన ఐతిహాసిక నవలలలో దీని స్థానం ఏమిటి? అన్న మూడు ప్రశ్నలతో విషయాన్ని శోధించి నిర్ధారించటం ఈ ప్రసంగ పత్రం ఉద్దేశం.

1

ఆంతరిక జీవితం, చర్యా ప్రతిచర్యలతో కూడుకొన్న బాహిర జీవితం రెండింటితో కూడిన సమగ్ర మానవ జీవిత చిత్రం ఆవిష్కరించగల అవకాశం గల ప్రక్రియ నవల. అందుకనే దానిని ఆధునిక ఇతిహాసం అన్నారు. నిజానికి ఇతిహాసం ఒక ప్రాచీన సాహిత్య ప్రక్రియ. ప్రాచీన కాలం నుండి ఇది ఇలా జరిగింది అంటూ మౌఖికంగా చెప్పబడుతూ అనేక ఏళ్ల మీద, కొన్ని తరాల మీద విస్తరించి విస్తృత జీవిత పార్శ్వాలను తాకుతూ ప్రవహించటం ఇతిహాస లక్షణం. చరిత్రను, చరిత్ర సంబంధంలో మానవ జీవిత సంబంధాలను, సంఘర్షణలను, యుద్ధాలను కూడా అది చిత్రిస్తుంది. భారతీయ సాహిత్యంలో రామాయణ మహాభారతాలు అటువంటి ఇతిహాసాలు. అలాంటి ఒక ప్రాచీన ప్రక్రియతో ఆధునిక సాహిత్య ప్రక్రియను చెప్పటం ఇతివృత్తంలోని జీవిత విస్తృతి, సమగ్రతల కారణంగానే అని చెప్పవచ్చు. ఆ క్రమంలోనే మాలపల్లి ఐతిహాసిక నవల అయింది.

కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఆంధ్ర గ్రంథమాల పక్షాన మాలపల్లి నవలను ప్రచురిస్తూ 1935 ఆగస్టు 21 (యువ సంవత్సర శ్రావణ బహుళ 8) న వ్రాసిన తొలిపలుకులో మాలపల్లి నవలను ఐతిహాసిక కోణం నుండి పరిశీలించటానికి తొలి బీజం వేశాడు. మహాభారత ఇతిహాస స్వభావం మానవధర్మ పరిణామ నిరూపకం, కర్మపరాయణమైన ప్రవృత్తి ధర్మమైన జ్ఞానపరిణామ నిరూపకం అని ప్రారంభించి, మాలపల్లి తెలుగు సాహిత్యంలో మానవధర్మ పరిణామమునకు సాధనమని ప్రతిపాదించాడు. మాలపల్లి దానికి మరొక

పేరైన సంగవిజయం రెండింటిలో ఏది సార్థకం అయినా ఈ నవల 'ధర్మ పరిణామ నిర్ణయమునందొక మహాభారతము' అని వాచ్యంగానే చెప్పాడు. రామదాసాశ్రమమైన మాలపల్లి ధర్మ సంరంభ క్షేత్రం అని, సంగదాసు సంకల్పితమైన శ్రీరామ మందిరం ధర్మ సంస్థాపనాలయము అని వివరణ కూడా ఇచ్చాడు. రామదాసు ఉదంతాన్ని భారతంలోని ధర్మవ్యాధుడి ఉదంతంతో పోల్చటం, ఆస్తి పోవటం దగ్గరనుండి ఆత్మీయులను అందరినీ కోల్పోవటం, కర్మయోగ సాధ్యమైన ఆత్మోద్ధరణకు వినియోగపడ్డాయని చెప్పటం, ఇవన్నీ మాలపల్లిని ఇతిహాసంగా నిర్ధారించేవే. ఆయన మాలపల్లి పాఠకులను సాహిత్యోపాసకులు, ధర్మాత్ములు, తత్వజ్ఞులు, భక్తులు అని సంభావించటం ఆ కోణం నుండి జరిగిందే.

కాశీనాధుని నాగేశ్వరరావు వ్రాసిన ఈ తొలిపలుకులు ఆ నవలలోని భౌతిక లౌకిక భావజాల ప్రాముఖ్యతను తగ్గించేవి అని బంగోరె సరిగానే గుర్తించాడు. (మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు, పుట 73.) కానీ నాగేశ్వరరావు మార్గంలోనే కోవెల సంపత్కుమారాచార్య, సుప్రసన్నాచార్య మొదలైన సాహిత్య విమర్శకులు మాలపల్లి నవలను ఇతిహాసిక నవల అని నిరూపించే ప్రయత్నం చేశారు. అనుమాండ్ల భూమయ్యగారి మార్గదర్శకత్వంలో సముద్రాల కృష్ణమాచార్య పిహెచ్‌డి పట్టా కోసం రూపొందించిన మాలపల్లి విమర్శనాత్మక పరిశీలన (1990) అనే సిద్ధాంత గ్రంథం ఆ మార్గంలోదే. ఇందులో రెండవ అధ్యాయం మాలపల్లి ఇతిహాసికతను చర్చించింది. 'మానవుల జీవయాత్రకు పరమార్థము నిరతిశయానందమయమైన మోక్షము' అని కాశీనాధుని నాగేశ్వరరావు తొలిపలుకుల్లో వ్రాసిన వాక్యాన్ని పట్టుకొని రామదాసుకు ధర్మరాజుతో పోలిక చెప్పి పరమ పురుషార్థమైన మోక్షాన్ని ప్రతిపాదించే శాస్త్రప్రవృత్తి మాలపల్లిలో ఉందని చెప్పాడు. ఇతిహాసంలో కనిపించే ఇతివృత్త నిర్మాణం, కథానాయకత్వం, అనుకథలు, సంఘర్షణ, కర్మఫలానుభవం, విషాదం అనే లక్షణాలు మాలపల్లిలో ఉన్నాయని వాటిని నిరూపిస్తూ ఈ అధ్యాయాన్ని వ్రాసాడు.

ఈ గ్రంథానికి ఆశంస అనే శీర్షికతో వ్రాసిన ముందుమాటలో కోవెల సంపత్కుమారాచార్య నవలలో ఆవిష్కృతమైన సమకాలీన సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక విషయాలు అప్రధాన విషయాలని, రామదాసు పొందిన 'ఆత్మ పరిణితి', పొందిన 'ఆధ్యాత్మిక అనుభూతి' మాలపల్లి గ్రంథ తాత్పర్యం అని అదే దానిని జాతి చైతన్యానికి ఉపలక్షకమైన ఇతిహాసంగా రూపొందించినట్లు అభిప్రాయపడటం గమనించవచ్చు. అనుమాండ్ల భూమయ్య ముందుమాట మాలపల్లి నవలలో భౌతిక జీవితం ప్రధానమే అయినా దాని అంతశ్శక్తి ఆధ్యాత్మిక భావానిదే అని ప్రకటించటం చూస్తాం.

వ్యక్తి ఆధ్యాత్మిక జీవితం, అన్ని భౌతిక బంధనాలనుండి విముక్తం అవుతూ మోక్షం సాధించటం ఇతిహాసిక నవల మౌలిక లక్షణం అన్నట్లుగా సాగిన ఈ పద్ధతి విమర్శ ఆధునిక యుగపు ప్రజాస్వామిక ప్రక్రియ అయిన నవలకు సముచితమైనదేనా అన్నది అసలు సమస్య. ప్రాచీన భారతీయ అలంకారశాస్త్రం పేర్కొన్న ఇతిహాస లక్షణాలను క్రోడీకరించి, భారతానికి అన్వయిస్తూ చేసిన వ్యాఖ్యానాలను, విమర్శలను ప్రాతిపదికగా చేసుకొనటం వల్ల ఉత్పన్నమైన సమస్యగా ఇది కనబడుతున్నది. అంతర్జాతీయ ఆధునిక యుగ పరిణామాల నేపథ్యంలో ఇంగ్లీషు భాషాసాహిత్యాలలో పుట్టి, తెలుగున అంటుకట్టబడిన ప్రక్రియ నవల. ఆధునిక ఇతిహాసంగా పేర్కొనబడిన నవలను ఇతిహాసంగా పరిశీలించటానికి కావలసిన సూత్రాలు ఏమిటో ప్రత్యేకంగా నిర్ధారించుకొనటం అవసరం.

ఈ దృష్ట్యా ఆధునిక ఇతిహాసమైన నవల లక్షణాలను రాల్ఫ్ ఫాక్స్, బఖ్టిన్ (BAKHTIN) మొదలైన వాళ్ళ నిర్ధారణలు ప్రాతిపదికగా ఇలా క్రోడీకరించవచ్చు.

• జీవితం కన్నా పెద్దదిగా, వైవిధ్యంతో, బృహన్నిర్మాణంగా రెండు మూడు భాగాలుగా ఉండటం.

• విస్తృతం, విశాలం, విశ్వజనీనం అయిన నేపథ్యం ఉండటం. విరివి, లోతూ రెండూ ఉండటం.

• సమాజ చరిత్రతో, రాజకీయ ఆర్థిక చరిత్రలతో ముడిపెట్టి మానవజీవిత పరిణామాలను; ప్రవృత్తులను నిరూపించటం.

• చరిత్ర సంస్కృతులను గణనీయంగా ప్రభావితం చేసే గొప్ప ఘటనలు ఉండటం.

• చరిత్రను చూసే దృక్పథాన్ని ఏ కొద్దిగానైనా ప్రభావితం చేయటం, మార్చటం.

• కొత్త ప్రపంచాన్ని నిర్మించే నాయికా నాయకులు, ప్రజలు ఉండటం. పాత్రల ద్వారా జీవితం పట్ల ఒక తాత్విక దృక్పథాన్ని వ్యక్తీకరించే సామర్థ్యం ఉండటం.

• మంచికీ, చెడుకీ, అధికారానికి, అధికార దుర్వినియోగానికి అనివార్యమైన మరణానికి సంబంధించిన వాస్తవాలను ఆవిష్కరించటం. సమకాలీన సామాజిక వాస్తవికతను భాగం చేసుకొనే సత్తా ఉండటం. వ్యక్తిని కొత్తగా సంభావించగల సామర్థ్యం ఉండటం.

• వర్ణనాత్మకంగా ఉండటం. వ్రాయబడిన కాలానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఆ కాలాన్ని ఉద్వేగంతో పాఠకుల అనుభవానికి తేవటం. చదవబడుతున్న కాలాన్ని కొత్తగా తెలుసుకొనటానికి ఉపయోగపడటం.

• జీవితాన్ని గురించిన సత్యాన్ని, సౌందర్యాన్ని ఆవిష్కరించగలగటం.

• మొదటి సారి చదువుతున్నా ఇంతకుముందెప్పుడో చదివినట్లుగా అనిపించటం. ఎప్పటికీ, ఎన్నిసార్లు చదివినా విసుగు కలిగించకపోవటం.

• ప్రతి అధ్యయనంలో మొదటి అధ్యయనంలో వలెనె కొత్తదేదో తెలుసుకొన్న అనుభవం కలగటం.

• అన్నితరాల వారికీ అది తమదే, తమకాలపు జీవితమే అనిపించటం. అన్ని తరాలవారు దానిని తమదిగా స్వీకరించగలగటం.

• నవలాకారులు కొత్త సమాజపు ఇతిహాసిక రచయితలు కనుక ఒక గొప్ప వారసత్వ చిత్రణపై దృష్టి పెడతారు.

• నవలాకారులు సామాజిక కార్యకర్తలు. నవల ఒక ఆయుధం. రాజకీయ కరపత్రం వంటి మొరటు ఆయుధం కాదు. అది రచింపబడిన కాలపు ఆయుధం.

మాలపల్లి నవలనే కాదు, ఏ నవలనైనా ఇతిహాసిక నవల అవునా కాదా అని నిగ్గు తేల్చటానికి గీటురాళ్ళు ఈ సూత్రాలు.

2

మాలపల్లి ఇతిహాసిక నవల అనటానికి మౌలిక కారణాలు మూడు. అవి ఒకటి బృహత్ నిర్మాణం, రెండు దేశకాలాల విస్తృతి. మూడు చారిత్రకత.

మాలపల్లి నవల నాలుగు భాగాలుగా తొంభై మూడు అధ్యాయాలకు విస్తరించి ఉన్న బృహత్ నవల. ఈ నవలలో మొదటి భాగం 1922 నవంబర్, డిసెంబర్ నెలలలో, రెండవ భాగం 1923 ఫిబ్రవరిలో అచ్చు అయ్యాయి. 1923 జులై నాటికి మూడవ భాగం

కూడా అచ్చు అయింది. నాలుగవ భాగంతో కలిపిన మొత్తం నవల 1935 సెప్టెంబర్‌లో ఆంధ్ర గ్రంథమాల పక్షాన ప్రచురించబడింది. (బంగోరె- మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు, 1979, పు :44, 49, 73)

ఇక దేశకాలాల విస్తృతి. ఏ కథ అయినా దేశకాల సీమితమే అయితే దాని పరిధి ఎంతవరకు విస్తరించించిందీ అన్నదానిని బట్టి ఆ నవల ఐతిహాసిక స్వభావం సంతరించుకొంటుంది. ఈ నవలలో కథ ప్రవర్తించే దేశం స్థూలంగా కోస్తా ఆంధ్రప్రాంతం. సూక్ష్మ స్థాయిలో మంగళాపురం కీలక కథా స్థలం. అక్కడి నుండి నరసరావుపేట, నాదెళ్ల, సత్తెనపల్లి, కొండవీడు, తుమ్మలపాలెం, పొత్తూరు, అమీనాబాదా, తెనాలి, విజయవాడ, గుంటూరు, తాడేపల్లి, ఉండవల్లి సెటిల్ మెంట్, నిడదవోలు, నల్లమల కీకారణ్యం, పాపికొండలు, నెల్లూరు జిల్లా రావూరి కొండలు, కర్నూలు మొదలైన ప్రాంతాలలో కథ ప్రవర్తిస్తుంది. కథ మద్రాసులో కూడా నడిచింది. విజయవాడలో జరిగిన పంచమ సదస్సులో పాల్గొనటానికి వచ్చిన వెంకటరెడ్డి హైదరాబాద్ వాడు. ఇలా నవలలో కథ కోస్తాఆంధ్రా రాయలసీమ తెలంగాణ ప్రాంతాలను కలుపుకొని విస్తరించటమే కాక పొరుగు రాష్ట్రమైన తమిళనాడుకు కూడా వ్యాపించింది. తక్కెళ్ల జగ్గడి కార్యక్షేత్రం ఆంధ్రా ప్రాంతమే కాక మద్రాస్, హైదరాబాద్, మైసూర్ రాజ్యాలు కూడా. అతని నాయకత్వంలోని సంతాలుల ఉద్యమాన్ని అణచివేయటానికి సైన్యం మద్రాస్ నుండే కాక మైసూరు, హైదరాబాద్ రాజ్యాల నుండి కూడా వచ్చింది. ఆరకంగా నవలలోని కథ రాష్ట్రాంతరాలకు కూడా ప్రవహించటం చూస్తాం. వెంకటరెడ్డి బెజవాడ సభా ప్రసంగంలో ఫ్రాన్స్, అమెరికా దేశాల ప్రజాస్వామిక ప్రభుత్వాల ఏర్పాటు, ఇటలీ, రష్యా దేశాల విప్లవాలు ప్రస్తావనకు వచ్చాయి. రామదాసు మాటల్లో కూడా బోల్షవిక్ ప్రస్తావన ఉంది. ఇంగ్లండ్, మాంచెస్టర్‌ల ప్రస్తావన కూడా వస్తుంది. ఈ అన్నీ చూస్తే మంగళాపురం అనే గ్రామంలో ప్రారంభమైన కథ విశ్వసామాజిక పరిణామాల సంబంధంలో వేయి రెక్కలతో విప్పారటం అర్థం అవుతుంది. అది ఐతిహాసిక నవల ప్రత్యేకత.

మరి నవల కథా కాలం సంగతి. ఆశ్వీజ మాసం మిట్ట మధ్యాహ్నం చేనిలో మొదలైన మొదటి భాగం కథ అంతా ఏడురోజులలో నడిచింది. సంగదాసు, రామానాయుడు కలిసి బెజవాడ వెళ్లి సంఘనిర్మాణ సభలో పాల్గొన్నారు. అది 1917 నవంబర్ 4, 5, 6 తేదీలలో బెజవాడలో జరిగిన మొట్టమొదటి ప్రాదేశిక పంచమ సదస్సు అనటానికి అనేక ఆధారాలు ఇతివృత్తంలో భాగమై కనిపిస్తాయి. అగ్రవర్ణ ఆసామి రామానాయుడు, సంగదాసు కలిసి వెళ్తున్న సభ గురించి స్టేషన్లో మునసబు ఆరా తీస్తున్నట్లు దానికి సభాపతి ఎవరు అని అడిగినప్పుడు రామానాయుడు వెంకటరెడ్డిగారు అని చెప్పాడు. అయితే మా రెడ్ల సభా ఏమిటీ అని మునసబు మరొక ప్రశ్న వేసాడు. దానికి సమాధానంగా రామానాయుడు కాదు, అది పంచముల సభ అని చెప్పి వెంకటరెడ్డి రెడ్డి గాడు, వూరక పెట్టుకొన్న పేరు అని వివరణ ఇచ్చాడు. బెజవాడలో జరుగుతున్న సభ, ఆదిమాంధ్రుల సభ, సభాపతి వెంకటరెడ్డి రెడ్డి కాడు... ఈ మొదలైన అంశాలను బట్టి అది 1917 నవంబర్ 4, 5, 6 తేదీలలలో జరిగిన సభ అని, సభాపతి వెంకటరెడ్డి భాగ్యరెడ్డి వర్మే అని నిర్ధారించుకోవచ్చు. ఊరికే ప్రస్తావించి వదిలెయ్యటం కాక దళిత ఉద్యమ నిర్మాణంలో నిర్ణయాత్మకమైన ఆ సభను, సమగ్రస్థాయిలో నవల ఇతివృత్తంలో భాగం చేయటం ద్వారా ఉన్నవ సమకాలీన సామాజిక పరిణామాల వాస్తవికతను 'డాక్యుమెంట్ చేసినట్లయింది.

ఆ సభను అగ్రవర్ణ హిందూ సంస్కరణవాది గూడూరు రామచంద్రరావు ఏర్పాటు చేసాడు. ఈయనే నవలలో నిర్వహణ కార్యదర్శులలో ఒకరుగా చెప్పబడిన రామేశ్వరరావు అయివుంటాడు. 1917 నవంబర్ నాటి 'మొట్టమొదటి ప్రాదేశిక పంచమ సదస్సుగా పేరొందిన' విజయవాడ సదస్సును నాలుగేళ్ల తరువాత ఇతివృత్తంలో భాగంచేసి, భాగ్యరెడ్డి వర్మను నమూనాగా చేసుకొని వెంకటరెడ్డి పాత్రను సృష్టించి, తన ఆదర్శ నమూనా అయిన సంగదాసు సరసన నిలబెట్టి మాలపల్లి నవల కథను నడిపిస్తూ ఆనాటి సభ తీర్మానాలతో సహ అన్నిటినీ ప్రస్తావిస్తూ ఉన్నవ చేసిన ఈ ప్రయోగం 1917 నాటి ఒక నిర్దిష్ట చారిత్రక సందర్భం నుండి నవలలో కథకు గమనాన్ని నిర్దేశించింది.

నవల నాలుగవ భాగంలో చౌరీచౌరా ప్రస్తావన ఉంది. రామదాసు అహింసా ధర్మాన్ని గురించి జైలు సహచరులతో మాట్లాడుతూ 'స్వచ్ఛమైన మన మార్గం బొంబాయి చౌరీచౌరాలలో మైలబడ్డది. మహాత్ముడు మనమింకా తగినంత గురుశిక్ష పొందలేదనీ, స్వర్గరాజ్యానికింకా అర్హులం గామని ఎంచి ప్రయాణం ఆపమన్నాడు' అంటాడు. గాంధీ ఆపమన్నది సహాయనిరాకరణ ఉద్యమ ప్రయాణం. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటిష్ ఇండియా ప్రెస్ సెన్సార్ షిప్ విధించింది. విచారణ లేకుండా వ్యక్తులను జైళ్లలోకి తోస్తున్నది. రౌలట్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ ఈ సెన్సార్ నిబంధనలను కఠినతరంగా అమలు చేయటానికి సూచనలు చేసింది. ఈ రౌలట్ చట్టానికి (18 మార్చ్ 1919), జలియన్ వాలాబాగ్ దాడికి స్పందిస్తూ గాంధీ అహింసామార్గంలో సత్యాగ్రహ ప్రకటనను సిద్ధాంతంగా చేసి సహాయనిరాకరణ ఉద్యమాన్ని 1920 సెప్టెంబర్‌లో ప్రకటించాడు. దీనిని సమర్థవంతంగా కొనసాగించగలిగితే ఒక్క ఏడాదిలో స్వరాజ్యం సాధించగలుగుతాం అని తీర్మానించాడు కూడా.

ఆ సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగానే సారాయి తాగకుండా ప్రజలను ప్రబోధించటం, తద్వారా ప్రభుత్వ సారాయి అమ్మకాలను అడ్డుకొనటం ఒక కార్యక్రమంగా ముందుకు వచ్చింది. సారాయి ఇజారాదారులు, ప్రభుత్వోద్యోగులు జనం చేత సారాయి తాగించటానికి విశ్వ ప్రయత్నం చేస్తూ, జనుల తాగే స్వతంత్రతను నిరోధిస్తున్నారని బోధకులపై కేసులు పెట్టి, నిర్బంధించిన సందర్భాలు అనేకం. చౌరీచౌరా అలాంటి ఒక చారిత్రక ఘటన. చౌరీచౌరా ఉత్తరప్రదేశ్‌లో గోరఖ్‌పూర్ జిల్లాలోని ప్రాంతం. 1922 ఫిబ్రవరి 2న మద్యం అమ్ముతున్న దుకాణం పైకి పికెటింగ్‌కు వెళ్లిన వాళ్ళను పోలీసులు అరెస్టు చేస్తే వాళ్ళ విడుదల కోరుతూ వేల మంది జనం ధర్నాకు దిగారు. పోలీసు కాల్పులతో ఆగ్రహోదగ్రులు అయిన జనం పోలీస్ స్టేషనుకు నిప్పు పెట్టారు. దీనితో మనస్తాపం చెందిన గాంధీ ఫిబ్రవరి 12న సహాయనిరాకరణోద్యమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించాడు. ఆ ఘటనను ప్రస్తావించటాన్ని బట్టి 1917లో మొదలైన నవలా కథ 1922 వరకు అయిదేళ్ల కాలం మీద పరుచుకున్నదని స్పష్టం అవుతున్నది. తక్కెళ్ల జగ్గడు కేసు విచారణ తరువాత తీర్పు ఇయ్యబడిన తేదీ 8-2-1922 అని నవలలో పేర్కొనబడింది కూడా. ఆ రకంగా ఈ నవలలో కథను 1917 నాటి సామాజిక చారిత్రక ఘటనకు 1922 నాటి రాజకీయ చారిత్రక ఘటనకు మధ్య అయిదేళ్ల కాలచట్రంలో పటం కట్టాడు ఉన్నవ.

3

మాలపల్లి నవలలో కథ రామదాసు చౌదరయ్యల కుటుంబ సంబంధాలు, సంఘర్షణల పరిణామరూపం అన్నట్లుగా కనిపించినా కులం, వర్గం, రాజ్యం, మతం మొదలైన ప్రమేయాల వల్ల ఇతివృత్తం సమకాలీన సాంఘిక ఆర్థిక రాజకీయ మత చారిత్రక విషయాల అల్లికలో విస్తృతం, సాంద్రం అయింది. నవలకు ఐతిహాసిక స్వరూప స్వభావాలను సమకూర్చే గుణాలలో ఇది కూడా ఒకటి.

సాంఘిక అంశాన్నే తీసుకుందాం. మాలపల్లి నవలలో ప్రధానమైన అంశం దళిత సమస్య. అంటరానితనం దానికి ప్రథమ వ్యక్తీకరణ. నవల ప్రారంభంలోనే రామదాసు ఇంట్లో రాత్రి భోజనాల సమయంలో జరిగిన సంభాషణలో జ్యోతి తండ్రిని ఇక్కడి దేవుడి గుడిలోకి మనలను రానీయరేమి అని ప్రశ్నిస్తుంది. చిన్నపిల్లలు కూడా గుర్తించే స్థాయిలో, ఆలోచించే స్థాయిలో అస్పృశ్యత అమలవుతున్న స్థితి. బడులు, గుడులు, బావులు, చెరువులు మొదలైన ఉమ్మడి ప్రజా ప్రయోజనాలకోసం ఏర్పడిన ఏ ప్రాంతంలోకి మాల మాదిగల ప్రవేశం నిషిద్ధమే. పోరంబోకులో శ్రీరామ మందిర నిర్మాణానికి అనుమతి కావాలని సంగదాసు కాయితం పెట్టుకొన్నది ఈ పరిస్థితులలోనే.

సంగదాసు మరణించాక పెద్దదినం నాడు జరిగిన సంఘపీఠం ఏర్పాటు సభలో చర్చకు కేంద్రం కులమే. దానిని ధిక్కరిస్తూ మాట్లాడినవాడు అప్పదాసు. తన అభిప్రాయ ప్రకటనకు అతను వాడుకున్నది బ్రహ్మంగారి తత్వాలను. ఆంజనేయ మంటపం మీద కూర్చున్న కంఠంరాజు 'ఇక్కడ బ్రాహ్మలం కూర్చున్నాం తాకుతారా ఏమీ ..' అని హెచ్చరించినప్పుడు బ్రహ్మంబేదో తెలుపండయ్యా అని సవాల్ చేసింది అప్పదాసే. బ్రాహ్మడైనా మరొకడైనా 'మూత్రపు గవి దాటి వచ్చినవాళ్లేనని' నూచించి కంఠంరాజు ఆధిక్యతను తిరస్కరించాడు. ఘనమైన కులం కాని కులం అన్న వర్గీకరణను నిరాకరించాడు. సభ చివరిలో అప్పదాసు రచించి పాడిన చరమగీతము అనే యాల కూడా మాలల సాంఘిక ఆర్థిక స్థితిని చెప్పేదే. సంగడిని సంబోధించి చెప్పున్నట్లు సాగే ఈ గీతంలో ఒక చరణం... "మొక్కాబోతే గుళ్లే లేవు... ఎక్కాబోతే బళ్ళే రావు – కుడువ పూటకూళ్లే లేవురా ఓ జ్ఞాన సంగా ! చదువునైనా బళ్లే లేవురా"... గుడికి, బడికి, ప్రయాణ సాధనాలకు, పబ్లిక్ భోజన శాలలకు కులం వల్ల పరాయీకరింపబడటం గురించిన వేదనను వ్యక్తం చేసే చరణం ఇది.

ఆ సభలో రామదాసు ప్రసంగం కూడా కులం వల్ల కొందరిని హీనంగా చూసే పద్ధతికి ఆత్మగౌరవ ప్రేరితులై 17వ శతాబ్దిలోనే తగు సమాధానాలు ఇచ్చిన గురుత్రయం– వీరేబ్రహ్మేంద్ర స్వామి, దూదేకుల సిద్దయ్య, యాగంటి లక్కప్ప– తత్వాలను ఉటంకిస్తూ కంఠంరాజు మాటలకు సమాధానం ఇస్తున్నట్లుగానే సాగటం గమనించవచ్చు.

దళిత సమస్య గురించిన గాంధీ అవగాహనలోని రెండు అంశాలు మాలపల్లి నవలలో ప్రధానమైనవి. అవి – ఒకటి బళ్ళు పెట్టి, చదువులు చెప్పి, వృత్తులు నేర్పి అంటరానివాళ్ళ అభివృద్ధికి తోడ్పడటం. రెండు – హిందూ సంఘంలో భాగంగానే వాళ్ళు ఉండేట్లు చూడటం. ఈ పనులు చేయవలసినది అయితే ఇన్నాళ్లు వాళ్ళు జ్ఞానానికి, గౌరవానికి, మర్యాదాపూర్వకమైన జీవితానికి పరాయీకరించబడటానికి బాధ్యులైన సవర్ణ హిందువులు. కాకపోతే అప్పుడప్పుడే ఆత్మగౌరవ చైతన్యం రెక్క విప్పుకొంటున్న దళితులు. రామానాయుడు, సంగదాసు ఆ రెండు వర్గాలకు ప్రతినిధులు. అస్పృశ్యతను పాటించకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ, సంగదాసును తాను సంబోధిస్తున్నట్లుగానే అతను కూడా తనను ఏకవచనంలో సంబోధించాలని ఆశిస్తూ, దళిత జన సంక్షేమానికి పాటుపడటానికి సంసిద్ధత కనబరచే రామానాయుడు, దళితుల సాంఘిక హక్కులు ఎంత ముఖ్యమైనవో – కూలీ నాలీ జనంగా ఆకలి తీరని, శ్రమకు తగిన ఫలితాలు పొందలేని స్థితిలో ఉన్న– దళితుల ఆర్థిక హక్కులు కూడా అంతే ముఖ్యమైనవి అనుకునే సంగదాసు కలిసి బెజవాడలో జరుగుతున్న పంచముల సభకు, ఆదిమాంధ్రుల సభకు వెళ్లినట్లుగా చిత్రించటం ఈ నవలలో కీలకమైన విషయం.

సంగదాసు సభాపతి వెంకటరెడ్డికి రామానాయుడిని పరిచయం చేస్తూ "వారికి మన సంఘము మీద గల అభిమానం ఇంతని చెప్పటానికి వీలు లేదు" అని చెప్పాడు. ఆ సందర్భంలో వెంకటరెడ్డి రామేశ్వరరావుతో పాటు రామచంద్రయ్య చౌదరి, రామజోగి, భీమసేనరావు వంటి అగ్రవర్ణులు ఆదిఆంధ్రుల అభ్యున్నతికి అంకితమైన తీరును అభినందనపూర్వకంగా ప్రస్తావిస్తాడు. అందుకు స్పందిస్తూ రామానాయుడు "మా అభిమానం యెంత, ఇదివరకు మా సంఘాలు, దిగువజాతులకు చేసిన అపకారాన్ని బట్టి చూస్తే ఇది ఉపకారమే కాదు. పాపపరిహారానికి మేము ప్రయత్నపడుతున్నాము" అన్న మాటలు గమనించదగినవి.

అగ్రవర్ణుల ఆత్మవిమర్శను వ్యక్తీకరించిన ఈ మాటలను ఇద్దరూ పంచములే అయినప్పటికీ సంగదాసు, వెంకటరెడ్డి స్పందించిన తీరు భిన్నంగా కనబడుతుంది. బుద్ధిపూర్వకంగా అపకారం చేశారని నేనను అని సంగదాసు దానిని 'ఉపేక్ష'కు కుదించి చెప్పాడు. వెంకటరెడ్డి దానిని ఆమోదించక 'పై కులాలు మనకు బుద్ధిపూర్వకంగా అన్యాయం చేశారనే నా అభిప్రాయం.' అన్నాడు. అది గతమే కాదు, వర్తమానం కూడా అన్నది అతని దృఢమైన విశ్వాసం. వర్ణాశ్రమ వృత్తివిభజనను సమర్థిస్తున్నట్లుగా సంగదాసు మాట్లాడిన దానిపట్ల కూడా వెంకటరెడ్డికి అభ్యంతరాలు ఉన్నాయి. ఎవరి ఇష్టం వచ్చిన వృత్తులను వారు అవలంబిస్తారు అని వృత్తి సౌకర్యాన్ని అతను ప్రతిపాదిస్తే వృత్తిసాంకర్యం సమాజనిర్మాణ వినాశనకరం అని సంగదాసు భావించాడు. బ్రాహ్మణులకు ఏ వృత్తిని కేటాయించక సంఘమే వాళ్ళను పోషించవలసిందని చెప్పిన బ్రాహ్మణీయ మనుధర్మం పట్ల సంగదాసుకు వలే వెంకటరెడ్డికి సానుభూతి లేదు. 'సోమరులుగా కూర్చోమన్నారు' అని ఆ స్థితిని వ్యాఖ్యానిస్తాడు. అందులో నిరసన గర్భితమయ్యే వుంది.

సంగదాసు మొత్తం హిందూ సంఘం బాగు గురించి మాట్లాడుతుంటే 'మన సంఘం బాగయ్యే యేర్పాటు ముందు జూడండి. పుట్టికెక్కిన తరువాత స్వర్గానికెక్కవచ్చు' అని వెంకటరెడ్డి జోక్యం చేసుకొని చెప్పిన మాటలు దళిత ఉద్యమ సిద్ధాంతం, ఆచరణ రెండూ దళిత ప్రజల ప్రయోజనాల కేంద్రంగా మాత్రమే జరగాలని సూచిస్తున్నాయి. అయితే తల్లి సంఘం యొక్క క్షేమం విడిచి పిల్ల సంఘాల క్షేమానికి మాత్రమే పూనుకొనటం సరైంది కాదన్నది సంగదాసు అభిప్రాయం. 'మహాసంఘం యొక్క క్షేమానికి ప్రయత్నం ప్రత్యేకంగా చేయలేకపోయినా మహా సంఘ నిర్మాణ రాస్తాను గుర్తెరిగి దానికి అనుసంధానంగా చిన్న సంఘాల అభివృద్ధికి పాటుపడితే పెద్ద సంఘం యొక్క అభివృద్ధికి ఒక విధంగా తోడ్పడ్డవాళ్ళమే అవుతాం' అని ఆనాడు సంగదాసు నోట ఉన్నవ పలికించిన భావార్థపు వెలుగులో నేటి అస్తిత్వ ఉద్యమాల గమనాన్ని, గమ్యాన్ని గురించిన ఆలోచనలు ఈ తరం పాఠకులలో రేకెత్తక మానవు.

దళిత జనాభ్యుదయం గురించిన సంగదాసు దృక్పథం

హిందూమత తాత్విక పరిధికి లోబడినది కాగా వెంకటరెడ్డి దృక్పథం దానిని ధిక్కరించటం నుండి రూపొందింది కావటం ఈ భిన్నత్వానికి ఒక కారణం. 1913 నుండే బుద్ధజయంతులు జరుపుతూ హిందూ వర్ణవ్యవస్థ పైన, వర్ణాశ్రమ వృత్తివిభజన పట్ల, ధర్మాలపట్ల హేతుబద్ధ ప్రశ్నలతో విమర్శనాత్మక వైఖరిని అభివృద్ధి చేసుకొంటూ వస్తున్న భాగ్యరెడ్డివర్మ స్వభావాన్ని వెంకటరెడ్డి పాత్ర వ్యక్తిత్వంలో భాగం చేయటంలో ఉన్నవ ఆ మేరకు విజయం సాధించినట్లే. అయితే ఉన్నవ లక్ష్మీనారాయణగారి దళిత జనాభ్యుదయ దృక్పథానికి ప్రాతినిధ్యం వహించే పాత్ర సంగదాసే కానీ వెంకటరెడ్డి కాదు. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి, ఆర్థిక సమానత్వ సాధనకు సంబంధించిన కార్మికోద్యమ చైతన్యానికి లోబడిన దృక్పథం అది. అందువల్లనే సంగదాసు చర్చించిన విషయాలు విన్న తరువాత 'కొన్ని అభిప్రాయములు మారినవి' అని వెంకటరెడ్డి చేత అనిపించి సంగదాసుది పైచేయి చేయటం చూస్తాం.

1917 బెజవాడ సభలో భాగ్యరెడ్డి వర్మ పంచమ కులం అనే భావనను ఖండిస్తూ వర్ణవ్యవస్థలో అయిదవ తరగతి ప్రస్తావన లేదని నిరూపించి, అంటరానివర్గాలను అఖిలభారత స్థాయిలో ఆది హిందువులు అనీ, తెలుగు ప్రాంతాలలో ఆదిఆంధ్రులు అనీ వ్యవహరించాలని చేసిన ప్రతిపాదనల ప్రస్తావన ఈ నవలలో వెంకటరెడ్డి ఉపన్యాసంలో భాగం కానేలేదు. అట్లాగే దేవాలయ ప్రవేశం వృథా ప్రయాస అనీ ఆ ఉద్యమం వల్ల అంటరానివారికి ఒనగూడే ప్రయోజనాలు ఏవీ లేవనికూడా ఆయన ఈ సభలో అన్న మాటలు కూడా అతని ఉపన్యాసంలోకి రాలేదు. దిగువజాతుల చరిత్రను, ప్రస్తుత దీనస్థితిని, దళిత ఉద్యమ అవసరాన్ని, వ్యాప్తిని గురించి వెంకటరెడ్డి మాట్లాడాడని ఒక మాట చెప్పి రష్యాలో వచ్చిన సోషలిస్టు విప్లవ విజయాల గురించే ప్రధానంగా అతని ఉపన్యాసం సాగినట్లుగా కల్పన చేసాడు ఉన్నవ.

1917 నాటి ఆ సదస్సులో 18 తీర్మానాలు ఆమోదించబడ్డాయి. నవలలో చర్చకు వచ్చిన తీర్మానాలు 14 మాత్రమే అయినప్పటికీ సారంలో ఇవి 1917 సదస్సు తీర్మానాలకు ఎడంగా పోయినవి మాత్రం కాదు. దళితులు నీచమైన పేర్లు పెట్టుకోకూడదు, అన్న, అక్క, అమ్మ, అయ్య వంటి మర్యాదావాచకాలను పేర్ల చివర చేర్చుకోవాలని చేసిన తీర్మానం మనుస్మృతిపై మొదటి తిరుగుబాటు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన విద్యాలయాలు, దేవాలయాలు, బావులు, చెరువులు, సత్రాలు మొదలైన వాటిని ఉపయోగించుకునేందుకు నిమ్నజాతుల హక్కును ఆమోదించి అనుమతించాలని చేసిన తీర్మానం 1917నాటి ఉద్యమం ముందుకు వచ్చిన ప్రజల ఆకాంక్షల ఫలితం. ఆదిఆంధ్రుల పిల్లలకు ఉచిత విద్యను అందించే ప్రత్యేక పాఠశాలలను, వసతిగృహాలను ఏర్పరచాలన్న తీర్మానం అందులో భాగమే. ఆదిఆంధ్రులకు బంజరు భూములియ్యాలన్న ఆనాటి తీర్మానం అడవులలో వ్యవసాయానికి పనికి వచ్చే భూములను దరఖాస్తు పెట్టుకొన్న పంచములకు ఇయ్యాలనీ , అలా ఇచ్చేటప్పుడు పంచమ క్రైస్తవులకే అవి పోకుండా హిందూ పంచముల సంఖ్యను బట్టి వారికి రావలసిన భూములు వారికే ఇప్పించవలసిందనీ, ఇల్లు కట్టుకొనటానికి స్థలం కేటాయింపు, ద్రవ్యసహాయం ఇయ్యాలనీ కొంత విస్తృత స్థాయిలో ఈ నవలలో భాగమైంది. మున్సిపాలిటీలు, శాసన మండలి, జిల్లా తాలూకా బోర్డులు - మొదలైన వాటిలో దళితులను సభ్యులుగా నియమించాలన్న 1917నాటి సభా తీర్మానాలు ఇందులోకి అసలు రాలేదు. ఆ స్థానంలో పోలీసు, రెవిన్యూ, ఫారెస్ట్, సివిల్, మిలటరీ మొదలైన శాఖలలో కిందిస్థాయి ఉద్యోగాలు దళితులకు కేటాయించవలసినదన్న తీర్మానం వచ్చింది. జీతగాండ్లకు, ఇతర కూలీలకు ఓటుహక్కు, మద్యపానాది దుర్వ్యసనాలను మానుకొనటం, స్నానం మొదలైన శౌచ పద్ధతులను పాటించటం, బహిరంగ ప్రదేశాలలో పంచములను దూరస్థులను చేసే అస్పృశ్యత, వ్యవసాయరంగంలో పనివాళ్ళ కూలిరేట్ల పెంపు మొదలైన అంశాలపై తీర్మానాలు నవలలో కొత్తగా వచ్చి చేరాయి. ఈ విధంగా సమకాలీన ఆదిఆంధ్ర ఉద్యమ గతితో సంవాదాన్ని, సంఘర్షణను, సమన్వయాన్ని కూడా భాగం చేసుకొన్న నవల మాలపల్లి. ఈ నవలలో రామానాయుడు అన్న వెంకటయ్య పంచమోద్యమంలోకి పూర్తిగా ప్రవేశించి తన ఆస్తిని, శక్తిని దానికి వినియోగిస్తున్నట్లుగా ఇతివృత్తాన్ని పరిణమింపచేయటం చూస్తాం. (ఇంకా ఉంది)

మహాసభల్లో ఆవిష్కరించిన పుస్తకాలు

పుస్తకం	ఆవిష్కరించినవారు
1. అమ్మ జ్ఞాపకాలు (ఆలూరి లలిత స్మృతిలో)	భవాని
2. ఈ వేళప్పుడు (అరసవిల్లి క్రిష్ణ కవిత్వం)	దగ్గుమాటి పద్మాకర్
3. భూమిరంగు మనుషులు (కెక్యూబ్ వర్మ కవిత్వం)	శివరాత్రి సుధాకర్
4. ఖబర్ కే సాత్ (శ్రీనివాసమూర్తి కథలు)	ఎన్ వేణుగోపాల్
5. సాహిత్య లేఖలు (వి చెంచయ్య)	కాత్యాయని విద్మహే
6. సాహిత్య స్పందన (వి కోటయ్య)	సి.యస్.ఆర్.ప్రసాద్
7. రెప్పవాల్చని కాపల (ఎన్ వేణుగోపాల్ కవిత్వం)	వి.చెంచయ్య
8. ఫాసిజం (ముక్తవరం పార్థసారధి)	రమాసుందరి
9. తత్వశాస్త్రం అంటే ఏమిటి (ముక్తవరం పార్థసారధి అనువాదం)	కోడం కుమార్
10. సైరన్ (అల్లం రాజయ్య నవల)	పద్మకుమారి
11. పూల పరిమళం (కోడం కుమార్ కవిత్వం)	మోతుకూరి శ్రీనివాస్
12. విప్లవ కెరటం (గద్దం కోటరెడ్డి)	మోహన్ మురళి
13. దృశ్యాంతరం (నాగేశ్వరాచారి సాహిత్య వ్యాసాలు)	పాణి
14. అటుగా వంగిన ఆకాశం (వైష్ణవి శ్రీ కవిత్వం)	నల్లూరి రుక్మిణి
15. ఉన్నవ వెంకట రామయ్య జీవిత చరిత్ర (సంగ్రామ్)	మేఘరాజ్
16. కనిపించని శత్రువు (మెట్టు మురళీధర్ నవల)	టి. రాజ్యలక్ష్మి
17. ప్రకృతి వ్యవసాయం-బహుజన బతుకమ్మ	విమల
18. నల్లమల పరిరక్షణ-బహుజన బతుకమ్మ	అనిత
19. వర్తమానం (కట్టా భగవంత రెడ్డి)	మోతుకూరి శ్రీనివాస్

సౌహార్ధ సందేశాలు

కాత్యాయని విద్మహే
ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక

రమాసుందరి
'మాతృక' సంపాదకవర్గం

విమల
అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఎసిఎఫ్)

పున్నవ నాగేశ్వరరావు
ప్రజా కళామండలి

చొప్పర జాలన్న
అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏఎస్ఎస్)

వెల్లంకి వెంకటేశ్వర్లు
పౌరహక్కుల సంఘం

సురేష్
ఇండియన్ అసోషియేషన్ ఫర్ పీపుల్స్ లాయర్స్

శ్రీనివాసరావు
దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం

కొండారెడ్డి
ప్రగతిశీల కార్మిక సమాఖ్య

లక్ష్మణరావు
అమరుల బంధుమిత్రుల సంఘం

వివిధ అంశాలపై మాట్లాడుతున్న వక్తలు

ప్రతిమ


మెట్టు రవీందర్

అరసవిల్లి క్రిష్ణ

రివేరా

కాశీం

పాణి

సియస్ఆర్ ప్రసాద్

వరలక్ష్మి

రామచంద్రం

రాంకి

కోడం కుమార్

శివరాత్రి సుధాకర్

పతాకావిష్కరణ

KRSA101M 109

UNATARA A Literary and Cultural Monthly Journal RNI Regn. No. 21152/72
JANUARY, 2022 VOL: 50, ISSUE : 1, VIJAYAWADA

EDITED, PRINTED, PUBLISHED BY ARASAVILLI KRSIHNA AND OWNED BY DUVVURI VENKATA KRISHNA RAO. PRINTED AT VISALAANDHRA VIGNANA SAMITHI, CHANDRAM BUILDINGS, CHANDRA RAJESWARA RAO ROAD, MACHAVARAM (PO), VIJAYAWADA - 520 004, ANDHRAPRADESH STATE (NEW DECLARATION FILED), PUBLISHED AT 6-1/16-7A/1, PEDDIRAJU STREET, PRIZER PETA, VIJAYAWADA - 520 001, ANDHRAPRADESH STATE, EDITOR : ARASAVILLI KRISHNA

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA101M109
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	12
తయారు చేసినది	vedavathi
పేజీలు విడదీసినది	vedavathi
స్కాన్ చేసినది	sharmila
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	GOOD.